
# భీష్మ @ మేనేజ్‌మెంట్ & గవర్నెన్స్

నవీన ధర్మాలకు సనాతన మూలాలు



ప్రయాగ రామకృష్ణ



# భీష్మ @ మేనేజ్‌మెంట్ & గవర్నెన్స్

## నవీన ధర్మాలకు సనాతన మూలాలు

ప్రయాగ రామకృష్ణ

**భీష్మ @ మేనేజ్‌మెంట్ & గవర్నెన్స్ (ప్రసంగ కథామాలిక)**

ముఖచిత్రం, బొమ్మలు : **చంద్ర**

ప్రతులు : 500

నాలుగవ ప్రచురణ : 2017

డి.టి.పి. :

నాలుగవ ముద్రణ : **కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్,** హైదరాబాద్. ఫోన్ : 2761 8261

వెల రూ. 100/- (US : $ 6)

ప్రతులకు :
**ప్రయాగ రామకృష్ణ**
ఫోన్ : 98499 90107

విశాలాంధ్ర బుక్‌హౌస్ (అన్ని శాఖలు); నవోదయ (విజయవాడ); నవచేతన పబ్లికేషన్స్ (అన్ని శాఖలు) సాహిత్యనికేతన్, హైదరాబాద్; తెలుగు వెలుగు (హైదరాబాద్)

అన్నిహక్కులూ రచయితవి. ఈ పుస్తకాన్ని / కొంత భాగాన్ని అనువాదం / అనుకరణ / అనుసృజన కోసం లేదా ప్రచార ప్రసార మాధ్యమాలకోసం ఉపయోగించదలచినా రచయిత అనుమతి తప్పనిసరి.

# విషయసూచిక


| | |
|---|---|
| 1. రాజమార్గం | 1 |
| 2. పాలకుని లక్షణాలు | 5 |
| 3. ప్రొవైడర్ ఆఫ్ ది అన్‌ప్రొవైడెడ్ | 9 |
| 4. మినిస్టర్స్ షుడ్ యాక్ట్ ఇన్ లార్జర్ నేషనల్ ఇంటరెస్ట్ | 13 |
| 5. నీరు... మీరు... డబ్బు | 17 |
| 6. పీపుల్స్ పార్టిసిపేషన్ | 24 |
| 7. లోటు బడ్జెట్లు – ఓటు బడ్జెట్లు | 30 |
| 8. నాయకుని గుణగణాలు | 35 |
| 9. ఎదిగేకొద్దీ ఒదగాలి | 39 |
| 10. ఆఫీసర్లు – పేషీలు | 43 |
| 11. శీలం సకల శ్రేయోమూలం | 48 |
| 12. అసలైన చదువు | 53 |
| 13. హ్యూమన్ క్యాపిటల్ | 58 |
| 14. కాలమే అన్నిటికీ కారణం | 63 |
| 15. సమయనిర్వహణ | 68 |
| 16. సమర్థులకే పోటీ ప్రపంచంలో స్థానం | 73 |
| 17. సిబ్బందితోనే 'బిగ్ బి' సక్సెస్! | 77 |
| 18. హౌ టు మోటివేట్ ఎంప్లాయీస్ | 81 |
| 19. రైట్ టు ఫుడ్ | 87 |
| 20. గివ్ ఫుడ్... గివ్ ఫుడ్... గివ్ ఫుడ్... | 91 |
| 21. అతిథి సేవ | 96 |
| 22. స్పిరిచువాలిటీ కోషెంట్ | 101 |

23. బాహ్యదృష్టి – అంతర్దృష్టి 106
24. క్రియేటివిటీ ఉండాలి 110
25. మనీ ఎర్నింగ్ ఈజ్ ఎ బిగ్ గాంబిల్ 114
26. యాక్షన్ అంటే నటన కాదు! 118
27. పబ్లిక్ సర్వీస్ క్యాంపెయిన్ 123
28. నెత్తిమీద పిచికలు 128
29. నమ్మతగని వాళ్లను నమ్మనే కూడదు! 131
30. మైండ్ కంట్రోల్ 136
31. భూతదయ 140
32. సమాచార హక్కు 144
33. పార్టిసిపేట్ ఇన్ సమ్‌వన్స్ గ్లోరీ 149
34. బూరుగ గర్వభంగం 153
35. స్ట్రెస్ మేనేజ్‌మెంట్ 156
36. నాయకులు విలువల్ని పోగుచెయ్యాలి! 161

**P.V.R.K. PRASAD,** IAS
Director General &
E.O. Special Chief Secretary to Govt.
General Administration Department.

**Dr. MCR HRD Institute of A.P.**
Road No.25, Jubilee Hills,
Hyderabad - 500 033
Tel : (O) 23548294, (R) : 23350813
Fax : 040-23548489/040-23548887
E-mail : hrd@hrdiap.gov.in

# ఆశీరభినందన చందనం

*భారతీయ సంస్కృతీప్రాభవాలను భారత, భాగవత, రామాయణాలు, ఉపనిషత్తులు వెల్లడిస్తున్నాయి. మానవ సంబంధాలు, ఆచరణ రీతులు మెరుగుపడడానికే గాక, మానవ వనరులు వృద్ధి పొందడానికి కూడా ఇవి ఎంతగానో ప్రోది చేస్తున్నాయి. పురాణాలు పాతపడిపోయాయనీ, అవి ఈనాటి అవసరాలను తీర్చలేవనీ భావించే వారి సంఖ్య క్రమంగా తగ్గిపోవడం గమనార్హం, గణనార్హం!*

*పతంజలి ఈ విషయాన్ని అందమైన కోణంలో చెప్పారు. "సంస్కర్తా కురుతే కావ్యం పురాణంచ పునర్నవమ్" అంటారు. సంస్కర్తలు కావ్యాలు ప్రాచీన మైనప్పటికీ, వాటిని నిత్యనూతనం చేస్తుంటారట!*

*మన ప్రయాగ రామకృష్ణ ఈ పనిని సమర్థంగా చేసి చూపించారు. ప్రయాగ చేసిన మరొక ప్రయోగం ఇది. ఇతః పూర్వమే ఆయన తన ఉపనిషత్కథల రచనల ద్వారా, ప్రచార మాధ్యమాల ద్వారా 'కార్పొరేట్' నిర్వాహకులకు ఉపయోగపడే అనేక విషయాలను, మెళకువలను ప్రాచుర్యంలోకి తెచ్చారు. ప్రస్తుతానికి 'పంచమవేదం' అనబడే భారతాన్ని ఎంచుకున్నారు. ఇది ఒక చమత్కార కథనం. ఎలాగైనా సమాజంలో మంచిని పంచాలనీ, పెంచాలనీ ఆయన తపన. ఈ లక్ష్యసాధనలో ప్రయాగ చేసే ప్రతిపనీ ఒక యాగమే అన్పిస్తుంది. ఎదుటివారిని ఒప్పించడమంటే యాగమే మరి!*

*ప్రయాగ దీనిని పురాణంవలె మనకు విన్పించే ప్రయత్నం చేయలేదు. ఒక శిక్షణావేత్తగా తాను గ్రహించిన, నేర్చిన అంశాలను మనకు అందించే ప్రయత్నం (Transfer of Learning) చేశారు. ఒకరికి విషయ పరిజ్ఞానం ఉంటుంది. మరొకరికి తెలిసిన విషయాన్ని వేరొకరికి బదిలీ చేసే కౌశలం ఉంటుంది. ఈ రెండూ ఒక్కనిలో ఉంటే జ్ఞానం చెలామణిలోకి వస్తుంది. ప్రాచుర్యాన్ని పొందుతుంది. తరువాతి తరానికి అందుతుంది. సమాజం బలోపేతం అవుతుంది. శిక్షణా సంస్థల ఆవశ్యకత నిజానికిదే కద! ప్రయాగ భారతతంత్రాలను, సమాచారాన్ని బదిలీ చేసే నైపుణ్యాన్ని సాధించిన*

*శిక్షణావేత్తగా ఇందులోని విశేషాలను కూర్చారు. అందువల్ల శిక్షణా సంస్థలకు కూడా ఇది పరిశీలక గ్రంథం అవుతోంది.*

*ఇందులో ఒక చక్కని కథను ప్రస్తావించడం జరిగింది. అది 'శీల' సంపదను పరిరక్షించుకోవాలని హెచ్చరిస్తూ చెప్పిన కథ. ఇంద్రుడు మారువేషంలో ప్రహ్లాదుడి దగ్గర చేరతాడు. ఆయనను సేవిస్తాడు. ప్రసన్నుడైన ప్రహ్లాదుడు ఇంద్రుడి సేవలకు తృప్తి చెందుతాడు. ఏమైనా కోరుకోమంటాడు. ఇంద్రుడు 'శీలా'న్ని ఇప్పించమంటాడు. ప్రహ్లాదుడు తన శీలాన్నిస్తాడు. శీలం వెళ్ళిపోవడంతో క్రమంగా తేజోమయరూపంలో వున్న ధర్మం, సత్యం, సత్ప్రవర్తనం, బలం, చివరకు లక్ష్మి (ఐశ్వర్యం) కూడా వరుసగా వెళ్ళిపోతాయి ప్రహ్లాదుడ్ని విడిచి. 'అదేమిటి!' అంటే ఇవి పరస్పరాశ్రయాలు, పరస్పర పూరకాలు, పోషకాలు. లక్ష్మి వెళ్ళిపోతూ ప్రహ్లాదుడితో అంటుంది 'శీలం పోయాక ఇక మిగిలేదేముంటుంది?' అని. అంటే పాలకులకూ, పాలితులకూ, యజమానులకూ శీలసంపదే ముఖ్యమనీ, ఇంద్రియాలకు లొంగిపోయిన వాడు చతురంగ బలాలున్నా నశిస్తాడనీ, అన్ని తపస్సుల్లోకి శ్రేష్ఠమైనది ఇంద్రియనిగ్రహమేననీ చెప్పిన భీష్ముడి ఆప్తవాక్యాలను శ్రవణశుభగంగా విన్పిస్తాడు మన ప్రయాగ.*

*'ధర్మశ్శీలం తథావృత్తం బలం చైవతథాప్యహమ్'*
*శీల మూలామహాప్రాజ్ఞ సదా నాస్త్యత్ర సంశయః ॥*

*(లక్ష్మీదేవి ప్రహ్లాదునితో) (శాంతిపర్వం 124-62)*

*ఇంత మంచి ఇతివృత్తాలను ఒకచోట చేర్చి, కూర్చి, పేర్చి యజమాను లకూ; కార్యనిర్వాహకులకు తమ నిత్య వ్యవహారాలలో ఉపయుక్తంగా ఉండేందుకు శ్రీ ప్రయాగ రామకృష్ణ చేసిన కృషిని హార్దికంగా ప్రశంసిస్తూ, ఆశీరభినందన చందనాన్ని అందిస్తున్నాను. ఇదే పట్టున శ్రీ రామచరితామృత సాగరమైన వాల్మీకాన్నీ మథించి, ఆ సుధాస్వాదుఫలాలను కార్యనిర్వాహకులకు అందించాలనీ, అందుకు తగిన సమయ సామర్థ్యాలను అనుగ్రహించ వలసినదిగా భగవంతుడ్ని ప్రార్థిస్తూ – ఈ హృద్యమైన అవసరనైవేద్యాన్ని సహృదయపాఠకులు సాదరంగా స్వీకరిస్తారని ఆశిస్తాను.*

*జయోస్తు!*

***(పి.వి.ఆర్.కె. ప్రసాద్)***

# ప్రస్తావన

**నా** చిన్నప్పుడు మా ఊరిదేవాలయంలోను, వీధి మొగదలల్లోను హరికథలు, పురాణ కాలక్షేపాలు జరుగుతుండేవి. ఇరవై రోజులు, నెల్లాళ్లు, ఒక్కోసారైతే మండలం రోజులు జరిగేవవి. రామాయణ భారత భాగవతాలు, అష్టాదశ పురాణాలు స్వయంగా చదివి స్వారస్యాన్ని గ్రహించలేని పామరజనానికి జనరంజకంగా చెప్పి మళ్ళీ జీవితంలో మర్చిపోలేనంత కమ్మగా గుర్తుండేలా చేసేవారు హరిదాసులు, పురాణ పండితులు.

'గాంధీగారు చెప్పిన బేసిక్ ఎడ్యుకేషన్ అనేది వేరు కావచ్చు కాని, మనదేశంలో గ్రామాల్లో ఈ హరికథలు, పురాణాలు ఒక గొప్ప బేసిక్ ఎడ్యుకేషన్‌గా తరతరాలుగా పనిచేస్తూ వచ్చాయి. సినిమా సంస్కృతి వచ్చి అన్నిటినీ పూర్తిగా తుడిచి పెట్టేసింది. అందుకుతోడు ఇప్పుడు సినిమా సంస్కృతితోపాటు ఇంగ్లీషు విద్యావ్యామోహం ప్రబలి కాన్వెంటు చదువులు దేశమంతా అల్లుకున్నాక ఏ ఇంట్లోనూ చేత వెన్నముద్ద లేదు, చెంగల్వపూదండ లేదు, దసరా పద్యాల్లేవు. ఈ కాన్వెంటు చదువులతో తయారైన పిల్లలు, వాళ్ళ తల్లులు మన సంస్కృతి నుంచి ఎలీనేట్ అయిపోతున్నార'ని పురాణం సుబ్రహ్మణ్యశర్మగారు అంటుండేవారు. నిజమే అనిపిస్తుంది. సంప్రదాయ సాహిత్యాన్ని, పురాణేతిహాసాలను చదవడంవలన ప్రజలు శాస్త్రీయ విజ్ఞానానికి, హేతువాదానికి దూరమైపోతారని గోల చేసేవారూ ఉన్నారు.

అయితే, రామాయణ మహాభారతాలను, ఉపనిషత్తులను ఇప్పుడు అధునాతన చదువులకు, ఆధునిక అధ్యయనాలకు అన్వయించుకుంటూ ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని నాకు ఈ మధ్యనే తెలిసింది. అహమ్మదాబాదులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌వారు ఆర్గనైజేషనల్ లీడర్‌షిప్‌పై నిర్వహించిన ఒక శిక్షణా కార్యక్రమంలో భారతంలోని పాత్రలను పేర్కొంటూ హ్యూమన్

బిహేవియర్‌ను అర్థం చేసుకునేందుకు అవి ఎలా దోహదం చేస్తాయో చెప్పారట. 'One of the purposes of great literature is to understand human behaviour. And that is an area where the case study method we generally employ just does not work' అని ఐఐఎమ్ఎ ఫాకల్టీ మెంబర్ ఎస్.మణికుట్టి అన్నారు. మహాభారతం ఆధారంగా ఐరావతి కార్వే రాసిన 'యుగాంతం', బిమల్‌కర్, బొకిల్ కథల్లోని పాత్రలను సమీక్షిస్తూ, వాటినుంచి పాఠాలు నేర్చుకోవడం ఒక గొప్ప అనుభవమని ఐఐఎమ్ శిక్షణకు హాజరైన ఐఎఎస్ అధికారి ఎ.పి.వి.ఎన్.శర్మ చెప్పారు. సో, లిటరేచర్ – బేస్డ్ మేనేజ్‌మెంట్ కోర్సులు వచ్చేశాయన్నమాట.

కార్పొరేట్ సెక్టార్‌లో ఇప్పుడు 'లీడర్‌షిప్' అంటే టీమ్ మేనేజ్‌మెంట్ అండ్ సెన్స్ ఆఫ్ ఎంపతీ. జట్టును సమర్థంగా ముందుకు నడిపించటం, జట్టులోని వారందరూ సంలీనమై పని చేసేలా వారిని ఏకమనస్కుల్ని చేయడం, 'ఈ సంస్థ మనది' అన్న భావనను వారిలో కలగచేయడం. ఎంపతీ ఈజ్ ఇంపార్టెంట్. ఇప్పుడు పెద్ద పెద్ద సంస్థల కార్యనిర్వహణాధికారులందరూ రామాయణ భారత భాగవతాలనుంచి, ఉపనిషత్తులనుంచి, కౌటిల్యుడి అర్థశాస్త్రం నుంచి, శుక్రుడి రాజనీతినుంచి, విదురనీతినుంచి, భీష్ముడి ఉపదేశాలనుంచి మేనేజ్‌మెంట్ చిట్కాలు తెలుసుకుంటున్నారు. దిస్ ఈజ్ సంతింగ్ గ్రేట్.

అహ్మదాబాద్‌లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో ఒకప్పుడు పాశ్చాత్య సాహిత్యం ఆధారంగా సాగిన కోర్సులన్నీ ఇప్పుడు ఇండియన్ వర్క్స్ ఆధారంగా సాగుతున్నాయి. దీనివల్ల, 'The quality of discussion has gone up greatly' అని అక్కడి విజిటింగ్ ప్రొఫెసర్ సంపత్‌సింగ్ చెప్పారు. 'అవునా!' అంటూ మీరు ఆశ్చర్యపడిపోవాల్సిన మరో విషయం కూడా చెబుతాను. సందీప్ వాస్లేకర్ అని ముంబయిలో ఓ పెద్దమనిషి వున్నాడు. సంక్షోభాల్ని పరిష్కరించడంలో దక్షుడిగా అతనికి చాలా పేరుంది. ప్రపంచవ్యాప్తంగా శాంతి సాధనకోసం

అనుసరించాల్సిన సరికొత్త విధానాల్ని, ఇన్నోవేటివ్ అప్రోచెస్‌ను శోధించేందుకు ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ పీస్ ఇనీషియేటివ్స్ అనే సంస్థను పదేళ్ళక్రితం ఆయన నెలకొల్పారు. ఆక్స్‌ఫర్డ్‌లో చదువుకున్న వాస్లేకర్ ఉత్తమ ప్రజాపాలనం అంటే ఏమిటో వివరిస్తూ 'ధర్మరాజ్యం' అనే పుస్తకం కూడా రాశారు. ఒకసారి కాన్ఫ్లిక్ట్ మేనేజ్‌మెంట్ గురించి మాట్లాడుతూ ఆయన, 'సంక్షోభాల నివారణకు కావల్సిన చిట్కాలన్నింటినీ నేను మహాభారతం లాంటి భారతీయ కావ్యాలు, ఇతిహాసాల నుంచి తీసుకుంటాను' అని చెప్పారు. అదీ ఆయన మంత్రం. ఈ ఉపోద్ఘాతమంతా ఎందుకంటే సక్సెస్‌ఫుల్ ఎగ్జిక్యూటివ్స్‌గా, చీఫ్ ఎగ్జిక్యూటివ్స్‌గా, బాసెస్‌గా, బిగ్ బాసెస్‌గా మారేందుకు కావల్సిన టిప్స్ అన్నీ భారతంలో భీష్ముడు ఏనాడో చెప్పాడని మీకు విన్నవించుకునేందుకు.

మేనేజ్‌మెంట్ కాన్సెప్ట్స్‌ని మనం పశ్చిమ దేశాల నుంచి దిగుమతి చేసుకున్నామని వాదించే విదేశ భక్తులు వుంటే వుండొచ్చుగాక! నేను మాత్రం విశ్వసించను. ఇన్ ఫాక్ట్ ఇట్ వాజ్ ది అదర్ వే రౌండ్. కార్యనిర్వహణ, కర్తవ్య నిర్వహణలకు సంబంధించిన విజ్ఞానం చాలా వరకు మన దేశంలోనే ఆవిర్భవించింది. ఇక్కడ నుంచే అది విశ్వవ్యాపితమైంది.

పశ్చిమ దేశాలలోని కార్పొరేట్ మేనేజ్‌మెంట్ గురి అంతా సంపాదన మీదే! కానీ, మన మేనేజ్‌మెంట్ చదువుల లక్ష్యం అది కాదు. జీవితమూ దాని పరమార్థమూ సమాజమూ సమాజహితమూ విలువలూ ప్రమాణాలూ ప్రాతిపదికగా వాటికి రూపకల్పన చేశారు. 'వాల్యూ ఎడ్యుకేషన్, వాల్యూ మేనేజ్‌మెంట్ లీడ్ టు వాల్యూ సొసైటీ' అన్నది మన నమ్మిక. అదే మన చదువులకు ఆలంబన. దాన్ని ఒడిసిపట్టుకునేందుకూ, మన చదువులలోని మర్మాలు తెలుసుకునేందుకూ భారతీయ చింతనను అర్థం చేసుకునేందుకు ఎక్కడెక్కడి మేనేజ్‌మెంట్ గురువులూ ఇప్పుడు ఆరాటపడుతున్నారు. అదీ మన గొప్ప.

భీష్ముడు కురువంశీయులకు తాత. ఇంద్రాది దేవతలకు కూడా పూజ్యుడు. కపటం లేనివాడు. పరశురాముని దగ్గర విద్య నేర్చిన ఘనుడు. గంగానది పుణ్యగర్భాన పుట్టాడు. ఉదాత్తుడు, నియమవ్రతుడు. చ్యవనుడు, మార్కండేయుడు మొదలైన మహామునుల వల్ల సర్వధర్మాలు తెలుసుకున్నాడు. ఆ మహానుభావుడు సమస్త శస్త్రాస్త్ర ధర్మవిదుడు. విద్యలన్నిటినీ ఆకళించుకున్నవాడు. భూత భవిష్యద్వర్తమానాలు తెలిసినవాడు. ఆడవాళ్లనూ ఆడపేరు గలవాళ్లనూ పుత్రులు లేనివాళ్లనూ చూస్తే ఆయన ఆయుధ మెత్తడు. ఆడదై పుట్టి విధివశాన పురుషత్వం పొందిన వాళ్లతో ఆయన యుద్ధం చెయ్యడు. శిఖండి అలాటివాడేగా! అందుకని 'అతన్ని ముందు పెట్టుకుని రణభూమికి వస్తే నేను యుద్ధం చెయ్యడం మానేస్తాను. ఆ సమయంలో నన్ను పడగొట్టవచ్చు' అని తన నెలా గెలవాలో తనే చెప్పాడు ధర్మరాజుతో. అది విన్న అర్జునుడు చాలాసేపు మథనపడ్డాడు, 'ఇది రాజధర్మమా, క్రూరకర్మమా' అని. చివరికి కృష్ణుడిమాటే వినాల్సివచ్చింది. అర్జునుడు శిఖండిని ముందుంచుకుని యుద్ధంలో చెలరేగాడు. మహాస్త్రాలు గుప్పించాడు. దానితో సూర్యుడు అస్తగిరిమీద వాలినట్టు తూర్పుతలగా యుద్ధభూమిలో తూలిపడ్డాడు భీష్ముడు. ఆయన శరీరం కిందపడకుండా ఒంటిన దిగబడ్డ బాణాలు ఆధారమయ్యాయి. అలా శరతల్పంమీద ఒరిగిన భీష్ముడు ఉత్తరాయణ పుణ్యకాలం వచ్చేవరకు ప్రాణాల్ని శరీరంలో పట్టి ఉంచాడు. 'ఆయన అస్తమించాడంటే లోకం చంద్రుడు లేని రాత్రిలా చీకటిమయమవుతుంది. సకల జ్ఞానసంపదలూ ఆశ్రయం లేక మరుగున పడతాయి. కనుక మీరిప్పుడే ఆయన దగ్గరకు వెళ్లి సమస్త ధర్మాలూ అడిగి తెలుసుకోండి' అని కృష్ణుడు పాండుకుమారుల్ని తీసుకుని భీష్ముడున్న చోటుకి వెళ్ళాడు. అప్పటికి ఇంక సరిగ్గా యాభై ఆరు రోజులకు సూర్యుడు ఉత్తరాయణంలో ప్రవేశిస్తాడు. అందుకని ఈలోగా కృష్ణుడు ఆయనకు మూడు వరా లిచ్చి బాణాలబాధ తెలీకుండా, ఆకలిదప్పులు లేకుండా, సకల భూత ప్రవర్తనలూ ఆయనకు కనిపించేలా చేశాడు. అప్పటినుంచి కృష్ణ భగవానుని

ఆదేశంమేరకు భీష్ముడు కర్తవ్యనిర్వహణ, కార్యనిర్వహణలపై పాండవులకు చక్కని బోధ చేశాడు. ఆయన చెప్పిన హితవచనాలకు, రాజనీతి ధర్మాలకు సాటివచ్చే మేనేజ్‌మెంట్ పాఠాలు ఈ నాటికీ కనిపించడం లేదు. ఎన్నిసార్లు చదువుకున్నా, ఎన్నిసార్లు చెప్పుకున్నా తనివితీరని రుషిప్రోక్తమైన భీష్మమంత్రాలను మీకు అందిస్తున్నందుకు ఆనందంగా ఉంది.

**– ప్రయాగ రామకృష్ణ**

ఈ పుస్తక ప్రచురణకు సహకరించిన శ్రీ కె.ఐ. వరప్రసాదరెడ్డి,
శ్రీమతి లక్ష్మీరత్నం, శ్రీ ఐలాపురం వెంకయ్య, శ్రీ పి.వెంకటేశ్వర్లు గార్లకు
ధన్యవాదాలు.

# 1. రాజమార్గం

ప్రజలంటూ ఉన్నప్పుడు పాలకులూ ఉండాలి. రాజంటారో, స్వామంటారో, మంత్రంటారో, చీఫ్ ఎగ్జిక్యూటివ్ అంటారో అది మీ ఇష్టం. పేర్లు మారినా వాళ్లు గమనించితీరాల్సిన అంశాలు మాత్రం ఒక్కటే. అవి అందరూ తెలుసుకోవాలి. తెలుసుకుని తీరాలి. అధికారంలో ఉన్నవాళ్ళు ధర్మపరులై ఉండాలి. నీతి తప్పనివాళ్ళై ఉండాలి. కార్య సాఫల్యంకోసం విడవకుండా ప్రయత్నం చేయాలి. ప్రయత్నవంతుడికి దైవం కూడా తోడ్పడతాడు. శాంతి, ఉత్తమశీలం గల రాజు సౌఖ్యం పొందుతాడు. రాజు, మంత్రి, రాష్ట్రం, దుర్గం, ధనాగారం, స్నేహితులు, సైన్యం అనే ఏడింటినీ ప్రకృతులనీ, సప్తాంగాలనీ అంటారు. వీటికి హాని రాకుండా చూసుకోవాలి. సత్ప్రవర్తన, సత్యవాక్పరిపాలన కలిగి ఉంటేనే అది సాధ్యమవుతుంది. అన్నిటికీ రక్ష దండనీతి! మెళకువతో దండనీతిని అనుసరించాలి. దుర్గాలన్నిటిలోనూ నరదుర్గమే శ్రేష్ఠం. నరదుర్గమంటే నాలుగు వర్ణాల ప్రజలన్నమాట. వాళ్ళందర్నీ రాజు సమానంగా చూసుకోవాలి. అందరిపట్ల దయ కలిగి ఉండాలి. కేవలం శాంతివంతుడుగా కూడా ఉండకూడదు.

అధికారిగాని, ప్రభువుగాని అతి మృదువుగా ఉంటే మావటివాడు ఏనుగు నెక్కినట్టు దిగువ ఉద్యోగులూ ప్రజలూ నెత్తికెక్కి కూర్చుంటారు. క్రూరుడైతే అందరూ తిడతారు. కనుక వసంతకాలపు సూర్యుడిలా తగిన మార్దవం, కాఠిన్యం కూడా చూపించాలి. రాజధర్మాల్లో ఇది చాలా ముఖ్యమైంది. దండించేటప్పుడు చాలా జాగ్రత్తగా విచారించి మరీ శిక్షించాలి. తన ఇష్టం వచ్చినట్టు చేసి ప్రజలకు నొప్పి కలిగించకూడదు. బిడ్డను కనబోయే తల్లి తన సంతానికి అనువైన ఆహారం తిన్నట్టే రాజు కూడా తొందరపడక ప్రజలకెలా అనుకూలమో అలా నడుచుకోవాలి. పరిహాసంలో తేలుతూ, భృత్యులతో చనువుగా సంభాషించే రాజును ప్రజలు లక్ష్యపెట్టరు.

అందుచేత ప్రభువు అన్నవాడు ఎప్పుడూ బిగువు వదలి సంచరించకూడదు. వివేకం లేకుండా గర్వంతో ప్రవర్తించేవాళ్లని దగ్గరకు చేరనివ్వకూడదు. ప్రజలను చక్కగా పాలించడంవల్ల ఉత్తమగతులు కలుగుతాయి. రాజన్నవాడు సంధి, విగ్రహం (విరోధం), యానం, ఆసనం, ద్వైదీభావం, సమాశ్రయం అనే ఆరు గుణాలనూ జాగ్రత్తగా చూసుకోవాలి. సరైన పద్ధతిలో ధనం సంపాదించాలి. తప్పులు కప్పిపెట్టి కట్టుకథ లల్లేవాళ్ళను నమ్మకూడదు. అవినీతిపరులను ఒక కంట గమనిస్తూ ఉండాలి. ఎవరినీ ఎక్కువగా నమ్మకూడదు. అలా అని అసలు నమ్మకుండాను ఉండకూడదు.




ఎవరినీ నమ్మకపోవడం మృత్యువుతో సమానం. ఎక్కువగా నమ్మడం అకాల మృత్యువుతో సమానం. నమ్మీ నమ్మకుండా పనులు చేయించుకోవడం తెలివైనవాళ్ళ లక్షణం.

రాజైనవాడు అందరినీ సూక్ష్మదృష్టితో పరిశీలిస్తూ ఉండాలి. మేలు చేసేవాడే మిత్రుడు. అతని ఆధ్వర్యంలో సర్వకార్యాలూ శుభకర మవుతాయి.

కాని, మిత్రుడు కదా అని అతని పైనే కార్యభారమంతా మోపి రాజు ఏమరుపాటుగా ఉండకూడదు. ప్రశంసలకు పొంగిపోకుండా, అవమానానికి బాధపడకుండా న్యాయమార్గంలో పనులుచేసే మంచిమిత్రుణ్ణి రాజు ఏరుకోవాలి. అతన్ని తనంతటి వైభవవంతుణ్ణి చేయాలి. రాజుకు బలగం ఎంత ఎక్కువగా ఉంటే శత్రువులంత ఎక్కువ భయపడతారు. బలగం లేకపోతే చులకనగా చూస్తారు. ఎక్కువతక్కువ మాటలొస్తాయి. మోసాలు జరుగుతాయి. కనుక తనకు కీడు కలగకుండా ఉండాలంటే సాధ్యమైనంత ఎక్కువమందిని రాజు కూడగట్టుకోవాలి. ప్రతి రాజుకు ధర్మమార్గంలో ధనార్జన చేసేవాడు ఒకడు ఉండాలి. అయితే, అతనికి అందరూ చేటు చేయాలని చూస్తారు. కనుక రాజు అతన్ని జాగ్రత్తగా రక్షించుకోవాలి. ఈ విషయంలో ఒక కథ చెప్పాడు భీష్ముడు.

**ఎవరినీ నమ్మకూడదు. అసలు నమ్మకుండానే ఉండకూడదు. అపనమ్మకం మృత్యువుతో, అతి నమ్మకం అకాల మృత్యువుతో సమానం.**

*కోసల దేశానికి క్షేమదర్శి ప్రభువుగా ఉండేవాడు. ఒకరోజు కొలువుతీరి ఉన్న సమయంలో కాలకవృక్షీయ మహాముని వేంచేయగా ప్రభువు గబగబ ఎదురువెళ్లి మహర్షిని సకలమర్యాదలతో తీసుకువచ్చాడు. పద్మ సింహాసనంలో ఆయనను కూర్చోబెట్టి బంగారుపళ్లెంలో కాళ్ళు కడిగి మధుపర్కం సమర్పించాడు. ప్రభువులవారి ఆదరోపచారాలతో సంతృప్తిచెందిన కాలకవృక్షీయ మహర్షి క్షేమదర్శిని దగ్గరకు పిలిచి తన దగ్గరున్న పంజరం చూపించాడు. అది చూసి సభలోని వారితోపాటు మహారాజు కూడా ఆశ్చర్యపోయాడు. పంజరంలో చిలక ఉండాల్సిందిపోయి వికారంగా ఉన్న ఒక కాకి ఉంది. ఆ కాకిని ముద్దుగా అందరికీ చూపించి, 'ఇది మామూలు వాయసం కాదు. దీనికి భూత భవిష్యత్ వర్తమానాలు తెలుసు' అని మహర్షి తెగపొగిడాడు. తరువాత మహారాజు వైపు తిరిగి*

**కాకిని అందరికీ చూపించి, 'ఈ వాయసానికి భూత భవిష్యత్ వర్తమానాలు తెలుసు' అని కాలకవృక్షీయ మహర్షి పొగిడాడు.**

*'నువ్వు ధనార్జనాది కార్యాల్లో అశ్రద్ధ చూపిస్తున్నావు. దానివల్ల కలుగుతున్న అనర్థమంతా ఈ కాకి నీకు చెబుతుంది. నీకు అపకారం తలపెడుతున్న దుర్మార్గుల్ని కూడా పట్టి ఇస్తుంది' అని చెప్పి పంజరం ఆయన చేతికిచ్చి వెళ్లిపోయాడు.*

*మరునాడు మహర్షి వచ్చేసరికి రాజప్రాసాదంలో మహారాజు విచారంగా కూర్చుని ఉన్నాడు. మహర్షిని చూస్తూనే, 'స్వామీ! తమరు ఇచ్చిన కాకిని రాత్రి ఎవరో చంపేశారు' అని బాధపడుతూ చెప్పాడు. 'మహారాజా! కాకి తమ దుశ్చర్యలను ఎక్కడ బయటపెడుతుందోనని నీ అధికారులు భయపడ్డారన్న మాట. లేకపోతే కాకిని చంపాల్సిన అవసరం లేదు. నేనూ, నీ తండ్రీ మంచి స్నేహితులం. ఆయన చనిపోయాక ఈ రాజ్యంలో ఉండటం ఇష్టంలేక అడవులకువెళ్లి తపస్సు చేసుకుంటున్నాను. నీమీద ఉన్న పుత్రవాత్సల్యంతో నీ క్షేమం తెలుసుకుందామని వచ్చాను. రాజ్యమంతా తిరిగాను. నువ్వు మంచివాడివే అయినా అధములైన అధికారులవల్ల నువ్వూ, నీ ప్రజలూ నష్టపోతున్నారు. ఈ సంగతి నీకు చెప్పడానికి కాకి మిష పెట్టుకుని వచ్చాను. కాకి చావడంవల్ల నీకు కీడు తలపెడుతున్నవాళ్లెవరో ఉన్నారని స్పష్టంగా తెలుస్తోంది. నువ్వు జాగ్రత్తగా కనిపెట్టి చూస్తే ఇంకా కొన్ని రహస్యాలు బయటపడొచ్చు. నీ అధికారులకు ఒకరిలో ఒకరికి భేదం కల్పించి తెలివిగా ఒక్కొక్కర్నే నీవైపుకు తిప్పుకో. నీకు అపకారం తలపెడుతున్నవాళ్లెవరో తేలికగా తెలిసిపోతుంది' అని సలహా ఇచ్చాడు కాలకవృక్షీయుడు. క్షేమదర్శి మహర్షి చెప్పినట్టే చేసి తన రాజ్యానికి ఆయననే మంత్రిగా చేసుకున్నాడు ●*

# 2. పాలకుని లక్షణాలు

**రా**జ్యానికి రాజు ఆత్మలాటి వాడు. అతనే మార్గదర్శి. రాజ్యం అస్తిత్వానికీ, అభ్యున్నతికీ కూడా అతనే ప్రధానకారకుడు. కనుక రాజ్యం చల్లగా ఉండాలంటే సమర్థుడూ, విజ్ఞుడూ, దయగల తండ్రీ పరిపాలకుడుగా ఉండాలి. రాజు ధర్మమార్గాన నడుస్తూ, రాజ్యంలో జరుగుతున్న విషయాలను సాకల్యంగా తెలుసుకుంటూ, తప్పు చేసినవాళ్లను దండిస్తూ, ఒప్పు చేసినవాళ్లను సమాదరిస్తూ, ప్రజలను దయతో రక్షిస్తూ పరిపాలన చేస్తే భూమి కామధేనువు లాగా కోరిన కోరికలన్నింటినీ తీరుస్తుందని భారతం చెబుతోంది. కాని, ఇందుకు విరుద్ధంగా, ప్రజలనూ, ప్రజల ఆస్తుల్నీ రక్షించవలసిన మహారాజే నిర్దయగా వాళ్ల సంపదలను అపహరిస్తే అమాయకప్రజలేం చేయగలరు?

*ఒకసారి విశ్వామిత్రుడు వశిష్ఠుని ఆశ్రమానికి సపరివారంగా వచ్చాడు. వశిష్ఠుడు ఆయనను ఉచితరీతిన గౌరవించి ఆతిథ్యం ఇచ్చాడు. వశిష్ఠుడు చేసిన విందు ఏర్పాట్లకు విశ్వామిత్రుడు ఆశ్చర్యపోయాడు. కొన్ని వందలమందికి ఏకకాలంలో మృష్టాన్నభోజనం! రకరకాల భక్ష్య, భోజ్య, చోష్య, లేహ్యపదార్థాలు! 'ఇప్పటికిప్పుడు ఇన్ని పదార్థాలు ఎలా చెయ్యగలిగారు?' అని అడిగాడు విశ్వామిత్రుడు. వశిష్ఠుడు నవ్వి, తన దగ్గర ఉన్న నందినీధేనువును చూపించి, 'ఇది కామధేనువు! కోరినవన్నీ చిటికలో అభివర్షిస్తుంది' అని చెప్పాడు. విశ్వామిత్రుడికి నందినిమీద మోజైంది. ఎలాగైనా దాన్ని తన సొంతం చేసుకోవాలనుకున్నాడు. దాన్ని*

**'ఇది కామధేనువు! కోరినవన్నీ చిటికెలో అభివర్షిస్తుంది' అని వశిష్ఠుడు చెప్పాడు.**

*తనకిమ్మని అడిగాడు. వశిష్ఠుడు మర్యాదగానే విశ్వామిత్రుడి అభ్యర్థనను తోసిపుచ్చాడు. దానితో విశ్వామిత్రుడికి కోపం వచ్చింది. అగ్గిమీద గుగ్గిలం అయ్యాడు. పెనంమీద పేలగింజ అయ్యాడు. నందినిని తీసుకురమ్మని పరివారాన్ని పురమాయించాడు. వాళ్ళు దాన్ని బలవంతాన పట్టుకొచ్చి తమ వెంట రాజ్యానికి తీసుకుపోయారు.*

*పరులవలన బాధ వొరయకుండఁగ సాధు*
*జనుల ధనము గాచు జనవిభుండు*
*కరుణ దప్పి తాన హరియించు వాఁడగు*
*నేని సాధులోకమేమి సేయు?*

*విశ్వామిత్రుడు మహారాజు. ప్రజల శ్రేయస్సును కాంక్షించవలసిన వాడు. ప్రజల రక్షణం చెయ్యవలసినవాడు, ప్రజల సంపదను కాపాడాల్సినవాడు. ఆయనే ధర్మం తప్పి, నీతి మాలి, దయ మాలి, సిగ్గు మాలి ప్రవర్తిస్తూంటే ఎవరేం చెయ్యగలరు? వశిష్ఠుడు చూస్తూ ఊరుకున్నాడు.*

కంచే చేను మేస్తే, పాలించవలసినవాళ్లు పాలించకపోతే ప్రజలపాట్లు కుక్కలు కూడా పడవు. అరాజకమైన రాజ్యంలో అకాలమరణాలు, దారిదోపిడీలు, పూజితులకు అవమానాలు ఎక్కువవుతాయి. ధర్మం కుంటుపడుతుంది. అధర్మం రాజ్యం చేస్తుంది.

**అన్యాయం, అధర్మం అన్నవి మాన్యులు చేసినా, సామాన్యులు చేసినా ఒక్కటే! రాజైనంత మాత్రాన మినహాయింపు ఉండదు.**

ఇతరుల సొత్తు ఎవరు అపహరించినా నేరమే.

రాజైనంత మాత్రాన మినహాయింపు ఉండదు. అన్యాయం, అధర్మం అన్నవి మాన్యులు చేసినా, సామాన్యులు చేసినా ఒకటే. ఆ పాపం ఎవరైనా తానుగా

అనుభవించాల్సిందే. ప్రభువు తప్పులు చేయకపోయినా ప్రజలు తప్పు చేస్తూ ఉంటే చూస్తూ ఊరుకున్నందుకు కూడా ఆ పాపఫలాన్ని అనుభవించాల్సి ఉంటుంది. అలాంటిది రాజే స్వయంగా దుర్మార్గానికి ఒడిగడితే ఇక చెప్పేదేముంటుంది? బలవంతులు బలహీనుల్ని బెదిరించడం, బలవంతంగా వాళ్ల సంపదల్ని లాగేసుకోవడం, అగ్రరాజ్యాలూ, శక్తిమంతమైన రాజ్యాలూ ఇప్పుడిప్పుడే శక్తియుక్తుల్ని కూడగట్టుకుంటున్న చిన్నరాజ్యాల మీదకు దండెత్తి వెళ్లడం, బలవంతమైన ప్రాణులు బక్కచిక్కిన ప్రాణులను హింసించడం, వేధించడం అన్నవి పశులక్షణాలు.

తామెంత బలవంతులైనా, శక్తిసంపన్నులైనా అందరితో కలిసిమెలిసి జీవించడం ఉన్నతుల లక్షణం.



నాకు 'జనుమేజయుడు–కుక్కపిల్ల' కథ గుర్తుకువస్తోంది.

*జనమేజయుడు ఒకసారి దీర్ఘసత్రయాగం చేస్తున్నాడు. అతని తమ్ముళ్ళు ఆ యాగాన్ని పర్యవేక్షిస్తున్నారు. ఇంతలో అక్కడికో కుక్కపిల్ల వచ్చింది. జనమేజయుని తమ్ములు దాన్ని తరిమితరిమి కొట్టారు. అది ఏడుస్తూ వాళ్ళ అమ్మదగ్గరకు వెళ్ళి జరిగిన విషయమంతా పూసగుచ్చినట్టు చెప్పింది. కుక్కపిల్ల తల్లికి కోపం వచ్చింది. అది విసవిస జనమేజయుడి దగ్గరకు వెళ్ళి, 'మహారాజా! నిరపరాధి అయిన నా బిడ్డను నీ తమ్ములు కొట్టి తరిమేశారు. మంచిచెడ్డలు ఆలోచించకుండా బలహీనులకూ, సజ్జనులకూ, పేదలకూ కీడు కలిగించే నీ తమ్ముల లాటివాళ్ళు నిష్కారణ భయాలతో నిలువెల్లా వొణికిపోతారు' అని తీవ్రంగా పలికింది.*

ఏదో ఒక కారణం ఉండి భయం కలగడం, ఆ కారణాలను సమీక్షించుకుంటూ ఆ భయం నుంచి బయటపడేందుకు ప్రయత్నించడం వేరు, నిష్కారణభయాలతో నిలువెల్లా వొణికిపోతూ ప్రాణభీతితో అనుక్షణం చావడం వేరు.

కుక్కపిల్లతల్లి మనుషులకు స్వభావసిద్ధంగా ఉండే భయాన్ని ఆసరాగా తీసుకుని, బలిష్ఠులు బలహీనులను వేధిస్తే నిష్కారణభయాలు కలుగుతాయని హెచ్చరించి చావుదెబ్బ కొట్టింది ●


# 3. ప్రొవైడర్ ఆఫ్ ది అన్‌ప్రొవైడెడ్

'**పా**లకులందరూ మంచి గృహస్థులై ఉండాలి. సాధారణ గృహస్థులు పెరట్లో నాటిన చెట్లలాంటి వాళ్ళయితే, పాలకులు నాలుగు బజార్ల మొగదలలో పెరిగిన మహావృక్షాల్లాంటి వాళ్ళు. సాధారణ గృహస్థు తమ ఇంటికి వచ్చిన అతిథుల్ని ఆదరిస్తే, ప్రభువు తన ఏలుబడిలోని నిరుపేదలను, నిరాధారులను, నిరాశ్రయులను, వృద్ధులను, వితంతువులను ఆదరించాలి', అని భీష్ముడు చెప్పాడు. కాబట్టి బలహీనుల్నీ, అనాథల్నీ రక్షించవలసిన బాధ్యత పూర్తిగా పాలకుడిదే! హి మస్ట్ బి ద ప్రొవైడర్ ఆఫ్ ది అన్‌ప్రొవైడెడ్'

అగ్నిపురాణం, మత్స్యపురాణం, విష్ణుధర్మోత్తర పురాణాల్లో కూడా పాలకుల ధర్మాలను చెబుతూ వీటినే ప్రధానంగా పేర్కొన్నారు.

'అన్నిరకాల సంపదల్లో పేదలకు భాగం కల్పించాకే రాజు వాటిని అనుభవించాలి. అలా చేస్తేనే బలహీనులు బలవంతులవుతారు. ఇది క్షాత్రధర్మం', అని ఉతథ్యుడనే మహర్షి మాంధాతకు చెప్పాడు. Wipping away tears from the faces of the destitute, the orphaned and the old, and spreading cheer amongst all - is the dharma of the King.

రాజన్నవాడు బలహీనుల బలం కావాలి. అనాథలకు అండగా నిలవాలి. అంధులకు కంటిచూపు కావాలి. నడవలేనివారికి నడిచే కాళ్ళు కావాలి. సూర్యుడు భూమి నుండి జీవరసాయనాన్ని గ్రహించి వేనవేల బాహువులతో మళ్ళీ ఎలా దాన్ని సువృష్టిగా నేలమీద కురిపిస్తాడో అలాగే ప్రభువు కూడా ప్రజల సంపదల్లో తమవంతు భాగాన్ని న్యాయంగా స్వీకరిస్తూ అంతకంటే ఎక్కువగా ప్రజలకు మేలు కలిగించాలి. బడుగు ప్రజలను నిరంతరం ఆదుకోవాలనుకునే రాజు ధనం, ధాన్యం, ఇతర నిత్యావసర వస్తువులకు కొరత లేకుండా చూసుకోవాలి. ప్రజల జీవనోపాధి కుంటుపడకుండా



జాగ్రత్తపడాలి. ఇప్పుడు మనం వేటినైతే ఆర్థిక వ్యవహారాలుగా పరిగణిస్తున్నామో ఒకప్పుడు వాటినే 'వార్త'గా లెక్కించారు. అర్థశాస్త్రం ఏం చెబుతోందంటే, 'కృషి పసుపాలయె వాణిజ్య క వార్త'.

Agriculture, animal husbandry and trade constritute VAARTA. వీటిని రక్షించవలసిన బాధ్యత ప్రభువులది. అందుకే భీష్ముడు ధర్మరాజును అడుగుతాడు. 'వర్తకులు తమ ఉత్పత్తుల్ని అమ్ముకోవలసి వచ్చినప్పుడు నువ్వు విధించిన ఆంక్షలు, షరతుల మూలంగా ఇబ్బందులకు గురికావడం లేదుకదా? కర్షక కార్మికులను ఇక్కట్లకు గురిచేస్తే వారు ఇతర దేశాలకు వలసపోయే ప్రమాదం ఉంది. దేవతలకు, పితృదేవతలకు, మనుష్యులకు, పశుపక్ష్యాదులకు, జంతువులకు అందరికీ వాళ్ళే ఇంత అన్నం పెడుతున్నారు. వాళ్ళనేమీ బాధించకు!'

> **'రాజా కాలస్య కారణం' మంచికాలానికీ, చెడుకాలానికీ కూడా రాజే కారణం.**

అలాగే, ఒక సందర్భంలో నారదుడు కూడా ధర్మరాజుతో సంభాషిస్తూ ఆయన రాజ్యం ఎలా సాగుతున్నదీ, ముఖ్యంగా కార్మిక కర్షక వర్తక వాణిజ్య రంగాలు ఎలా ఉన్నదీ విచారిస్తాడు. 'దొంగలు, దురాశాపరులు, రాకుమారులు, రాణివాసపు స్త్రీలు ప్రజల్ని పీడించడం లేదు కదా? నువ్వేమీ వాళ్ళను వేధించడం లేదు కదా?' అని అడుగుతాడు.

'భూములన్నిటివద్దా పెద్దపెద్ద సాగునీటి చెరువులు తవ్వారా? వాటిలో నీళ్ళు పుష్కలంగా ఉన్నాయా? ఒక్క వరుణదేవుడి కృపమీదే వ్యవసాయం ఆధారపడడం మంచిది కాదు సుమా! ఎక్కడికక్కడ జలాశయాలు నిర్మించుకోవడం శ్రేయస్కరం' అని మహర్షి సార్వకాలికమైన గొప్ప సలహా ఇస్తాడు.

అక్కడితో ఆగలేదు. 'నీ రాజ్యంలో మేలిరకం విత్తనాలకూ, పశుగ్రాసానికీ కొరత లేదు కదా? రైతులకు అత్యవసర సమయాల్లో కావల్సిన ఆర్థిక సాయం అందుతోందా?' అని అడుగుతాడు.

రాజే అన్నిటికీ కారణం! 'రాజా కాలస్య కారణం'. మంచికాలానికీ, చెడుకాలానికీ కూడా రాజే కారణం. 'పాలకులు మంచివాళ్లయితే రుతువులన్నీ సక్రమంగా వాటి వాటి ధర్మాలను నిర్వరిస్తాయి. భూమి సమృద్ధిగా పంటలనిస్తుంది. మనుషులు సుఖసంతోషాలతో ఉంటారు. పూర్ణాయుష్కులవుతారు. పాలకులు దుర్మార్గులూ, దుష్టులూ అయితే ప్రకృతి కూడా తిరుగుబాటు చేస్తుంది. రుతువులు వాటి ధర్మాలను విడిచిపెడతాయి. వర్షాలు ఉండవు. పంటలు పండవు. మనుషులందరూ ఆకలిదప్పులతో, అనారోగ్యంతో ఈసురోమంటూ ఉంటారు' అని భీష్ముడు హెచ్చరించాడు. ఉతథ్య మహర్షి కూడా మాంధాతను హెచ్చరించాడు, ప్రజల ఆకలి ప్రభువును

మింగేస్తుందని. మార్కండేయ మహర్షి అయితే కలియుగంలో వ్యవస్థ ఎంతగా దిగజారిపోతుందో, ఎంత భయంకరంగా ఉంటుందో పూసగుచ్చినట్టు చెప్పాడు. ప్రజలు ఆహారాన్నీ, వేదవర్యులు వేదాలనూ అమ్ముకుంటారు. స్త్రీలు శరీరాలను అమ్ముకునే స్థితికి దిగజారుతారు. కలియుగం చివరలో అన్నిటినీ మింగేసే అగ్ని భూమిని చుట్టుముడుతుంది. పాదచారులకు ఆహారం కాదు కదా; కనీసం తాగేందుకు మంచినీళ్ళు కూడా దొరకవు. నిలువ నీడ సరేసరి! ప్రజలు అనాథల్లా దిక్కులేని చావు చస్తారు. దీనంతటికీ కారణమేమిటంటే – తగుదునమ్మా అని అవినీతిపరులూ, అధర్మపరులూ అందల మెక్కడం; దుర్మతులూ, దుష్టబుద్ధి కలవారూ అధికారులుగా ఉండడం. ఈ పరిస్థితుల్ని నిలువరించాలంటే రాజే గృహస్థయి ఆపన్నులను ఆదుకోవాలి. ఎవరు ఇంటిముందుకొచ్చి ఆకలి అని నోరుతెరచి అడిగినా లేదనకుండా పట్టెడన్నం పెట్టే గృహస్థులా, రాజు తనను ఆశ్రయించినవారిని ఎల్లవేళలా సమాదరించాలి.

ప్రజల సంతోషమే పాలకుల సంతోషం కావాలి. ప్రజల క్షేమమే ప్రభువుల క్షేమం కావాలి. ప్రజలకేది ఆనంద మిస్తుందో అదే ప్రభువులకు కూడా ఆనందమివ్వాలికాని, తమ కేది ఆనందమో అదే అందరికీ పరమానందం, బ్రహ్మానందం అని ప్రభువులు తలపోయకూడదు ●

# 4. మినిస్టర్స్ షుడ్ యాక్ట్ ఇన్ లార్జర్ నేషనల్ ఇంటరెస్ట్

'మంత్రులు జ్ఞానపరులూ, పౌర జానపదులకు ఆప్తులూ, కార్యజ్ఞానం తెలిసినవారూ, ధైర్యసాహసాలు కలవారూ, దురభిమానం లేనివారూ, మంచి ఆలోచన చెయ్యగలిగినవారూ, ఒకరు చెప్పింది తాను వినడమేమిటి అన్న అహంకారం లేనివారూ, క్రౌర్యం లేనివారూ, దేశభక్తి, రాజభక్తి కలిగినవారూ, ప్రభువు సుఖదుఃఖాలు పంచుకునేవారూ, ఏది చెయ్యాలి, ఏది చెయ్యకూడదు అనే విషయాన్ని బాగా తెలుసుకోగలిగినవారూ, స్వార్థం లేనివారూ, శాస్త్రజ్ఞానం తెలిసినవారూ అయి ఉండాలి' అని చెప్పాడు భీష్ముడు.

తాతగారు చెబుతున్న మాటల సారాన్ని ఏకాగ్రంగా గ్రహిస్తూ కూర్చున్నారు పాండుకుమారులు.

'...రేపోమాపో రాజ్యం మీకు రాబోతోంది. ధర్మరాజు చక్రవర్తి కాబోతున్నాడు. అందుకని చెబుతున్నాను. సరైన మంత్రులను నియమించుకోండి. రాజ్యాంగ రథానికి రథి వంటివాడు రాజైతే, సారథి వంటివాడు మంత్రి. మిమ్మల్ని మించిపోతారేమోనన్న భయంతో తక్కువవాళ్లను, చదువులేనివాళ్లను, సంస్కారం లేనివాళ్లను మంత్రులుగా తీసుకోకండి. బంధువనో, స్నేహితుడనో, ఆశ్రితుడనో, అనుకూలుడనో అర్హతలు లేనివాళ్లను అందల మెక్కిస్తే మొదలుకే మోసం వస్తుంది. విద్యావినయ సంపన్నతా, నీతిజ్ఞతా లేని ఏలిక దొరకడంకంటె ప్రజల కసలు పాలకులే లేకపోవడం మంచిది. అందుకని మంత్రులు వయస్సులోనూ, జ్ఞానంలోనూ మనకంటే

**సరైన మంత్రులను నియమించుకోండి. రాజ్యాంగ రథానికి రథి వంటివాడు రాజైతే, సారథి వంటివాడు మంత్రి.**

> **మంత్రం అంటే మంచి ఆలోచన. మంచి ఆలోచనలు చేసేవాళ్లు మంత్రులు. మంత్రాన్ని రక్షిస్తేనే కార్యాలు సిద్ధిస్తాయి.**

పెద్దవారే కావాలి. అంతరంగంలోనూ ఆచరణలోనూ వారు పరిశుద్ధులై ఉండాలి. అవసర మనుకుంటే ప్రభువుకూ, ప్రజలకూ మంచేదో, చెడేదో వివరించి చెప్పగలిగినవారై ఉండాలి. ముఖ్యంగా ఏ ప్రలోభాలకూ లొంగనివారై ఉండాలి. ఒక శాఖకు ఒక మంత్రినే నియమించాలి. అలాకాక ఇద్దరు ముగ్గురు మంత్రుల్ని నియమిస్తే విరుద్ధ నిర్ణయాలు, విరుద్ధ ప్రకటనలు వస్తాయి. విధాన నిర్ణయాలు సరిగా ఉండవు. కిందిస్థాయి ఉద్యోగులు విభజించి పాలించేందుకు చూస్తారు.

'రాజ్యానికి ఆయువుపట్టు అయిన సైన్యాన్ని – అంటే గజతురగరథపదాతి దళాలను (ఇప్పుడైతే వాటినే మనం వాయుసేన, జలసేన, యుద్ధశకట, పదాతి దళాలంటున్నాం) జాగ్రత్తగా పెంచి పోషించుకుంటూ, రక్షణ రహస్యాలూ, రాజ్యభద్రతకు సంబంధించిన ఆలోచనలూ బయటకు పొక్కనివ్వకుండా అప్రమత్తంగా కాచుకుంటూ, మంత్రనేత్రంతో శత్రువుల లోపాలను చూడగలిగేవాళ్లు మాత్రమే సైన్యానికి ఆధిపత్యం వహించాలి. మంత్రం అంటే మంచి ఆలోచన. మంచి ఆలోచనలు చేసేవాళ్లు మంత్రులు. మంత్రాన్ని రక్షిస్తేనే కార్యాలు సిద్ధిస్థాయి. ఆలోచనలను రహస్యంగా ఉంచుకోకపోతే పనులన్నీ చెడిపోతాయి. ఎప్పుడో ఒకప్పుడు శత్రువులకు లొంగిపోవాల్సి వస్తుంది. సైన్యాధికారుల నియామకం విషయంలో కూడా అప్రమత్తంగా ఉండాలి. విశ్వాసపాత్రులైనవారినే రక్షణోద్యోగులుగా నియమించాలి. కాంతాకనకాలను ఎరగా చూపి రాజ్యానికి సంబంధించిన రహస్యాలను కొల్లగొట్టాలనుకునేవారికి దాసోహమనకుండా, ఏ శక్తులకూ లొంగకుండా, నిష్కపటంగా, నిర్మొహమాటంగా ఉండేవారినీ,

రాజ్యవ్యవహారం తెలిసినవాళ్లను రక్షణశాఖలో నియోగించాలి. రాజ్యవ్యవహారం అంటే ఏమిటో తెలుసా? లేనిదాన్ని సంపాదించడం, సంపాదించినదాన్ని రక్షించుకోవడం, దాన్ని వృద్ధి చేసుకోవడం, తగినరీతిలో వినియోగించడం. ఇది తెలిసినవాళ్ల చేతిలో రక్షణశాఖ ఉంటే రాజు నిశ్చింతగా నిద్రపోవచ్చు. రాజ్యతంత్రం అన్నా, రాజ్య వ్యవహారమన్నా ఒక్కటే– అంతా నీతిమీద ఆధారపడి ఉంటుంది. అందుకని అవినీతిపరులను, పేడ పురుగులను, గోముఖవ్యాఘ్రాలను, కాసులకోసం కక్కుర్తి పడేవాళ్లను, కక్కిన కూటికోసం ఆశపడేవాళ్లను, దేశద్రోహులను సైన్యం దరి చేరనివ్వకూడదు. రక్షణశాఖలోని ఉద్యోగులు అవినీతికి, అక్రమాలకు పాల్పడకుండా ఉండేందుకు వారికి జీతబత్తేలు సకాలంలో చెల్లిస్తుండాలి. సైనికుల జీతాలు విరగ్గొట్టటం, ఎగ్గొట్టటం, బిగపట్టటం లాంటి పనులు చేయకూడదు. సమర్థులకు పదోన్నతి కల్పిస్తుండాలి. ధైర్యసాహసాలు ప్రదర్శించినవారిని ప్రోత్సహించాలి. సమయం చూసుకుని వారిని



సత్కరించాలి. ప్రభువుకోసం, ప్రజలకోసం ప్రాణాలు విడిచినవారి కుటుంబాలను ప్రభువే పోషించాలి' అని బోధ చేశాడు భీష్ముడు.

తాతగారి అమృతమయ వాక్కులు వింటూ ధర్మరాజు, ఆయన తమ్ములు పరవశులయ్యారు.

చాలాసేపు నిశ్శబ్దం.

తరువాత మళ్ళీ తాతగారే చెప్పారు. 'పాలకులు తమ ప్రాణాలకంటే ఎక్కువగా జనవిశ్వాసాన్ని రక్షించుకోవాలి. ప్రజల నమ్మకాలను వమ్ముచేసినా, వాళ్ళ విశ్వాసాలను దెబ్బతీసినా వాళ్ళు మిమ్మల్ని పదవీచ్యుతుల్ని చేస్తారు. రాజు ఎంత సర్వం సహాధికారి అయినా ప్రజల అభిప్రాయాలను మన్నించాలి. వాళ్ళ గౌరవాన్ని కాపాడాలి. అంతేగాని – ప్రజలతో మా కేమిటి పని? అధికారంలో ఉన్నన్నాళ్ళూ అక్రమాలు చేస్తాం, ఘోరాలు చేస్తాం, నేరాలు చేస్తాం, మోసాలు చేస్తాం, దగాలు చేస్తాం, పాపాలు చేస్తాం అంటే సుయోధనుడి కే గతి పట్టిందో అదే పడుతుం దెవరికైనా!' అని హెచ్చరించారు.

అన్నదమ్ము లయిదుగురూ తాతగారికి ప్రణమిల్లి వెనుదిరిగారు ●

# 5. నీరు... మీరు... డబ్బు

డబ్బు... డబ్బు... డబ్బు...!

డబ్బే అన్నిటికీ మూలం. సాక్షాత్తూ దేవేంద్రుడే అయినా డబ్బు లేకపోతే లోకం గౌరవించదు. కురూపి అయినా డబ్బుంటే సౌందర్యవంతుడంటారు.

సుఖానికి మూలం ధర్మం. ధర్మానికి మూలం ధనం. ధనానికి మూలం రాజ్యం.

అర్థసంపద ఉంటే చాలు. అదే ప్రకృతి సంపదను కూడా ఇస్తుంది. అంటే రాజ్యపాలనకు కావల్సిన శక్తి నిస్తుందన్నమాట. కనుక ధనాగారాన్ని వృద్ధి చేసుకునే విధానా లేమిటో నిరంతరం పాలకులు అన్వేషిస్తుండాలి. అయితే, మనకు తిండిగింజలు ఎలా వస్తున్నాయో, ఈ నేలను ఎవరు దున్నుతున్నారో, ఈ మట్టిని ఎవరు బంగారం చేస్తున్నారో, మనకూ మన ప్రజలకూ ఎవరు ప్రతిపూటా పట్టెడన్నం పెడుతూ ప్రాణదానం చేస్తున్నారో వాళ్ళపట్ల మనం కృతజ్ఞులమై ఉండాలి. ముఖ్యంగా కర్షకులు, కార్మికులు, వర్తకులు, గోరక్షకులనుంచే రాజుకు ధనం లభిస్తుంది. ధనధాన్యాలకు ఉత్పత్తిస్థానాలు వారు. వాళ్ళని పీడించకూడదు. వాళ్లకు హాని కలిగించకూడదు. వాళ్ళు పొలాల్నీ, నదుల్నీ, అడవుల్నీ, ప్రకృతినీ నమ్ముకుని బతుకుతూ, మనల్ని బతికిస్తున్నారు. వాళ్ళను దయతో చూడాలి. అధికారం ఉన్నది కదా అని మనబలాన్ని వాళ్ళమీద ప్రయోగించకూడదు. వాళ్ళ సంపదలు చూసి అసూయపడ కూడదు. రైతులు లోకబాంధవులని గుర్తించాలి. వాళ్ళకు కావల్సిన నీరు, నాగలి, కాడి, ఎడ్లు, బండ్లు ఉచితంగా

> **ఈ మట్టిని ఎవరు బంగారం చేస్తున్నారో మనకు పట్టెడన్నం పెడుతూ ప్రాణదానం చేస్తున్నారో వాళ్ళపట్ల కృతజ్ఞులమై ఉండాలి.**

ఇవ్వాలి. వ్యవసాయానికి, వర్తకానికి పశువులే మూలం. కనుక పశువులను, పశువులుగల కాపులను రాజు కన్నబిడ్డల్లా రక్షించాలి. పశువుల గ్రాసానికి కొరతరాకుండా చూడాలి. పశువులకు వచ్చే రోగాలకు వైద్యం జరిపించాలి. మేలిజాతి పశువులను వృద్ధి చేయాలి. గోపాలకులకు రాయితీ లివ్వాలి. ప్రోత్సాహ మివ్వాలి. సకాలంలో వానలు కురవక పంటలకు నీరు అందకపోయినా, వానలు మిక్కుటమై వాగులూ వంకలూ పొంగి పంటచేలన్నీ నీట మునిగినా, క్రిమికీటకాలు సస్యాలను పాడుచేసినా మేమేం చేయగలమని ప్రభువు శుష్కంగా, నిష్పూచీగా ఉండకూడదు. ప్రజాపాలకులు చేయవలసిన పనికా దది. అన్నీ సజావుగా ఉంటే వాళ్ళు మనల్ని అడగాల్సిన పనేముంది? ప్రకృతి కన్నెర్ర చేసినప్పుడు, విపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడు పాలకులు ప్రజలకు అండగా నిలబడాలి.

నీరే ప్రాణాధారం. భూగర్భజలాలు, ఉపరితల జలాలు, వర్షజలాల ప్రాముఖ్యాన్ని గుర్తెరిగి వాటిని సంరక్షించండి. నీటిని పొదుపుగా వాడుకోటం



పైనే మనిషి మనుగడ, ప్రగతి ఆధారపడి వున్నాయని తెలుసుకోండి. ఎక్కడా నీటికొరత లేకుండా చూడండి. వర్షపునీరు వృథాకాకుండా నీటికుంటలు నెలకొల్పి భూగర్భ జలాలను పెంచండి. రైతులకే నీటి నిర్వహణ బాధ్యతను అప్పగించండి. జలరక్షణకు రైతులను సమాయత్తం చేయండి.

**అవసరమైనవాటికి ఖర్చులు చేస్తే ప్రయోజనం లేదు. అవసరమైన పనులకోసం డబ్బు ఖర్చుపెట్టినా అది మళ్లీ వస్తుంది.**

కాలజ్ఞానంతోపాటు జలవిజ్ఞానం కూడా తెలిసుండాలి మనకు. పాలకులు యజ్ఞయాగాలు నిర్వహించడంవల్ల యాగధూమం సూర్యమండలంలోని అమృతకిరణాలను స్పందింపజేస్తుంది. అప్పుడు ఆ అమృత కిరణాలద్వారా అమృతరూపమైన సువృష్టి కలిగి, చక్కని ఓషధులు పుట్టి, వాటివల్ల సుప్రజోత్పత్తి కలుగుతుంది. పాలకులు చేసే పుణ్యాలు, యజ్ఞయాగాది క్రతువులకు దేవతలు సంతోషించి దివ్యవర్షాన్ని, దివ్యమైన అన్నాన్ని ప్రసాదిస్తారు.

రాజు ధనాగారాన్ని ఎప్పటికప్పుడు వృద్ధి చేసుకోవాలి. అలా అని పులి తన కూనల్ని తనే తిన్నట్టు వ్యవహరిస్తే డబ్బు రాదు. ప్రజలనుంచి చాతుర్యంగా డబ్బు తీసుకోవాలి.

ఒకవంక ప్రజలకు అభివృద్ధి కలిగిస్తూ, మరోవంక మరీ భారం కాకుండా కొద్దికొద్దిగా పన్నులు పెంచాలి. ఉపాయం ఉంటే చేతినిండా డబ్బు వస్తుంది. రేపు తన పొట్ట నిండడానికి ఎంత అవసరమో అంతకుమించి ఎవరూ దాచటానికి వీల్లేదు. అలా దాచేవాళ్ళు దొంగలతో సమానం. చీకటి వ్యాపారం చేసేవాళ్ళను, అక్రమంగా డబ్బు నిలవచేసేవాళ్ళను కఠినంగా అణిచెయ్యాలి. వాళ్ళ మితిమీరిన సంపదలను రాజు స్వాదీనం చేసుకుని పేదల సంక్షేమానికి, అభివృద్ధి పనులకు వినియోగించాలి. అలాచేస్తే సామాన్యప్రజలు

సంతోషిస్తారు. అయితే, సంపన్నులందరిలో తప్పులు వెదకడం, వాళ్ళ సంపదను బలవంతంగా లాక్కోవడం తగదు. సంపాదించిన ధనం సద్వినియోగం చేసేవాళ్ళు, పరోపకారానికి వెచ్చించేవాళ్ళు, దానధర్మాలు చేసేవాళ్ళూ ఎప్పుడూ ఉంటారు. వారిని అభినందించాలి.

'ప్రజలకు తనయందు అనురాగం కలిగేలా చేసుకుని ధనం సంపాదించుకోవడం రాజుకు ఉత్తమ మార్గం. రాబడికోసం ఏ ఉపాయాలు చేసినా, అవి ధర్మమార్గాన్ని అతిక్రమించనివిగా ఉండాలి. మాయోపాయాలు పన్నడం మంచిది కాదు. అనవసరమైనవాటికి ఖర్చులు చేసేట్టయితే డబ్బు సంపాదించి కూడా ఏం ప్రయోజనం లేదు. అవసరమైన పనులకోసం డబ్బు ఖర్చుపెట్టినా అది మళ్ళీ వస్తుంది కనుక అలాంటిదసలు ఖర్చులలో లెక్కకాదు. దీనులు, వృద్ధులు, వితంతువుల యోగక్షేమాలకు ప్రభుత్వమే సహాయం చెయ్యాలి. అయితే, ప్రభుత్వం సహాయం చేస్తోందంటే ప్రతివారూ ఎగబడతారు. అప్పుడు జాగ్రత్త పడాలి. నిరుపేదలకు, నిస్సహాయులకు సహాయం చెయ్యడమే పాలకుల ప్రథమ కర్తవ్యం కావాలి. ప్రజలనుంచి పన్నులు తీసుకుంటూ వాళ్ళకు ఏ మేలూ చెయ్యకుండా 'పన్నులు మాకు – పాట్లు మీకు' అన్న విధంగా కేవలం తమ లాభం, తమ సౌఖ్యం చూసుకునే ప్రభువులు రాజ్యాంతంలో నరకం అనుభవిస్తారు. కనుక ప్రజలకు వచ్చిన కష్టాలను తొలగించడానికి, వాళ్ళకు మేలు చెయ్యడానికి పాలకులు నిరంతరం యోచన చెయ్యాలి. వాళ్ళ అభివృద్ధికి అనువైన పథకాలు రూపొందించాలి. ఒకసారి రూపొందించాక ఆరు నూరైనా అవి అమలు జరిగితీరేలా చూడాలి. పట్టుదల, ప్రయత్నం ఉంటేనే ఏ పనైనా సానుకూల మవుతుంది. పాలకు లెప్పుడూ దూరదృష్టి కలవారై ఉండాలి. రేపటి

**నా సంగతేమిటి?
ద్రోణుడి సంగతేమిటి?
అయోగ్యుల జట్టు
కట్టికదూ ఇలా నేల
కూలాం.**

రోజును ఈ రోజే ఊహించాలి. రేపు జరగబోయే పరిణామాలను ఈ రోజే అంచనా వేయగలిగి ఉండాలి. తనచుట్టూరా ఉన్న లోకంలో ఏఏ మార్పులు జరుగుతున్నాయో గమనిస్తూ, మంచిచెడులను బేరీజు వేసుకుంటూ 'మంచి' అనుకున్నవాటిని 'నేను కూడా నా రాజ్యంలో సత్వరమే అమలు జరపాలి' అన్న భావన కలిగి వుండాలి. అటువంటి తృష్ణ, తపన ఏ కొద్దిమందికోగాని కలగదు. అది కలిగినవాడికి ప్రజలు బ్రహ్మరథం పడతారు. అతనికి శాశ్వతకీర్తి లభిస్తుంది.

'మరోమాట – ఈ లోకంలో అందరూ తెలివైనవారే. ఎవరూ తెలివితేజలు లేక చెడిపోవడం లేదు. ఉన్న తెలివితేటల్ని సక్రమంగా వినియోగించుకోలేక చెడిపోతున్నారు. సుయోధనుడికి తెలివితేటలకేం తక్కువ? అపమార్గాన నడిచి, అయోగ్యుల్ని చేరదీసి, వదరుబోతుల్ని నమ్మి, దవ్వు నుంచదగినవారిని దరిచేర నిచ్చి, వాళ్ల మాటలు విని, నాశనమైపోయాడు.

'అంతవరకూ ఎందుకు? నా సంగతేమిటి? ద్రోణుడి సంగతేమిటి? అయోగ్యుల జట్టు కట్టి కదూ ఇలా నేల కూలాం! మీరు యోగ్యులు, బుద్ధిమంతులు, విద్యావినయ సంపన్నులు. పైగా పురాణ పురుషుడైన గోవిందుడు మీకు సఖుడై, బంధువై, రక్షకుడై ఉన్నాడు. ఇంక మీ కసలు భయమెందుకు? కాకపోతే మీ శ్రేయోభిలాషిగా ఒకమాట చెబుతాను. మంచిపనులను రేపు మాపు అని వాయిదా వెయ్యకండి. రేపటి పని ఈ రోజే చెయ్యండి. సాయంకాలం చేద్దామనుకున్నది ఇప్పుడే చెయ్యండి. బుద్ధిహీనులు, మందమతులు, కుర్రవాళ్లు, అల్పాయుష్కులు కాలం విలువ తెలుసుకోలేక రాత్రులు నిద్రలోనూ, పగలు నిరుపయోగమైన పనులలోనూ గడిపేస్తారు. మీరుమాత్రం అలా చెయ్యకండి. మంచిపనులను మంచి పద్ధతుల్లో జనులందరూ మెచ్చుకునేలా చెయ్యండి' అని చెప్పాడు భీష్ముడు. పాండుకుమారులు పరమానందభరితు లయ్యారు ●

## జల సంరక్షణే జన సంరక్షణ!

గతంలో భగీరథుడు చేసిన ప్రయత్నం పక్కకు పెట్టినా, ఒకసారి పృథు అనే చక్రవర్తి పరిపాలకుడుగా వచ్చాడు. ఆయన తండ్రి వేనుడు. పరమ దుర్మార్గుడు. ప్రజలను దోచుకుతినడంవంటి క్రూరప్రవృత్తి కలవాడు. అది ఎంతవరకూ వెళ్లిందంటే లోకహితకారు లైనటువంటి ఋషులను సైతం తన సేవలో ఉపయోగించు కోవాలనేటంతవరకూ వెళ్లింది. అప్పుడు ఋషులంతా ఆయనకు హితం చెప్పారు. ఎంత చెప్పినా వినకపోతే చివరకు ఋషులంతా అతన్ని శపించి సింహాసనం పైనుంచి తొలగించారు. ఆ తరువాత అతని భుజాన్నుంచి పుట్టిన వ్యక్తి పృథు అనే పేరుతోటి ప్రసిద్ధుడైన చక్రవర్తి అని భాగవతం చెబుతోంది. ఆ పృథు రాజ్యమేలడానికి వచ్చినప్పుడు ఖజానాలో డబ్బు లేదు; జనానికి తిండి లేదు; పశువులకు గ్రాసం లేదు; తాగడానికి చుక్క నీరు లేదు. అన్నిరకాల వ్యక్తులు ఇటు భూచరులు, జలచరులు, ఖేచరులు అందరూ బతకడానికి ఇబ్బందికరమైన సన్నివేశం ఏర్పడి ఉంది. అది చూసి పృథువుకు కోపం వచ్చి, 'ఈ విపత్కర పరిస్థితికి కారణ మేమిట'ని పృథ్విని అడిగాడట. ఎంత అడిగినా అది సమాధానం చెప్పకపోతే గోరూపంలోకి దానిని మార్చి బాణంతోటి సంహరిస్తానని హెచ్చరించాడు. అప్పుడు భూమి అతనిని అనునయిస్తూ, 'గోవును, స్త్రీని, నన్ను ఇలాగ నువ్వు అనడం తగునా?' అని అడిగితే, 'స్త్రీ అయినా, గోవైనా కూడా ధర్మాన్ని అతిక్రమించి బాధ్యతలను విస్మరించినప్పుడు దానికి తగినటువంటి దండన ఇవ్వడం శాస్త్రవిరుద్ధం కాదు. కావున నీవు దండనకు అర్హురాలివి, నిన్ను సంహరిస్తాన'ని అతను తీవ్రరూపం ధరిస్తే

అప్పుడు భూమి చాలా సంతోషించి, 'నన్ను గోవును చేస్తానన్నావు కదా! తగిన దూడను తెచ్చి ఏది కావాలంటే ఆ పాలను పిండుకో'మని చెప్పినట్లూ, 'దుధుః ధరిత్రీ' అని అన్నట్లుగా తెలుస్తోంది. అప్పుడు పృథువు మనుషుల తరపున స్వాయంభుముానిని, దేవతల తరపున బృహస్పతిని, ఒక్కొక్క జీవజాతి - ఈనాడు మనం ఎన్ని రకాల జీవజాతులను చూస్తున్నామో అన్ని జాతులనుంచి ఒక్కో ప్రముఖమైనటువంటి ప్రాణిని దానికి దూడకింద మార్చి, వారికి కావల్సిన విధానంలో భూమిని దున్నినట్లూ, అదో పెద్ద యజ్ఞంకింద చేసినట్లు, తద్వారా ఈ భూమిమీద నగర, గ్రామ, పట్టణ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు, అందమైనటువంటి ఈ నాగరిక వ్యవస్థ ప్రారంభకుడిగా ఆయనవల్లే నేలకు పృథ్వి అనే పేరు వచ్చిందని భాగవతం తెలుపుతోంది. అంటే, ఆయన ఒక గొప్ప యజ్ఞం చేశాడు. అన్ని రకాల వ్యక్తులను, అన్ని రంగాలలోనూ వారివారికుండే శక్తులనూ వినియోగించుకుని వారిలో ప్రేరణ కలిగించి వారిద్వారా ఈ భూమిని సస్యశ్యామలం చేశాడు. ఇప్పుడు ఈ వేళ మన ప్రభుత్వమూ, పాలకులూ చేస్తున్న జలసంరక్షణ ఉద్యమం కూడా అటువంటిదే అయి, పృథువుని ఆదర్శంగా తీసుకుని ఆయన చేసినటువంటిదే చేశారంటే సంతోషమే.

**- శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామి**

(స్వామివారితో ఈ రచయిత జరిపిన సంభాషణలో ఒక భాగం ఇది)

# 6. పీపుల్స్ పార్టిసిపేషన్

**నా** చిన్నప్పుడు చరిత్ర పాఠాలనిండా 'అశోకుడు చెట్లు నాటించెను; బావులు త్రవ్వించెను' అని ఉండేది. 'ఆయన చెట్లు నాటితే మనకేమిటి? నాటకపోతే మనకేమిటి? అనిపించేది. నిన్నటి చరిత్ర రేపటి వెలుగుదారని తెలియని రోజులవి.


ఎప్పుడైనా చరిత్రే కదా కథ చెప్పేది!

పెద్దయ్యాక భారతం చదువు కున్నాను. చిత్రం, అందులోనూ ఈ ప్రస్తావన ఉంది. భీష్ముణ్ణి ధర్మరాజు అడుగుతాడు. 'చెరువులు నిర్మిస్తే ఎటువంటి ఫలం కలుగుతుంది? చెట్లు నాటితే ఎటు వంటి పుణ్యం కలుగుతుంది? అని.

'చెరువులూ, తటాకాలూ సర్వభూతాలకూ ఆశ్రయింపదగినవి. చెరువులు తవ్వించినవారికి ఇహపరలోక సుఖాలు కలుగుతాయి. అన్నికాలాల్లోనూ నీటితో నిండివుండే చెరువులు తవ్విస్తే అవి తవ్వించినవాళ్లకు అగ్నిహోత్ర, అశ్వమేధ ఫలాలు లభిస్తాయి. సత్రాలు, చలివేంద్రాలు, ఉద్యానవనాలు, బావులు నిర్మిస్తే ఆయురారోగ్య ఐశ్వర్యాలు కలుగుతాయి. ఎవరు కట్టించిన జలాశయంలో గోవులు నీళ్ళు తాగుతాయో వాళ్ళు వాళ్ళ వంశీకులతోసహా ఉత్తమగతి పొందుతారు. ఎవరు నిర్మించిన చెరువులో మనుష్యులు మండు వేసవికాలంలో అవభృద స్నానపానాదులు చేస్తారో వాళ్ళకు పాపాలూ, కష్టాలూ నశిస్తాయి. ఇక చెట్లంటారా – ఎక్కడ నాటినా పుణ్యమే. చెరువుకట్టలమీద పాతిస్తే మరీ పుణ్యం.

**చెరువులూ, తటాకాలూ సర్వభూతాలకూ ఆశ్రయింపదగినవి. చెరువులు తవ్వించినవారికి ఇహపరలోక సుఖాలు కలుగుతాయి.**

తరువులు దేవ మనుష్య భూత పితృ యజ్ఞాది పంచయజ్ఞాలూ చేస్తున్నాయి. బాటసారులకు నీడ నిచ్చి సేద తీరుస్తున్నాయి. పక్షులు వృక్షాలలో గూళ్ళు కట్టుకుని సుఖంగా జీవిస్తున్నాయి. పువ్వులవల్ల దేవతలు, ఫలాలవల్ల పితృదేవతలు ప్రీతి పొందుతున్నారు. ఒక చెట్టున్నదంటే దానిలో పనికిరానిదంటూ ఏమీ లేదు. యజ్ఞయాగాది క్రతువుల్లో సమిధలుగా, వాటి ఆకులూ వేళ్ళు, బెరళ్ళూ ఔషధాలుగా, కాలంచెల్లిన చెట్లు ఇంధనంగా... ఇలా రకరకాలుగా ఉపయోగపడుతున్నాయి. అంతేనా! మనం విడిచిన



గాలిని అవి పీల్చి, మంచిగాలిని విడిచి మన ప్రాణాల్ని కాపాడుతున్నాయి. చెట్లు ఎంత ఎక్కువగా ఉంటే అంత బాగా వర్షాలు కురుస్తాయి. వర్షాలు కురిస్తేనే పంటలు పండుతాయి; మన పొట్టలు నిండుతాయి. పచ్చని చెట్లలోనూ, పద్మ సరస్సులలోనూ, పుష్ప వాటికల లోనూ లక్ష్మీదేవి నివాస ముంటుంది. పైగా భూదానాలు, గోదానాలు చేస్తే కలిగే ఫలితం చెట్లు నాటి పెంచితే కలుగుతుంది" అని చెప్పాడు భీష్ముడు.

అసలు కర్మలు రెండు రకాలట : ఇష్టకర్మ, పూర్తకర్మ అని. అగ్నిహోత్రం, తపస్సు, సత్యం, వేదాభ్యాసం, ఆతిథ్యం, వైశ్వదేవం – ఇవి ఇష్టకర్మలు.

నూతులూ, దిగుడు బావులూ త్రవ్వించడం, తటాకాలూ, చెరువులూ నిర్మించడం, దేవాలయాలు కట్టించడం, అడిగినవారికి లేదనకుండా అన్నం పెట్టడం – పూర్తకర్మలు.

ప్రజాపాలకులు ప్రధానంగా చెయ్యవలసినవి పూర్తకర్మలు.

అంటే పదిమందికీ ఉపయోగపడే పనులు. ప్రజలనుంచి పన్నులు వసూలు చేసి కూడా వారికి హితం కలిగించే పనులు చెయ్యని ప్రభువు ఉంటేనేం? ఊడితేనేం?

పూర్వం కృతవీర్యుడనే రాజుగారు ఉండేవారు. ఆయన కొడుకు పేరు అర్జునుడు. కృతవీర్యుని కొడుకు కనుక అతన్ని కార్తవీర్యార్జునుడు అని పిలుస్తారు. అత నెంత గొప్పవాడంటే – 'ప్రజలనుంచి అసలు పన్నే తీసుకోకుండా వారికి మేలు కలిగించే పనులు చేయకలిగిన శక్తి ఉన్నప్పుడే పరిపాలన చేస్తాను. అంతవరకూ నాకు రాజ్యం గీజ్యం ఏమీ అక్కర్లేదు' అన్నాడు.

అతనూ ప్రభువంటే!

మరో సందర్భంలో భీష్ముడు చెప్పాడు :

'ప్రజలు అడగకపోయినా, వాళ్ళ అవసరా లేమిటో తెలుసుకుని వాటిని తీర్చేవాడే ప్రభువు. ఒకరిని అడగడం చావు లాంటిది. అడిగించుకోవడం ఇంకా పెద్దచావు. అడిగినా, వేడుకున్నా, దేబిరించినా, కాళ్ళావేళ్ళా పడ్డా కనికరం చూపనివాడు, ప్రజల కష్టాలు తీర్చనివాడు చచ్చినవాడితో సమానం. ప్రాణంలేని కట్టెతో ఏం చెప్పుకుని ఏం లాభం? ప్రజలచేత పదిసార్లు అడిగించుకోకుండా

**ప్రజనుంచి పన్నులు వసూలు చేసి కూడా వారికి హితం కలిగించే పనులు చెయ్యని ప్రభువు ఉంటేనేం? ఊడితేనేం?**

వాళ్ళ సౌఖ్యం చూసేవాడు ఉత్తమగతులు పొందుతాడు. అన్నిటికంటే ఎక్కువైనది భూదానం. సమస్త ధనధాన్యాలకు భూమి నిలయం. కనుక భూదానం చేస్తే అవన్నీ దానం చేసిన ఫలం కలుగుతుంది. భూదానం చేసినవాడు భూమికి ఎంత ఆయువు ఉందో అన్నాళ్ళూ స్వర్గంలో హాయిగా ఉంటాడు. ముఖ్యంగా రాజులు సమస్త పాపాలకు మూలస్థానాలు. వాళ్లు యుద్ధంలోనైనా చావాలి లేదా భూదాన పుణ్యమైనా పొందాలి. దరిద్రంతో బాధ పడుతున్న బీదసాదలకు భూమి దానం చేస్తే కలిగే ఫలం 'ఇంత' అని చెప్పలేం. తరువాతది అన్నదానం. ఆకలితో కుక్క వచ్చినా ఆదరించి అన్నం పెట్టాలి. అన్నం పెట్టే సమయంలో కులం, గోత్రం, శీలం, విద్య, భోగభాగ్యాలు ఇవేం చూడనక్కరలేదు. ఎలాంటివాడైనా సరే ఆకలిగొని వస్తే అన్నం పెట్టడంకంటె పుణ్యం మరొకటి లేదు. అన్నం అమృతమని బ్రహ్మదేవుడు చెప్పాడు. చుట్టూ ఉన్నవాళ్ళు ఆకలితో నకనకలాడుతుంటే వాళ్ళకు పెట్టక తానొక్కడే ఆ అమృతాన్ని కడుపారా సేవించేవాడు పరమ నీచుడు.

**చుట్టూ ఉన్నవాళ్లు ఆకలితో నకనకలాడు తుంటే వాళ్లకు పెట్టక తానొక్కడే కడుపారా తినేవాడు పరమ నీచుడు.**

ఉత్తముడు నలుగురికీ పెట్టి తాను తిని, అన్ని లోకాల్లోనూ సుఖం పొందుతాడు. అయితే, న్యాయార్జితమైన అన్నమే దానం చెయ్యాలి' అని చెప్పాడు గాంగేయుడు. ఆచార్య వినోబాభావె భూదాన ఉద్యమానికి భీష్ముడి హితవచనాలే ఆలంబనై ఉండాలి. తన కుటుంబం కడుపునిండా తినడానికి ఎంత భూమి అవసరమో అంతే ఉంచుకుని మిగిలినది భూమి లేని పేదలకు పంచి పెట్టాలన్నా డాయన. అంతేకాదు; నువ్వు నీ ఆస్తికి యజమానివే కాదు పొమ్మన్నాడు. కేవలం ట్రస్టీవి సంరక్షకుడివి. నీకు ధర్మ కర్తృత్వమేకాని, కర్తృత్వం లేదన్నాడు.

ప్రతివారికీ అది కావాలి, ఇది కావాలి, అన్నీ తమకే కావాలి అని ఉంటుందికాని, అలా భావించేవాడు, సంపాదించేవాడు, అందరి సంపదలూ ఒక్కడే తీరికగా కూర్చుని ఆరగించే వాడు అనార్యుడు అని ఉపనిషత్తులు చెబుతున్నాయి. 'అందరికీ కనీసం కూడూ గూడూ ఉండాలి, కప్పుకోను వస్త్రం ఉండాలి' అన్న ఉద్దేశ్యంతోనే భూగరిష్ట పరిమితి చట్టం అమలులోకి వచ్చింది. అది సరిగా అములుకాకుండా దానికెన్నో తూట్లు పొడిచారు. అది వేరే కథ.

స్వామి వివేకానంద చెప్పినట్లు చట్టాలవల్ల ఏ దేశమూ గొప్పది కాదు; చట్టాలవల్ల మనుషుల్లో మార్పు రాదు. దేశప్రజలు గొప్పవాళ్లయితేనే దేశం గొప్ప దవుతుంది. అలాగే పాలకులు కార్యశీలురు, ప్రజాసేవా పరాయణులు అయితేనే మంచిపనులు జరుగుతాయి. జనులు మెచ్చే మంచిపనులు చేయడానికి నీకు నిరంతరం ఉత్సాహం, పట్టుదల, ప్రయత్నం ఉంటే చాలు. తండ్రివెంట బిడ్డల్లా ప్రజలు నీతో కదిలివస్తారు, నువ్వడగకుండానే నీకు స్నేహహస్తం అందిస్తారు. నీతో భుజం కలిపి నడుస్తారు.

బ్యూరోక్రసీ అంటారో, అధికారదర్పం అంటారో నాకు తెలీదు. ఒక పని చేయాలీ అనుకోగానే కమిటీలు, ప్రాజెక్ట్ రిపోర్టు, ఎస్టిమేట్లు, సర్వేలు, ఎర్రింకు పెన్నులు, జెమ్‌క్లిప్పులు, గుండుసూదులు, ఫైళ్లు, ప్యాడ్లు, కార్యాలయాలు, ఏసి గదులూ తెరిచే ఆర్భాటాలనుంచి, అనవసరపు దుబారాలనుంచి మనం బయట పడాలి.

**చెట్లు ఎంత ఎక్కువగా ఉంటే అంత బాగా వర్షాలు కురుస్తాయి. వర్షాలు కురిస్తేనే పంటలు పండుతాయి. పొట్టలు నిండుతాయి.**

కర్మభూమో, యాగభూమో, జన్మభూమో ఏదో ఒకటి; ముందు ప్రజలందర్నీ కార్యోన్ముఖుల్నీ, కర్తవ్యోన్ముఖుల్నీ చేయండి; ప్రజలలో ఇచ్ఛాశక్తిని మేల్కొల్పండి. వారిలో

ఉద్యమస్ఫూర్తిని రగుల్కొల్పండి! దీక్షను, పట్టుదలను పెంచండి. ఈ పనులు మనవి, వీటి బాగోగులు మనవి, మంచిచెడ్డలు మనవి, ఈ పనులను మనమే స్వయంగా చేసుకోవాలన్న భావన వాళ్ళలో కలగ చేయండి. శ్రమైక జీవనఫలాన్ని అనుభవైకవేద్యం చేయండి. అందరికీ పనికొచ్చే పనులను అరమరికలు లేకుండా అందరూ కలిసిమెలిసి చేసుకుంటే వాటివల్ల కలిగే ఫలితాలు అనూహ్యంగా, అనంతంగా, అద్భుతంగా ఉంటాయని చెప్పండి. సహకారం ఘనమీ ధరణి. ఒకరు చేయలేని పనిని పదిమంది కలిస్తే సులువుగా చేస్తారు. ఈ నిజం అనుభవంలోకి వచ్చాక వాళ్ల పనులు వాళ్ళే చక్కబెట్టుకుంటారు. మీ గుమ్మాలముందు పడిగాపులు కాయరు. మీ ఎదుట చేతులు కట్టుకుని నిలబడరు. వంగి వంగి నమస్కారాలు చేస్తూ చుట్టూ తిరిగేవాళ్లు లేకపోతే నాయకులు బోసిపోతారేమోకాని, ప్రభుత్వాలు విధాన నిర్ణయాలకే పరిమితమైపోయి, ప్రణాళికల రూపకల్పననుంచి పథకాల అమలువరకు ప్రజలకే పెత్తన మివ్వడం మాత్రం నంబర్ వన్ డెమోక్రసీ!●

# 7. లోటు బడ్జెట్లు - ఓటు బడ్జెట్లు

**అ**ధికారం ఉంది కదా అని పన్నులమీద పన్నులు వేసే రాజుకు శత్రువుల వల్లో, వైరిపక్షాలవల్లో కాక ప్రజలవల్లే చేటు మూడుతుంది.

రాజ్యంగాని, అధికారంగాని మంచి కండగల మాంసం ముక్క లాటిది. దాన్ని దక్కించుకోవాలని వైరిపక్షాలు ఎప్పుడూ ఎదురు చూస్తుంటాయి. ప్రజలను పాలించేవారు తాము తోటమాలులమను కోవాలి. తోటమాలి చెట్టుకు దెబ్బ తగలకుండా పూలూ పళ్ళూ ఎలా కోసుకుంటాడో అలాగే పాలకులు కూడా ప్రజలకు బాధలేకుండా పన్నులు వసూలు చేసుకోవాలి.



ప్రజలపై పన్నులభారం మోపడం, ప్రజలను బాధించి పన్నులు వసూలు చేయడం, పాలకోసం పొదుగు కొయ్యడంలాటిది. ప్రజలను నొప్పించకుండా పన్ను రాబట్టుకునే రాజు అందరి ప్రశంసలూ పొందుతాడు. నిజానికి ప్రజల రాబడిలో ఆరవ భాగం మాత్రమే పన్నుగా తీసుకోవాలిట. సుంకాలూ పన్నులూ వసూలు చేయడానికి దయ, ధర్మం, న్యాయంగల అధికారులనే నియమించాలిట.

పన్నులు వేస్తే ప్రజలు భరించలేరు.

కాని, బండి నడిచేదెలా?

ఎలాగంటే, ఆవులు బాగా పాలివ్వాలంటే వాటిని బాగా మేపి, సావిడిలో నీడ కల్పించి వాటి మంచిచెడ్డలు చూస్తున్నట్టే తమ ఏలుబడిలోని అన్నివర్గాల ప్రజలకు ప్రభువులు జీవనోపాధి కల్పిస్తూ, నొప్పి కలుగని పద్ధతిలో న్యాయమైన పన్నులు తీసుకోవాలి. వారికి కష్ట మొచ్చినప్పుడు అండగా నిలబడుతూ, అవసరమైతే రాయితీలు ఇస్తూ, తగు సమయంలో ప్రోత్సాహాలు కల్పిస్తూ వారికి చేరువ కావాలి. పాలకులకు ప్రజలతో మైత్రి ఉంటే, అవసర మొచ్చినప్పుడు వారే ప్రేమతో పన్నులు చెల్లిస్తారు. అదీ రహస్యం.

'బడ్జెట్' అంటే ఆదాయ – వ్యయాల పట్టిక. ఇది అందరికీ వర్తిస్తుంది. అయితే, కుటుంబాల బడ్జెట్‌కు, ప్రభుత్వాలు రూపొందించే బడ్జెట్‌కు తేడా ఉంది. ప్రభుత్వం చేయవలసిన పనులను, చేపట్టదలచే పథకాలను ముందే నిర్ణయించుకుని, ఖర్చులు అంచనావేసి, తరువాత వనరుల గురించి ఆలోచిస్తుంది. ఖర్చులకు తగినంత ఆదాయం లేకపోతే పన్నులు విధిస్తుంది. చాలకపోతే అప్పులు చేస్తుంది. అదీ చాలకపోతే లోటు చూపించి వదిలేస్తుంది. ఈ లోటు బడ్జెట్లు మంచివి కావని భారతంలో చెప్పారు.

ఒకసారి అగస్త్యముని ఒక అడవిలో కొన్ని ప్రాణులు చెట్లకొమ్మలు పట్టుకుని తలకిందులుగా వేలాడడం చూసి, 'ఓ జీవులారా! మీరెవరు? ఎందుకింత కఠినమైన తపస్సు చేస్తున్నారు?' అని ప్రశ్నించగా, ఆ జీవులు

'నాయనా! మేము నీ పూర్వీకులం. తాత ముత్తాతలం. నువ్వు పెళ్లి చేసుకోలేదు కాబట్టి నీ తరువాత మాకు శ్రాద్ధకర్మలు చేసేవాళ్లు లేరు. అందుకని మేమీ తపస్సు చేస్తున్నాం. నీకు సంతానం కలిగితే మా కీ దుర్గతి తప్పుతుంది' అని బదులిచ్చాయి. అగస్త్యుడు అది విని వివాహం చేసుకోవడానికి నిశ్చయించుకున్నాడు. అదే సమయంలో విదర్భ దేశపు రాజు సంతానం కలగలేదని బాధపడుతూ అగస్త్య మహర్షిని దర్శించగా 'మహారాజా! నీకు అందమైన ఆడపిల్ల కలుగుతుంది. పెద్దయ్యాక ఆ అమ్మాయిని నాకిచ్చి పెళ్లి చెయ్యి' అని చెప్పి ఆశీర్వదించాడు. ఆ వరప్రసాదంవల్ల రాజుగారికి కుమార్తె జన్మించింది. ఆమే లోపాముద్ర. ఆమెకు యుక్తవయస్సు వచ్చి సుగుణాలు, రూపలావణ్యాలతో లోకప్రసిద్ధి పొందినా అగస్త్యుడు శపిస్తాడేమోనని ఆమెను పెళ్ళాడడానికి ఏ రాకుమారుడూ ముందుకు రాలేదు.

అటువంటి సమయంలో విదర్భకు వచ్చిన అగస్త్యుడు తనకిచ్చినమాట ప్రకారం లోపాముద్రను తనకిచ్చి వివాహం చెయ్యమంటాడు. సుకుమారి అయిన కూతుర్ని అడవుల్లో తపస్సు చేసుకునే మునికి ఇవ్వడం ఇష్టంలేక మధనపడుతున్న తల్లిదండ్రుల్ని గమనించిన లోపాముద్ర, 'నాన్నగారూ! నా కోసం మీరు దిగులుపడొద్దు. ఆడినమాట తప్పారన్న అపవాదు మీకు రాకూడదు. మీరు చేసిన వాగ్దానం ప్రకారం నన్ను అగస్త్య మునికిచ్చి పెళ్ళి చేయండి. మీ మాటా నిలుస్తుంది; ముని ఆగ్రహమూ తప్పుతుంది. ఈ వివాహం నాకు అంగీకారమే' అని ఒప్పించడంతో వారు లోపాముద్రను అగస్త్యుని కిచ్చి పెళ్ళిచేశారు. కేవలం నారబట్టలతో మునివెంట అడవులకు వెళ్లింది లోపాముద్ర. గంగానదీ తీరంలోని ఆశ్రమంలో పూజాలూ వ్రతాలూ చేస్తూ, ఆశ్రమ నియమాలు పాటిస్తూ

**నా పుట్టింట్లో ఉన్నప్పుడు వజ్రవైఢూర్యాది ఆభరణాలు అలంకరించుకుని ఎలా ఉండేదాన్నో అలా ఈ ఒక్కరాత్రికీ ఉండాలని ఉంది.**

వెలుగుతోంది. ఒకనాడు భార్యమీద ప్రేమకలిగిన అగస్త్యుడు ఆమెను దగ్గరకు తీసుకోగా సిగ్గుపడుతూ, 'స్వామీ నాదో కోరిక! నేను నా పుట్టింట్లో ఉన్నప్పుడు వజ్రవైఢూర్యాది ఆభరణాలు అలంకరించుకుని ఎలా ఉండేదాన్నో అలా ఈ ఒక్కరాత్రికీ ఉండాలని ఉంది. ఆ రూపంలో మిమ్మల్ని ఆనందపరచాలనుకుంటున్నాను' అంది. 'నువ్వు చెప్పినట్టు చేయడానికి నేనేం మహారాజును కాదు' అని బదులిచ్చిన అగస్త్యునితో, 'అలా అనకండి. మీరు మహర్షులు, తపోధనులు. మీ రడిగితే ఏ రాజు కాదంటాడు?' అంది లోపాముద్ర.

**ప్రజోపయోగకరమైన ప్రాజెక్టులకు, పథకాలకు రూపకల్పన చేసినప్పుడు గడువులోనే అవి పూర్తయ్యేలా చూడాలి.**

భార్యను నొప్పించలేని అగస్త్యుడు ఆ మరునాడే దేశాటనానికి బయలుదేరాడు. 'నాకు దానం చేసినందువల్ల మీకు నష్టంకాని, మరొకరికి కష్టంకాని కలగకుండా ఉంటే నాకు కొంత ధనసహాయం చేయండి' అని చాలా భాగ్యవంతుడని పేరొందిన ఒక రాజు దగ్గరికి వెళ్ళి అర్థించాడు. అప్పుడా రాజుగారు తన రాజ్యం తాలూకు ఆదాయవ్యయాలను ఏమాత్రం దాచకుండా లెక్కలన్నిటినీ చూపాడు. వాటి ప్రకారం ఆ రాజ్యంలో మిగులనేది లేనేలేదు.

'మీవద్ద దానం తీసుకుంటే మీ ప్రజలు కష్టపడవలసి వస్తుంది. నాకు ఎంతైతే సహాయం చేస్తారో మళ్ళీ అంతా ప్రజలమీద పన్ను వేయాల్సి వస్తుంది కాబట్టి నాకు మీరు సాయం చేయొద్దు' అని చెప్పి ముని వెళ్ళిపోయాడు. అలా ఏ రాజుదగ్గరకు వెళ్లినా అదే పరిస్థితి ఎదురుకావడంతో తన కారణంగా ప్రజలనెత్తిన పన్నులు వేయాల్సివస్తుందని ఆ ప్రయత్నం విరమించుకున్నాడు. అయితే, భార్య బలవత్తరశక్తి కనుక మామూలు రాజుల్ని వదిలేసి చివరకు అపర కుబేరుడైన యయాతిని అర్థించి ఆమె కోర్కె తీర్చి, సంతోషం పంచుకున్నాడు. అది వేరే కథ.

రాబడికి, ఖర్చులకు సరిపోయే తూకం - బడ్జెట్లున్నా ఫరవాలేదుకాని, బడ్జెట్‌లో లోటు ఏర్పడితే ఆ లోటును పూడ్చేందుకు అదనపు నోట్లు ముద్రించి చెలామణికి తెస్తే లోటు పూడినా, ద్రవ్యోల్బణం పెరుగుతుంది. అంటే ధరలు పెరుగుతాయి; ప్రజలు కష్టపడతారు, కొనుగోలుశక్తి తగ్గిపోతుంది. అందుకే, తెలివైన ప్రభుత్వాలు లోటును భర్తీ చేసేందుకు ఎంత మొత్తాన్నయితే అదనంగా చెలామణిలోకి తెస్తాయో అంతమొత్తాన్నీ అభివృద్ధి పనులకు వినియోగించి ప్రజలకు ఉపాధి కల్పిస్తూ వాళ్ల జీవన స్థితిగతుల్ని మెరుగు పరుస్తాయి. అటువంటివే నిజమైన సంక్షేమ ప్రభుత్వాలు.

అభివృద్ధి వ్యయంకన్నా అనుత్పాదక వ్యయం తక్కువగా ఉండాలి. ప్రజలకు ఉపయోగపడే ఏ ప్రాజెక్టుపై ఎంత వెచ్చించినా అది అభివృద్ధి వ్యయమే అవుతుందికాని, ఆ ప్రాజెక్టు స్థాపనకోసం చేసే మిగిలిన ఖర్చులు అంటే సిబ్బంది జీతబత్తేలు, ఆ ప్రాజెక్టు పూర్తయ్యేవరకు చేసే రోజువారీ ఖర్చులు ప్రణాళికేతర వ్యయం కిందకు వస్తాయి. ఈ ప్రణాళికేతర వ్యయం పెరగకుండా జాగ్రత్తపడాలి. అంటే అనుకున్న పనులు అనుకున్నట్టు పూర్తవ్వాలి. ప్రజోపయోగకరమైన ప్రాజెక్టులకు, పథకాలకు రూపకల్పన చేసినప్పుడు వాటిని పూర్తిచేసేందకుకు నిర్ణయించిన గడువులోనే అవి పూర్తయ్యేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపైన, ప్రభువులపైన ఉంటుంది. ఇది వారి ప్రథమ కర్తవ్యం. చేసే పనులు తక్కువ ఖర్చుతో, ఎక్కువ ఆదాయం వచ్చేవిగా ఉన్నాయా, లేదా అని కూడా చూసుకోవాలి. ఇవే మంచి బడ్జెట్ లక్షణాలు.

'విస్తృత ప్రయోజనాలను, సమాజ హితాన్ని కోరి చేపట్టే పనులు ఆలస్యం చెయ్యకుండా వెంటనే ప్రారంభించాలి. ప్రారంభించిన పనులు సకాలంలో పూర్తికావాలి. ఆలస్యమైన కొద్దీ ఖర్చులు పెరిగిపోతాయి. అనుత్పాదక వ్యయం పెరుగుతుంది. అలా పెరిగితే చివరికి ఆ పథకాల మౌలిక ప్రయోజనాలే దెబ్బతింటాయి. అందుకని మంచిపనులు మొదలు పెట్టేందుకు ముందువెనుకలు చూడొద్దు' అని భీష్ముడు చెప్పాడు ●

# 8. నాయకుని గుణగణాలు

'నాయకునికి ఉండవలసిన గుణగణాలేమిటి?' అని అడిగాడు ధర్మరాజు భీష్మణ్ణి.

భీష్ముడు నవ్వాడు. 'నాయనా! నాయకత్వం బహుముఖాలుగా ఉంటుంది. అదొక సంక్లిష్టకళ. అది నేర్వడం అసిధారావ్రతం. ఎవరు ఏ రంగంలో అగ్రగామిగా ఉండాలన్నా వాళ్లకు విధిగా కొన్ని లక్షణాలుండాలి. అవేమిటంటే నిండైన వ్యక్తిత్వం ఉండాలి. నీతి నిజాయితీ వుండాలి. అకళంకితంగా బతకాలి. కష్టాల్లో కుంగడం, సుఖాల్లో పొంగడం కూడదు. ధైర్యసాహసాలుండాలి. తనమీద తనకు నమ్మకం ఉండాలి. లోకజ్ఞత, చొరవ, ఉత్సాహం, పట్టుదల, నిష్పాక్షికత కావాలి. కార్యజ్ఞానం, కర్తవ్యజ్ఞానం, తెలిసి వుండాలి. హితంగా మాట్లాడే నేర్పు ఉండాలి. సమయస్ఫూర్తి కావాలి' అని చెప్పాడు.

నాయకత్వం వహించడం, నాయకునిగా చలామణి కావడం అన్నవి అల్లాటప్పా విషయాలు కావు. An essential aspect of great leadership is a high level of personal integrity. A strong value system goes a longway in creating the right role model for team members. పాటలి పుష్పం తన సువాసనల్ని మట్టిముద్దలోకి కూడా ఎలా ప్రవేశ పెడుతుందో, అలాగే నాయకుడన్నవాడు తన జ్ఞానాన్నీ, వివేకాన్నీ, అనుభవాన్నీ తనవెంటే నడుస్తున్నవాళ్ళకు పంచాలి, వాళ్ళల్లో ఉన్న అవలక్షణాలను నివారించాలి. This is the hall-mark of every good leader. ఉద్యమమో, సంస్థో, దేశమో ఏదైనా కానివ్వండి; ఎవరు దేనికి నాయకత్వం వహిస్తుంటే వారు దాని పర్పస్ నెరవేరేలా, నిర్దేశించుకున్న ప్రయోజనాలు సిద్ధించేలా చూడాలి. దటీజ్ ద ప్రైమరీ టాస్క్ ఆఫ్ ది లీడర్. ఇందుకోసం అతను దీర్ఘదర్శి కావాలి.

హి మస్ట్ బి ఎ విజనరీ.

నాకు ఇంకొకటి అనిపిస్తోంది. ఈ సమాజంలో ఒకరు ఏది చేస్తే మిగిలిన వాళ్ళందరూ అదే చేస్తుంటారు. సమాజమంటే మంది; సమజమంటే మంద. మందలో ఒకరిగా వుండడానికి ప్రయత్నమేమీ అక్కరలేదు. మందిలో మన్ననగల స్థితిని సంపాదించడానికి మాత్రం ఒకింత తెలివి, కృషి కావాలి. అవి వున్నవాళ్ళు నాయకులవుతారు. అది సరే, మీ కో రహస్యం చెప్పనా! విన్నర్స్ డోన్ట్ డూ డిపరెంట్ థింగ్స్ దే డూ థింగ్స్ డిఫరెంట్లీ!!

వాళ్లేమీ మీకూ, నాకూ తెలియని విషయాలూ, ఈ భూమిమీద లేని విషయాలూ చెప్పరు. నలుగురికీ తెలిసినవే వాళ్ళు సరికొత్తగా చెబుతారు, వాళ్ళశైలిలో చెబుతారు. మనల్ని ఇంప్రెస్ చేస్తారు. దట్సాల్!

నాకు బాగా గుర్తు మా ఊళ్లో మా చిన్నప్పుడు శివాలయం దగ్గర దోసకాయలబండో, చిలగడదుంపల బండో ఆగేది. అక్కడి చెట్టునీడన ఎడ్లను కట్టేసి, వాటిముందర ఇంత ఎండుగడ్డి వేసి, వెంటవచ్చిన కొడుకునో, కూతుర్నో బండికి కాపలా ఉంచి, బండి యజమాని ఊరంతా అరుచుకుంటూ పోయేవాడు 'శివాలయంకాడ దోసకాయల బండి ఆగిందహో' అని. పొలోమని జనమంతా పోయేవారు. అప్పటికింకా 'బార్టర్ సిస్టమ్ అమలులో ఉంది. బియ్యమో, నూకలో, రూకలో ఇచ్చి దోసకాయలు తెచ్చుకునేవాళ్ళు.

దానికే ఇప్పుడు కొత్తరూప మిచ్చి రైతుబజార్లని పేరు పెట్టారు. మా ఊరి శివాలయం దగ్గర అప్పుడు ఒక బండి ఆగితే, ఇప్పుడు ఇరవయ్యో, పాతికో లారీలు, బస్సులు, ట్రాక్టర్లు ఆగుతున్నాయి. రైతులు వాళ్ళు పండించిన కూరగాయ లన్నింటినీ అక్కడికే తెస్తున్నారు. కాకపోతే ఇప్పుడు దాన్ని క్రమబద్ధం చేసాం. ఒక కూడలి ప్రాంతంలో రైతులకు కొన్ని షెడ్లు కేటాయించడం, పచ్చటి

**ఎవరు దేనికి నాయకత్వం వహిస్తుంటే వారు దాని పర్పస్ నెరవేరేలా, నిర్దేశించుకున్న ప్రయోజనాలు సిద్ధించేలా చూడాలి.**

కూరగాయలు అక్కడ రాసులు పోసి ఉండడం, మార్కెటింగ్ శాఖవారు మైకులో ధరవరలు ప్రకటిస్తూండడం... అదేదో తిరునాళ్ళలా, సంతలా మారిపోవడం... మారిపోవడ మేముంది? అదసలు సంతే! దానికే కొత్తపేరు పెట్టాం. ఉయ్ డిడ్ ద సేమోల్డ్ థింగ్ ఢిఫరెంట్లీ. దానితో జనం ఆకర్షితులయ్యారు. అంతే.

భీష్ముడు ఇంకోమాట చెప్పాడు. 'నాతోపాటు రండి, నన్ను అనుసరించి నడవండి' అంటూ యుద్ధభూమికి కదిలేవాడూ, అన్నిటికీ ముందుండేవాడూ, తొలి అడుగు వేసేవాడు నాయకుడు.

'నాయకుడన్నవాడు తన సహచరుల్లోనూ, కార్యకర్తల్లోనూ, తనకింద పనిచేసే ఉద్యోగస్తుల్లోనూ ఒకరుగా కలిసి పోవాలి. అనుభవశాలిగా, హితుడిగా వాళ్ళకు మంచి సలహాలు, సూచనలు ఇస్తుండాలి. వాళ్లకు కర్తవ్యజ్ఞానం కలిగించాలి. సాధించవలసిన లక్ష్యాల గురించి చెప్పాలి. అవకాశం దొరికినప్పుడల్లా వాళ్ళు చేసిన మంచిపనులను పొగడాలి. అవసరమైతేనే విమర్శించాలి. నీ అనుభవా లేమిటో వాళ్ళకు చెప్పి



సమస్యలనుంచి వాళ్ళు ఉపాయంగా ఎలా బయటపడాలో చెప్పాలి. కార్యకర్తల విజయాల్లోనూ, తమకింద పనిచేసే ఉద్యోగుల విజయాల్లోనూ పాలుపంచుకోనివాడు నాయకుడే కాదు. అనుచరులకు పనిచేయా లనిపించే ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించి, చాతుర్యంగా వాళ్ళచేత పనులు చేయించుకోవాలి. నాయకులు కఠినంగా వ్యవహరించాల్సిందే! అలా అని న్యాయమార్గాన్నీ, ధర్మమార్గాన్నీ విడిచి పెట్టకూడదు. వ్యవహారశుద్ధికి హాని రానివ్వకూడదు. నాయకుడన్నవాడు ఎప్పుడూ ప్రజల పక్షాన నిలవాలి. తన వెన్నంటి ఉండేవాళ్ల బాగుకోసం పరితపించాలి. ఆపద సమయాల్లో వాళ్ళను ఆదుకోవాలి.

'మూలబలం సంతుష్టిగా ఉంటేనే నాయకులకు జయంమీద జయం కలిగేది - అన్నిటికన్నా ముఖ్యం - నాయకులు సచ్చరితులూ కార్యనిర్వహణపట్ల ఉత్సాహం కలవారై, తమ అనుచరుల్లో కూడా అలాంటి సద్వర్తనను, ఉత్సాహాన్నీ కలిగించాలి. వాళ్ళని కార్యోన్ముఖుల్నీ, కర్తవ్యోన్ముఖుల్నీ చేయాలి. సత్కార్యాలు సాధించే ఉపాయాలు చెప్పాలి. ఉపాయంతో చేసే పనిలో శ్రమ కనిపించదు. పురుష ప్రయత్నం సరిగా ఉంటే కార్యస్వరూపం స్పష్టంగా కనబడుతుంది. పైన దైవం ఎంత ఉన్నా, అతగాడు కూడా పురుష ప్రయత్నాన్ని అనుసరించే ఉంటాడు. కనుక పురుష ప్రయత్నమూ, ఉపాయమూ రెండూ కలిసాయో సాధించలేని దంటూ ఉండదు. చివరగా ఒకమాట చెప్పనా! నాయకుడికి వినయం, నమ్రత, ఒద్దిక ఉండాలి. ఎవరినుంచి ఏ మంచి సలహా వచ్చినా, సూచన వచ్చినా స్వీకరించే సహృదయం ఉండాలి. విమర్శలను విశాల హృదయంతో అందుకునే సంస్కారం ఉండాలి'.

విల్లింగ్‌నెస్ టు అడ్మిట్ మిస్టేక్స్ అండ్ విల్లింగ్‌నెస్ టు మేక్ కరెక్షన్స్! హ్యూమిలిటీకి ఇది పరాకాష్ట కదూ! ●

# 9. ఎదిగేకొద్దీ ఒదగాలి

**ఒ**ప్పుకున్నామండీ! పాలకు లెప్పుడూ ప్రజల మేలే కోరాలి; ప్రజలకు పనికొచ్చే పనులే చేయాలి. కాని, వాటిని చిత్తశుద్ధితో అమలుచేసే మంచి అధికారులు కూడా ఉండాలికదా?! 'నా రాజరికం, నా అధికారం, నా డబ్బు, నా పలుకుబడి అన్నీ కష్టంలో ఉన్నవారిని ఆదుకునేందుకు, ఆర్తులైన ప్రాణులకు ఆనందం కలిగించేందుకు ఉపయోగపడితే చాలు, అదే పదివేలు' అనుకునే వారు పాలకులుగా, అధికారులుగా ఉంటేనే ప్రజలు చల్లగా సుఖంగా ఉండేది. ప్రభువులు ప్రజలకోసం ఎన్ని పథకాలు రూపొందించినా, ఎన్ని సత్కార్యాలకు శ్రీకారం చుట్టినా, వాటిని అమలుచేసే అధికారులు సరైనవారు కాకపోతే రాజుల సొమ్మంతా రాళ్లపాలవుతుంది.

పాలకులూ, అధికారులూ దీపాల్లాంటి వాళ్లు. వాళ్లు సమాజానికి వెలుగు నివ్వాలి. దీపం వెలగాలంటే నూనె కావాలి. పాలకులు వెలుగొందాలంటే నీతి, నిజాయితి, సత్ప్రవర్తన, మంచిశీలం, మంచిగుణం కలిగి ఉండాలి.

The success and failure of a government depends upon the intergrity, honesty, maturity and energy of its administrators and their ability to inculcate desirable values at the bottom-line. ఒక ప్రభుత్వం యొక్క జయాపజయాలు ప్రభుత్వ పాలకుల నిండైన వ్యక్తిత్వం, ఆత్మశుద్ధి, బుద్ధి పరిపక్వతలమీద ఆధారపడి ఉంటాయి. వాళ్ళు వాళ్ళ అనుచరగణంలో 'విలువల్ని' ప్రోది చెయ్యగలగాలి. మనమంతా గొప్పగొప్ప రాజులం కావాలని, చక్రవర్తులం కావాలని, నాయకులం కావాలని కోరుకుంటాం. కేవలం 'గొప్ప'

**ఒక ప్రభుత్వం యొక్క జయాపజయాలు ప్రభుత్వ పాలకుల నిండైన వ్యక్తిత్వం, ఆత్మశుద్ధి, బుద్ధి పరిపక్వతలమీద ఆధారపడి ఉంటాయి.**

వాళ్ళం కావడంమీదే మన దృష్టి అంతా. కాని, గొప్పపనులు చేస్తేనే గొప్పవాళ్ల మవుతామన్న విషయాన్ని మాత్రం విస్మరిస్తాం. అదీ చిత్రం! మనమూ, మన కింద పనిచేసేవాళ్లూ అందరం మనం నిర్వర్తించాల్సిన పనులను చాలా యాంత్రికంగా, లైక్ మెషీన్స్, గత్యంతరంలేక తప్పనిసరై చేస్తున్నామన్నట్లు చేస్తాం. మనం చేసే పనుల్లో జీవంకాని, చైతన్యంకాని ఉండవు. మనం మనకు అప్పగించిన పనితో మమేకం కాము. పనిలో లీనమై తాదాత్మ్యం చెందం. We never identify with our work. ఈ పనిని ఇంత చక్కగా, నేర్పుగా, సమర్ధంగా చేశాడన్న మనదైన బలమైన ముద్ర ఏదీ మనం చేసిన పనిమీద ఉండదు. ఇంక మన మెలా గొప్పవాళ్లమవుతాం? గొప్పవాళ్ళం కావాలంటే గొప్పగొప్ప పనులు చేయాలి. గొప్ప పనులు చేయడం, గొప్పవాళ్లు కావడం అనేవి పరస్పర ఆశ్రయాలు, పరస్పర ఆధారితాలు. బట్ డూయింగ్ ఎ గ్రేట్ జాబ్ కమ్స్ ఫస్ట్. అలా అని గొప్పపనులు చేయడం ఒక్కరోజులో సాధ్యంకాదు. సాధనమున పనులు సమకూరు ధరలోన. మనకు తెలియని విషయాన్ని తెలుసుకోవాలి, నేర్చుకోవాలి. అలా తెలుసుకుంటూ, నేర్చుకుంటూపోతే మనకు తెలియకుండానే మన చేతులద్వారానే అద్భుతాలు జరుగుతాయి. ఆ అద్భుతాలే మనల్ని పూర్ణమానవులుగా తీర్చిదిద్దుతాయి. విశిష్ఠ వ్యక్తులుగా నిలబెడతాయి. మనం అధికమైన పనులు చేస్తే అధికులమవుతాం. అల్పమైన పనులు చేస్తే అల్పులమవుతాం. మనం ఒక పనిని సంకల్పిస్తాం, ఆ పనిని సృజిస్తాం. మనం చేసిన ఆ 'పని'వల్లే మనకు ఖ్యాతి వచ్చినా, అపఖ్యాతి వచ్చినా! అంటే ఆ పనే మనల్ని సృజిస్తోందన్నమాట. సో వుయ్ క్రియేట్ వర్క్ అండ్ ద వర్క్ క్రియేట్ అజ్. వర్క్ అండ్ వుయ్ ఆర్ ఆన్‌సెపరబుల్.

**గొప్పవాళ్ళం కావాలంటే గొప్పగొప్ప పనులు చేయాలి. గొప్ప పనులు చేయడం, గొప్పవాళ్లు కావడం అనేవి పరస్పర ఆశ్రయాలు, పరస్పర ఆధారితాలు.**

భీష్ముడు పాండవులకు చెప్పాడు.

'ఇప్పుడు అధికారం మీ చేతికి వచ్చింది. మీరంతా అనుక్షణం జాగరూకులై, అప్రమత్తులై మీ బుద్ధిని మంచి పనులమీదే లగ్నం చేయండి. గొప్ప గొప్ప కార్యాలు సాధించండి. గొప్ప పనులు చేయడంవల్లనే నరులు వృద్ధిలోకి వస్తారు. ఏ పనులు చేస్తే మంచిదో, ఎలాంటి పనులు చేస్తే మంచిదో అలాంటి పనులుమాత్రమే చేయండి. ఎలా ఉంటే మంచిదో అలానే ఉండండి; అలాగే నడుచుకోండి. అధికారంలో ఉన్నవారి కెవరూ సాధరణంగా మీరు చేస్తోంది ఇది మంచి, ఇది చెడు అని చెప్పరు. చెబితే వాళ్ళేం చేస్తారోనని భయం. అందుకని మీరే ఏది మంచో, ఏది చెడో విజ్ఞులద్వారా ఎప్పటికప్పుడు తెలుసుకోండి.

మరో ముఖ్యవిషయం–చేపట్టిన పనిని దేనినీ మధ్యలో వదిలివెయ్యకండి. ఆ పని సానుకూలమయ్యేవరకు శ్రమించండి. శ్రమిస్తేనే జయం సిద్ధిస్తుంది. మంచి పనులకు చాలా విఘ్నాలు ఎదురుకావచ్చు. వేటికీ తల వంచకండి, వేటికీ బెదరకండి. కార్యశూరుల్ని ఎవరూ ఏమీ చెయ్యలేరు.'



లీడర్‌షిప్ బిల్డింగ్‌లో ఇంప్లాకబిలిటీ ప్రధానపాత్ర వహిస్తుంది. ఇంప్లాకబిలిటీ అంటే నిరంతర కృషి, నిరంతర సాధన. రెలెంట్‌లెస్‌గా పనిచేయడం. కష్టాలను, వైఫల్యాలను, అవరోధాలను, నిరుత్సాహ పరిచేవాళ్లనూ లెక్కలోకి తీసుకోకుండా ముందుకు సాగిపోవడం. మహాత్మాగాంధి, మార్టిన్ లూథర్ కింగ్, మదర్ థెరిస్సా, అబ్రహం లింకన్ లాంటి మహానుభావులు ఎన్ని కష్టాలు వచ్చినా, వాళ్ల జీవిత ధ్యేయాలనుంచి ఎలా వెనక్కి మళ్ళలేదో అలాంటి పేషెన్సు అండ్ డెడికేషన్ ఉండాలి. అప్పుడు ఫలితాలు వాటంతటవే వస్తాయి. భగవద్గీతలో కృష్ణుడేం చెప్పాడు?! చేయవలసిన పనిని ఎటువంటి ప్రతిఫలం ఆశించకుండా త్రికరణశుద్ధిగా చేస్తే అందువల్ల కలిగే ఫలితాలు అనూహ్యంగానూ, అనంతంగాను ఉంటాయనలేదూ!

బాస్‌లు, బిగ్ బాస్‌లు కావాలనుకునేవారు అలవరచుకోవల్సిన మంచి లక్షణా లివి. ఈ మధ్యనే ఎక్కడో పేపర్లో చదివాను. యూనివర్శిటీ ఆఫ్ మిచిగాన్ బిజినెస్ స్కూల్‌కు చెందిన ప్రొఫెసర్ నోయల్.యం.టికిలీడర్‌షిప్ బిల్డింగ్‌లోనూ, ఆర్గనైజేషన్ రీస్ట్రక్చరింగ్‌లోనూ నిపుణుడు. ఆయన ఒకసారి ఢిల్లీలో భారతీయ పరిశ్రమం సమాఖ్య సభ్యుల నుద్దేశించి మాట్లాడుతూ, 'విజయపథాన నడవాలనుకునే సంస్థలు ప్రతి స్థాయిలోనే నాయకుల్ని తయారుచేసు కుంటాయి. రేపటితరం కోసం సమర్థులైన నాయకుల్ని తయారు చేయడమే ఈ తరం నాయకుల ప్రాథమిక బాధ్యత కావాలి' అన్నారు.

'Ideas coupled with values and driven by the emotional energy and edge constitute the leadership engine. The leader lives the values both in his private and public life' అని ప్రొఫెసర్ టికి పేర్కొన్నారు ●

# 10. ఆఫీసర్లు - పేషీలు

భీష్ముడు పాలకులకు ఉండవలసిన లక్షణాలగురించి పాండుకుమారులకు చెప్పాడు. తాతగారు చెబుతుంటే మనవలు శ్రవణం చేశారు. మంచేదో తెలుసుకోవాలంటే మొదట శ్రవణమే చేయాలి. శ్రవణమే కదా జ్ఞానానికి తొలిసోపానం!

ప్రతిరాజూ ముందు తనను తాను గెలవాలి. అంటే ఇంద్రియాలను జయించాలన్నమాట. ఆ తరువాతనే శత్రువులను గెలిచే విధానం ఆలోచించాలి. తనను తాను గెలవనివాడు శత్రువులను గెలవలేడు. స్త్రీ వ్యామోహం, జూదం, తాగుడు, వేట, దూషణం, వాక్పారుష్యం, దండ పారుష్యం విడిచి పుణ్యకార్యాలు చెయ్యాలి. ఎప్పుడూ దుర్మంత్రుల కౌటిల్యానికి లోబడకూడదు. నిత్యం ధర్మాన్ని సేవించాలి. ఇది చాలా ముఖ్యం. ధర్మార్థకామాలనే త్రివర్గాలలో ప్రమాదవశాత్తూ అర్థకామాలు రాజును లోబరుచుకున్నా ధర్మశక్తితో ప్రభువు పరిపాలించ గలుగుతాడు. అదీ రహస్యం. పాలకులు సత్యవాదులు, స్నేహశీలురు, ధర్మజ్ఞులు, క్షమాశీలురు, కృతజ్ఞులు, దయావంతులు, ప్రియభాషులు, పెద్దలను గౌరవించేవారు, లజ్జాస్వభావులు, వ్యవహార విషయంలో శత్రుమిత్ర సములూ అయుండాలి. తప్పు తెలిసి దండించేవాడు, తనను తాను పొగుడుకోనివాడు, గర్వం లేనివాడు, స్థిరబుద్ధితో వ్యవహరించేవాడు, మదలోభావేశాలు లేనివాడూ రాజైతే అంతకంటే కావల్సిందేముంది? అలాంటివాడికి సకల శుభాలూ కలుగుతాయి. మంచి వాళ్ళను

> **ధర్మార్థకామాలనే త్రివర్గాలలో ప్రమాద వశాత్తూ అర్థకామాలు రాజును లోబరుచుకున్నా ధర్మశక్తితో పరిపాలించ గలుగుతాడు.**

విడవకుండా ఉండటం, బుద్ధిమంతులను సేవించడం, ప్రజల కష్టసుఖాలు పరామర్శించడం, కష్టాలలో వున్నవారిని ఓదార్చడం, కులీనులను అక్కున చేర్చుకోవటం, అయోగ్యులను దగ్గర చేర్చకపోవటం రాజుల కత్యవసరం.

'అధికారంలో ఉన్నవారిచుట్టూ రకరకాల మనుషులు చేరుతూ ఉంటారు. వాళ్ళు స్వార్థబుద్ధితో ప్రభువులలో లేని గుణాలను ఉన్నట్టు పేర్కొంటూ ప్రశంసలలో ముంచెత్తుతుంటారు. అధినేత ఉబ్బితబ్బిబ్బవకూడదు. విర్రవీగ కూడదు. వాళ్ళను దూరంగా ఉంచాలి. ఎంత ఆదరించదగిన వారైనా సరే, అతిశయంతో కన్నూమిన్నూ కానకుండా ప్రవర్తిస్తుంటే వారిని శిక్షించాలి అధికారంలో ఉన్నవారి అండ ఉన్నది కదా అని చేయవలసిం దేదో, చేయగూడనిదేదో తెలియకుండా దారితప్పి నడిచేవాళ్ళను దండించాలి. నీచులు ఉపకారం చేసిన వారికి కూడా అపకారం చేయ్యాలనుకుంటారు. ఇతరులు ఏమనుకుంటారో అనే భయం వాళ్ళకి ఉండదు. అపకారం చెయ్యడమే వాళ్ళకు ఇష్టం. అందుకని అల్పబుద్ధి గలవాళ్ళకు అధికారం ఇవ్వకూడదు. వాళ్ళదగ్గర ఎన్ని విద్యలు ఉన్నా అవి వాళ్ళచేత పాపాకర్మలే చేయిస్తాయి. పాము పాలుతాగితే విషమే పెరుగుతుందికాని అవి అమృతంగా మారవు. అధికారంలో ఉన్నవాళ్ళదగ్గర ఎటువంటి సహాయకులు ఉండాలో, ఎటువంటి వారు ఉండకూడదో తెలుసుకునేందుకు మీకో కథ చెబుతాను. మా గురువైన భార్గవరాముడికి తపోవనంలో మహర్షులు చెప్పిన వృత్తాంతం ఇది.

**నీచులు ఉపకారం చేసిన వారికి కూడా అపకారం చేయాలనుకుంటారు. ఇతరులు ఏమను కుంటారో అనే భయం వాళ్ళకి ఉండదు.**

*'ఒక అడవిలో ఒకానొకప్పుడు ఒక మహర్షి తపస్సు చేసుకుంటూ ఉండేవాడు. ఆయన ఆత్మనిష్ఠ, సాధుతత్త్వం, సజ్జన స్వభావం కారణంగా అక్కడ ఉన్న జంతువులన్నీ పరస్పర వైరాన్ని మరచి కలసిమెలసి ఉండేవి. ఆశ్రమప్రాంతానికి*

వచ్చినప్పుడల్లా అవి మహర్షిదగ్గరకు వెళ్ళి ఆయన చుట్టూరా తిరిగి బుద్ధిగా ఆయన ముందు కాసేపు కూర్చుని వాటిదోవన అవి పోతుండేవి. ఇలా ఉండగా, ఒకసారి గ్రామాల్లో తిరిగే ఒక శునకం ఆశ్రమప్రాంతానికి వచ్చింది. వచ్చి అక్కడే ఉండిపోయింది. అది కూడా మహర్షిమీద అవ్యాజమైన అభిమానం పెంచుకుంది. ఇలా ఉండగా ఒకనాడు మంచి ఆకలిమీద ఉన్న చిరుతపులి ఒకటి ఆశ్రమ ప్రాంతానికి వచ్చి శునకాన్ని చూసి లొట్టలేసింది. అది చూసి శునకం భయపడి పరుగెత్తుకుంటూ వచ్చి మహర్షిని శరణువేడింది. గజగజ వణికిపోతున్న కుక్కకు మహర్షి అభయమిచ్చి దానిని కూడా చిరుతపులిగా మార్చేశాడు. ఈ అనూహ్య సంఘటనతో మొదటి చిరుత తోక ముడిచింది. దాంతో చిరుతరూపంలో ఉన్న గ్రామసింహానికి ఎక్కడలేని ధైర్యం వచ్చి అడవంతా యథేచ్ఛగా తిరగడం ప్రారంభించింది. ఆ తరువాత కొన్నాళ్ళకు మళ్ళీ ఇలాగే జరిగింది. అడవిలోకి కొత్తగా వచ్చిన



ఒక పెద్దపులి చిరుత రూపంలో ఉన్న శునకాన్ని భయపెట్టింది. అది గోలుగోలున ఏడుస్తూ మహర్షిదగ్గరకు వెళ్లింది. మహర్షి దానిని కూడా వ్యాఘ్రంగా మార్చాడు. పెద్దపులిగా మారిపోవడంతో కుక్కకు అప్పటివరకూ ఉన్న సాత్విక స్వభావం, విశ్వాసం అన్నీ క్రమంగా సన్నగిల్లాయి. మాంసాహారానికి అలవాటు పడింది. కానీ సహజ లక్షణాల్లో ఒకటైన భయం మాత్రం కుక్కలో తొలగలేదు. ఇంకెప్పుడో ఒకసారి మదపుటేనుగును చూసి, మరోసారి సింహాన్ని చూసి భయపడితే మహర్షి కుక్కను కూడా ఏనుగుగా, సింహంగా మార్చేశాడు. అయితే, కుక్క ఎప్పుడైతే సింహంగా మారిందో అప్పటినుంచి అది భయంకరమైన క్రూరత్వాన్ని ప్రదర్శిస్తూ అడవిలోని జంతువుల్ని ఆశ్రమప్రాంతానికి రాకుండా చేసింది.

'ఇలా కొంతకాలం గడిచాక ఎనిమిది కాళ్ళు, నెత్తిమీద కళ్ళూ ఉండి, సింహగజాలు కలగలిసిన రూపంతో ఉన్న అతిభయంకరమైన శరభ మృగం అడవినంతా చికాకుపరుస్తూ అక్కడకు వచ్చింది. మళ్ళీ కథ మామూలే. మహర్షి దయవల్ల కుక్క శరభంగా మారిపోయింది. దాన్నిచూసి మొదటి శరభం సుత్తువకొద్దీ పరుగెత్తింది. శరభరూపంలో ఉన్న కుక్క అదిచూసి విరగబడి నవ్వింది. ఇంక దానికి పట్టపగ్గాలు లేకుండాపోయాయి. దాని ప్రవర్తన పూర్తిగా మారింది. ప్రతి జంతువునూ హింసించేది. ప్రతి చిన్నప్రాణినీ భయపెట్టేది. అవి దీనంగా ఏడుస్తూ విలవిల్లాడుతుంటే శరభరూపంలో ఉన్న కుక్క రాక్షసానందం అనుభవించేది. అలా ఉండగా, ఒకరోజు దాని కో అనుమానం కలిగింది. 'ఈ మహర్షి ఇన్నాళ్ళూ నా రూపాన్ని నేను కోరినట్టు మార్చాడు. అయితే, నాలాగే ఆయనను శరణుకోరి బతుకుతున్న జంతువులు అనేకం ఈ అడవిలో ఉన్నాయి.

**ఇక సునకానికి పట్టపగలు లేకుండాపోయాయి. దాని ప్రవర్తన పూర్తిగా మరింది. ప్రతి చిన్న ప్రాణినీ భయపెట్టేది. అన్నిటంటినీ హింసించేది.**

వాటికి కూడా నాలాగే ఎప్పుడో అప్పుడు ఏ ఆపదో ముంచుకొచ్చి ఆయనను శరణుకోరితే వాటిని కూడా మహర్షి పులిగానో, సింహంగానో, అంతకంటే ఇంకా ఏదైనా పెద్దజంతువుగానో మార్చవచ్చు. అప్పుడు నా గతేమిటి? అనుకుంది.

'ఆలోచించగా దానికి ఒకటే మార్గం తోచింది. మిగిలిన జంతువులు వేటికీ తనలాంటి అదృష్టం పట్టకుండా ఉండాలంటే ఈ మహర్షిని హతమార్చడమే పరిష్కారం అనుకుంది. తనను చేరదీసి అన్నివిధాలా కాపాడుతూ వచ్చిన మహర్షిమీద దానికి కాస్తంతైనా విశ్వాసం లేకుండాపోయింది. పైగా విశ్వాస ఘాతుకానికి ఒడిగట్టింది.

'తనే అందరికన్నా అధికురాలిగా ఉండాలన్న స్వార్థం, తనకు కలిగినంత ఉన్నతస్థితి మరెవరికీ లభించకూడదన్న ఓర్వలేనితనం కుక్కను నిలువెల్లా ఆవహించి అసలు మహర్షినే అంతం చెయ్యాలన్న హీనమైన ఆలోచనకు వచ్చింది. త్రికాలజ్ఞాని అయిన మహర్షికి కుక్క మనసులోని చెడు ఆలోచన తెలిసిపోయింది. మరుక్షణంలో దానిని మునుపటి శునక రూపానికి మార్చేశాడు. దీన్నిబట్టి 'అల్పబుద్ధి గలవాళ్లకు అధికార మిస్తే దొడ్డవారినెల్ల తొలగగొట్టు' అని అర్థమవుతుంది. కనుక సహాయకులుగా ఉన్నవారి స్వభావాలను అధికారులు ఎప్పటికప్పుడు బేరీజు వేసుకుంటూ అప్రమత్తంగా ఉండాలి' అని కథ ముగించాడు భీష్ముడు ●

# 11. శీలం సకల శ్రేయోమూలం

'ఎవరికీ ద్రోహం చెయ్యకుండా ఉండడం, భూతదయ కలిగి ఉండడం, దానం చేస్తుండడం – ఈ మూడింటినీ కలిపి 'శీలం' అంటారు. శీలవంతులు ఇతరులకు మేలు కలిగించని పనులు చేయరు. సిగ్గుపడవలసిన పనుల జోలికి పోనేపోరు. ఏ పని ఎలా చేస్తే పదిమందీ మెచ్చుకుంటారో అలాగే చేస్తారు' అని ధృతరాష్ట్రుడు దుర్యోధనుడికి చెప్పాడు.

ధర్మరాజు ఇంద్రప్రస్థంలో రాజసూయ యాగం చేసినప్పుడు ఆయన సభావైభవం చూసి అసూయతో తండ్రిదగ్గరకు వెళ్లి విచారించాడు దుర్యోధనుడు.

'శ్రీమంతులంటే శీలవంతులని కాదు అర్థం. శీలవంతులంటేనే శ్రీమంతులు. నీకు మాత్రం తక్కువ ఐశ్వర్యముందా? ధర్మరాజు నీకంటే ఎక్కువగా ప్రకాశించడానికి కారణం అతను శీలవంతుడవడమే! శీలవంతులను సిరి వరిస్తుంది. నువ్వు కూడా శీలవంతుడవై సంపదలు పొందు' అని కొడుక్కి ఒక ఇతిహాసం చప్పాడు.

ఆ ఇతిహాసం గురించి భీష్ముడు పాండుకుమారులకు వివరిస్తూ శీలం సకల శ్రేయోమూలం అని పేర్కొన్నాడు.

**శ్రీమంతులంటే శీలవంతులని కాదు అర్థం! శీలవంతులంటేనే శ్రీమంతులు అని భావం!**

*ప్రహ్లాదుడు రాక్షసకుల తిలకుడు. అతను తన శీలవైభవంతో ముల్లోకాలనూ జయించాడు.*

*రాజ్యం పోయేసరికి ఇంద్రుడికి విచారం ఎక్కువైంది. తనకు త్రిలోకాధిపత్యం మళ్లీ వచ్చే విధానం చెప్పమని బృహస్పతిని అడిగాడు. 'ఆ*

సంగతి నీకు భార్గవుడు చెబుతాడు వెళ్లు' అన్నాడు బృహస్పతి.

ఇంద్రుడ వెళ్లి భార్గవుణ్ణి ఆశ్రయించాడు.

'ముల్లోకాలనూ జయించే శక్తి ప్రహ్లాదుడికి ఎలా వచ్చిందో ఉపాయంగా అతన్నే అడిగి తెలివిగా దాన్ని చేజిక్కించుకో' అని సలహా ఇచ్చాడు భార్గవుడు.

'అంత శక్తి ప్రహ్లాదుడికి ఎలా వచ్చిందో ఉపాయంగా అతన్నే అడిగి తెలివిగా దాన్ని చేజిక్కించుకో' అని సలహా ఇచ్చాడు భార్గవుడు.

ఇంద్రుడు మారువేషంలో వెళ్లి ప్రహ్లాదుడికి శిష్యుడై భక్తితో సేవలు చెయ్యడం మొదలుపెట్టాడు. చాలాకాలం గడిచింది.

ప్రహ్లాదుడు ప్రసన్నుడయాడు.

'నాయనా! ఏమి కోరి నన్ను సేవిస్తున్నావు?' అని అడిగాడు.

'అయ్యా! మీకు త్రిలోకాధిపత్యం ఎలా వచ్చిందో తెలుసుకోవాలని ఉంది'

'ఏముంది? నే నెప్పుడూ రాజుననే గర్వంతో మెలగను. ఎవరినీ నొప్పించను. ఈర్ష్య, అసూయ మొదలైన దుర్గుణాలను మనస్సులోకి రానివ్వను. అడిగినవాళ్లకు లేదనకుండా ఉన్నంతలో ఎంతో కొంత దానం చేస్తాను. కామానికి లోను కాకుండా కలిగిన సౌఖ్యాలు అనుభవిస్తాను. మంచిశీలం, చక్కని నడవడి కలిగి ఉంటేనే ఎవరైనా ఉన్నతస్థితికి వెళతారు' అన్నాడు ప్రహ్లాదుడు.

'మహాత్మా! నిన్నాశ్రయించి బతుకుతున్నవాణ్ణి. నాయందు దయతలచి నీ శీలం నా కివ్వు' అని అర్థించాడు.

ప్రహ్లాదుడు ముందు వెనుకలు ఆలోచించకుండా 'సరే' అన్నాడు. వెంటనే ఆయన శరీరంలోంచి మహాతేజస్వి అయిన ఒక పురుషుడు బయటకు వచ్చాడు.

'నువ్వెవరు?' ప్రహ్లాదుడు అతన్ని ఆశ్చర్యంగా చూస్తూ ప్రశ్నించాడు.

'నేను నీ శీలాన్ని. నువ్వు నన్ను నీ శిష్యుడికి దానం చేశావుగా. అతని దగ్గరకు వెళ్లిపోతున్నాను' అని చెప్పి వెళ్ళిపోయాడా పురుషుడు.

తరువాత ఒక్కొక్క తేజోమయ స్వరూపం అతని శరీరంలోంచి బయటకు వచ్చాయి. అలా వచ్చిన వాటినన్నింటినీ ప్రహ్లాదుడు ప్రశ్నించాడు.

'నువ్వెవరు?'

'నేను ధర్మాన్ని. శీలాన్ని ఆశ్రయించి ఉంటాను. నేను వెళ్తున్నాను.'

'నువ్వెవరు?'

'నేను సత్యాన్ని, ధర్మం ఉన్నచోటికి వెళ్తున్నాను' అని చెప్పింది. అది మాయమయ్యాక మరో ఆకృతి వెలువడింది.

'నువ్వెవరు?'

'నేను సత్ప్రవర్తనను. సత్యాన్ని ఆశ్రయించి ఉంటాను. నేనూ వెళ్తున్నాను.'

'నువ్వెవరు?'

'నేను బలాన్ని. సత్ప్రవర్తనకు తోడు ఉంటాను. నేనూ పోతున్నాను.'

ప్రహ్లాదుడి విషాదానికి మేరలేదు. అన్ని తేజోమయ గుణాలు అతనిలోంచి వెళ్లిపోయాయి. అతను విచారంగా ఆలోచిస్తుంటే అతిలోక సౌందర్యవతి అయిన ఒక స్త్రీ అతని శరీరంలోంచి బయటకు వచ్చింది.

'అమ్మా! నువ్వెవరు?' దీనంగా అడిగాడు ప్రహ్లాదుడు.

'నేను లక్ష్మిని. బలం ఎక్కడ ఉంటే అక్కడే ఉంటాను. వెళ్తున్నాను.'

**అంత వినయంగా ఇన్నాళ్లూ నన్ను సేవించి నా శక్తినంతా కొల్లగొట్టిన ఆ శిష్యుడెవరు? అతని అసలు స్వరూపం ఏమిటి?**

'అయ్యో తల్లీ! నువ్వూ నన్ను విడిచిపోతున్నావా? ఇంతకూ అంత వినయంగా ఇన్నాళ్లూ నన్ను సేవించి నా శక్తినంతా కొల్లగొట్టిన ఆ శిష్యుడెవరు? అతని అసలు స్వరూపం ఏమిటి?'

'అతను ఇంద్రుడు. నీ రాజ్యవైభవం తీసుకోవడం కోసం వచ్చాడు. నువ్వు నీ

*శీలాన్ని అమాయకంగా అతనికి ధారపోశావు. శీలంవల్ల ధర్మం, ధర్మంవల్ల సత్యం, సత్యంవల్ల నడవడి, దానివల్ల బలం, బలంవల్ల నేను ఉంటాం. అన్నిటికీ శీలమే ముఖ్యమని నీ అంతటివాడికి తెలియకపోవడం నిజంగా దురదృష్టం. నువ్వు శీలాన్ని పోగొట్టుకున్నావు. ఇంక నేను నీ దగ్గర ఉండను' అని చెప్పి లక్ష్మి వెళ్ళిపోయింది.*



కనుక, 'నాయనా! రాజ్యం సుఖంగా ఉండాలంటే పాలకులూ, ప్రజలూ అందరూ శీలవంతులై ఉండాలి. శీలవంతులకు అసాధ్యమైనదంటూ ఏదీ ఉండదు. గుర్తుంచుకోండి. ఇంద్రియాలకు లొంగిపోయినవాడు చతురంగ బలాలున్నా నశిస్తాడు. అన్ని తపస్సుల్లోకీ శ్రేష్ఠమైనది ఇంద్రియ నిగ్రహం' అని చెప్పాడు భీష్ముడు.

వృత్తం యత్నేన సంరక్షేత్
విత్తమాయాతి యతిచం
అక్షణో విత్తతః క్షీణః
వృత్తతశ్చ హతో హతః

ఎవరికి వారు తమ శీలాన్ని ప్రయత్నపూర్వకంగా రక్షించుకోవాలి.

డబ్బు సిర్థమైనది కాదు; చంచలమైనది. వస్తూవుంటుంది పోతూ వుంటుంది.

శీలవంతులకు డబ్బు రావటమూ, పోవటమూ అన్నీ ఒక్కటే. ఏదీ వారిని అంటదు. ఏదీ వారిని బాధించదు.

శీలం పోయిందో – ఎందకూ కొరగాము. శీలం లేనివారు గుడ్డిగవ్వతో సమానం. గడ్డిపోచకన్నా హీనం.

శీలం లేనివారిని ఎవరూ లక్ష్యపెట్టరు. వాళ్ళ గతి అధోగతే! అంతకంటే హీన మేముంటుంది ఎవరికైనా!? ●

# 12. అసలైన చదువు

'విద్యకు అసలైన అర్థం ఏమిటి? మొత్తంమీద విద్య ఎన్ని రకాలు? అవి ఏవేవి?' అని అడిగాడు ధర్మరాజు భీష్ముణ్ణి.

'హృదయ వికాసం కలిగించేది, ద్వంద్వాలు, మానసిక వికారాలు తొలగించి, వివేకాన్ని ఇచ్చేది అసలైన విద్య. విద్యలన్నీ కలిపి పద్ధెమినిది అని చెబుతారు. నాలుగు వేదాలూ, కల్పం మొదలైన ఆరు అంగాలూ కలిసి పది విద్యలయ్యాయి. వైద్యం, గాంధర్వం (సంగీత, నాట్యాలు), అర్థశాస్త్రం, నీతివిద్య – ఈ నాలుగింటితో కలిసి మొత్తం పద్ధెనిమిది విద్యలు. ఇంకా స్థూలంగా చెప్పాలంటే విద్యలు రెండే రెండు రకాలు. ఒకటి పరావిద్య, రెండవది అపరావిద్య. పరావిద్యవలన జన్మ రాహిత్యం కలుగుతుంది. ఈ పరావిద్యనే ఆధ్యాత్మిక విద్య అని కూడా అంటారు. 'సర్వేషాం విద్యానాం హృదయమేకాయనం'. సకల విద్యలకు మనస్సే స్థావరం. కనుక అంతరంగాన్ని శుద్ధిచేసి అందులోని ఆత్మను కళ్ళెదుట నిలిపేదే అసలైన చదువు. అపరావిద్య అంటే లౌకికవిద్య – ఉదరపోషణార్థం నేర్చేది. దేనివల్లనైతే డబ్బు, అధికారం, సుఖాలు, విలాసాలూ సమకూరుతాయో అది అపరావిద్య. అపరావిద్య బతుకుతెరువు కోసమేకాని, బతుకును పండించుకోటానికి కాదు. చదువు వేరు, సంస్కారం వేరు. చదువుకున్నవారంతా సంస్కారవంతులై ఉండరు. అలాగే సంస్కారవంతులందరూ

> సకల విద్యలకు మనస్సే స్థావరం. అంతరంగాన్ని శుద్ధిచేసి ఆత్మను కళ్లెదుట నిలిపేదే అసలైన చదువు.

చదువు నేర్చికూడా ఉండకపోవచ్చు. కాని చదువు, సంస్కారం రెండూ ఒకే మనిషిలో ఉంటే ఇంక చెప్పేదేముంది? బంగారానికి తావి అబ్బినట్టే! పరావిద్యవల్ల సత్సంస్కారం కూడా కలుగుతుందంటారు. 'యశః శరీరం న వినశ్యతి'. వినయసంపన్నమైన విద్య అలంకారాలకే అలంకారం. అటువంటి విద్య నేర్చిన వారి భౌతిక శరీరం నశించినప్పటికీ, వాళ్ళ యశస్సు మాత్రం అజరామరం. ఇంతెందుకు ఒక్కమాట చెప్పనా?! ఏ చదువు చదివినా, ఏ విద్యలు నేర్చినా అది మనలో ఆత్మస్థైర్యాన్ని, ఆత్మ విశ్వాసాన్ని, నైతిక విలువలను, ఉన్నత వ్యక్తిత్వాన్ని పెంపొందించేదిగా ఉండాలి. అది మన బుద్ధిబలాన్ని, ఆత్మబలాన్ని పెంచాలి' అని చెప్పాడు భీష్ముడు.

చదువుల పరమార్థం బోధపడింది ధర్మరాజుకు. కృతజ్ఞతగా చేతులు జోడించాడు. ఇది భారతం!

మరి నేటి చదువుల భారతమో?! తలుచుకుంటే విషాదం.

దివా పశ్యతి నోలూకః కాకో నక్తం న పశ్యతి ।
విద్యావిహీనో మూఢస్తు దివా నక్తం న పశ్యతి ॥

గుడ్లగూబ పగలు చూడలేదు; కాకి రాత్రివేళల్లో చూడలేదు; చదువు లేనివాడు రేయింబవళ్ళూ చూడలేడు. కాని, ఇప్పుడు చదువుకున్నవాళ్ళు, చదువుకోనివాళ్ళు అందరిదీ ఒకటే స్థితి. పగలైనా రేయయినా ఒకటే! ఎప్పుడూ ఎవరికీ ఏమీ కనిపించవు. ఎవరూ జీవితంలోకి పూర్తిగా తొంగిచూడరు. చూడాలంటే భయం. భీష్ముడు చెప్పిన ఆత్మబలాన్ని, ఆత్మస్థైర్యాన్ని ఇప్పటి చదువులు ఇవ్వలేకపోతున్నాయి. ఇప్పుడసలు పరావిద్య లేదు. ఉన్నదంతా అపరావిద్యే. ఎడ్‌సెట్‌లోనో, ఈసెట్‌లోనో,

> **గుడ్లగూబ పగలు చూడలేదు; కాకి రాత్రివేళల్లో చూడలేదు; చదువు లేనివాడు రేయింబవళ్ళూ చూడలేడు.**

ఎంసెట్‌లోనో ఏదో ఒక విధంగా మన పిల్లలు అందరికంటె ముందుండాలి. చకచక డాక్టర్లు ఇంజనీర్లు అయిపోయి లక్షలులక్షలు సంపాదించాలి. కోట్లకు పడగ లెత్తాలి, ఇందుకోసం మూడో ఏటినుంచే కాన్వెంటు చదువులు, బ్రిడ్జి కోర్సులు, ఇంటెన్సివ్ కోచింగ్‌లు, ఇన్‌స్టెంట్ పరీక్షలు.

**'రాజవత్పంచ వర్షాణి' ఐదేళ్ళ వయసొచ్చేవరకూ పిల్లల్ని ప్రభువుల్లా చూడాలిట.**

'రాజవత్పంచ వర్షాణి' అని పెద్దవాళ్లు గతంలో చెప్పినదానికి ఇప్పుడు విలువే లేదు. ఐదేళ్ళ వయసొచ్చేవరకూ పిల్లల్ని ప్రభువుల్లా చూడాలిట. వాళ్ళు అడిగినవన్నీ ఇస్తూ, వాళ్ళ కోరికలు తీరుస్తూ, వాళ్ళడిగే ధర్మ సందేహా లన్నిటికీ సమాధానాలు చెబుతూ వాళ్ళని సంతోష పెట్టాలిట. ఇది శాస్త్రం. అందుకనే పూర్వం అయిదో ఏడు వస్తేకాని అక్షరాలు దిద్దబెట్టేవారు కాదు. ఆ తరువాత అక్షరాలతో పాటు కొన్నాళ్లు ఆటపాటలతో కూడిన మౌఖిక విద్య, అటుపిమ్మట ద్విత్వాక్షరాలు, సంయుక్తాక్షరాలు, తేలికపాటి గణితం – అలా చదువులో ఒక్కో మెట్టూ పైకి ఎక్కిస్తూ పిల్లల్లో క్రమ పరిణామ వికాసం కలిగించేవారు. ఇప్పుడదేం లేదు. యల్‌కెజిలోనే ఎన్విరాన్‌మెంటల్ సైన్సు గురించి చెబుతారు. యుకెజిలో బోటనీ, బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, అర్థమెటిక్ బోధిస్తారు, కంప్యూటర్ సరేసరి కంపల్సరీ. ఈడుకు మించిన చదువులతో మోత బరువులతో పిల్లలంతా పిచ్చివాళ్లవుతున్నారు. తల్లిదండ్రులూ, ఉపాధ్యాయులూ నిర్దేశిస్తున్న లక్ష్యాలను చేరుకోలేక, ఒత్తిళ్లకు తట్టుకోలేక పచ్చిగుండెలు విచ్చిపోతున్నాయి.

అయినా, మన చదువులు డాక్టర్లను, ఇంజనీర్లను, అధికారులను తయారుచేస్తున్నాయికాని – శీలవంతుల్ని, గుణవంతుల్ని, మహనీయుల్ని తయారు చేయలేకపోతున్నాయి. పిల్లల్లో త్యాగం, సేవ వంటి విలువల్ని

ప్రోది చెయ్యలేకపోతున్నాయి. Value - based or value - oriented education కాకుండా పోయింది మన చదువు. We should aim at character - building and inculcating moral values among our children from the primary level itself.

స్వామి వివేకానంద వందేళ్ల క్రితమే చెప్పారు :

"Mere book-learning won't do. We want that education by which character is formed, strength of mind is increased, intellect is expanded and by which one can stand on one's own feet. What we want is western science coupled with Vedanta, Brahmacharya as the guiding motto and also Shraddha or Faith in one's own self". హైదరాబాదులోని వివేకానంద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ ఎక్సెలెన్స్ అధిపతి, దాని పర్యవేక్షకులు అయిన స్వామి అనన్యానందను కలుసుకోవడం జరిగిం దోసారి. అంతకుమునుపే ట్రాన్స్‌ఫార్మల్ ఎడ్యుకేషన్ ఫర్ హ్యూమన్ ఎక్సెలెన్స్ మీద ఆయన రాసిన పుస్తకం చదివాను "The education we receive at present is only informative and not formative. The nation needs trained minds and not stuffed trains" అని రాశా రందులో. ఇప్పుడు నిజంగానే భయమేస్తోంది. ఇప్పటి పిల్లలందరూ ఎంసెట్లు, ఈసెట్లు, ఒరాకిల్, జావాల మిడిమిడి జ్ఞానంతో స్టఫ్డ్ ట్రెయిన్లయిపోతున్నా రేమోనని. 'చదువులలో సారమెల్ల చదివితి తండ్రీ' అన్నాడు ప్రహ్లాదుడు. అతను లలిత మర్యాదుడు. ఆ లలిత మర్యాదే ఎండ్ అండ్ ఎయిమ్ ఆఫ్ ఎడ్యుకేషన్ కావాలి.

**మన చదువులు శీలవంతుల్ని, గుణవంతుల్ని, మహనీయుల్ని తయారు చేయలేకపోతున్నాయి.**



వివేకానందుడు చెప్పాడు : "The end of all education, all training should be man-making. The end and aim of all training is to make the man grow. The training by which the current and expression of will are brought under control and become fruitful is called education".

భీష్ముడు చెప్పాడు : మనిషిలో సౌజన్యాన్ని పెంచేది, సుగుణాలను ప్రోగుచేసేది, అసమాన నీతివర్తనాన్ని, వినయవిధేయతలనూ నేర్పేది చదువు. అధోచేతనలోంచి సహజచేతనలోకి, సహజచేతననుంచి ఊర్ధ్వచేతనలోకి మనిషిని నడిపించేది, మనుషుల్ని ఋషులుగా, ఋషుల్ని దేవతలుగా మలిచేది చదువు.

నిజమే!

లేకపోతే మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ మహాత్మాగాంధి ఎలా అవుతాడు?

జీసస్ క్రీస్తుదేవుడెలా అవుతాడు?!

నరేంద్రుడు స్వామి వివేకానందుడు ఎలా అవుతాడు?! ●

# 13. హ్యూమన్ క్యాపిటల్

'**ఒ**కరి సహాయం నాకు అక్కర్లేదనుకునేవాడు, అలసత్వం ప్రదర్శించేవాడు, కార్యజ్ఞానం తెలిసినవాళ్లను లెక్కలోకి తీసుకోనివాడు, కార్యవిచారం చెయ్యడంలో తొందరపడేవాడు ఎన్నటికీ సుఖపడడు. ఎప్పుడూ నష్టపోతూనే ఉంటాడు' అని భీష్ముడు చెప్పాడు. అందుకు దృష్టాంతంగా రెండు కథలు కూడా చెప్పాడు.


*పూర్వం ఒక ఒంటె బ్రహ్మదేవుణ్ణి గురించి చాలాకాలం తపస్సు చేసింది. బ్రహ్మ ప్రత్యక్షమయ్యాడు.*

*'దేవా! నా మెడ నూరు యోజనాలు పెరిగేటట్టు అనుగ్రహించు' అని వరం కోరుకుంది. వరం అనుగ్రహించి వెళ్లిపోయాడాయన. ఆ వరగర్వంతో ఒంటె మిడిసిపడుతూ ఎవరి సహాయం కోరక, ఎవరితోనూ కలియక ఒంటరిగా, బద్ధకంగా ఉంటూండేది. ఒకనాడు ఒకచోట పడుకుని తన పొడుగాటి మెడ చాచి అడవిలో మేస్తోంది. అప్పుడు పెద్దవాన వచ్చింది. ఆ ఒంటె వెంటనే తన మెడను ఒక గుహలో దూర్చి హాయిగా నిద్రపోయింది. ఇంతలో ఒక నక్క తన భార్యను వెంటబెట్టుకుని ఆ గుహ దగ్గరకు వచ్చింది. వాటికి ఆకలి బాగా మండిపోతోందేమో గుహలో ఉన్న ఒంటె మెడ అమృతంలా కనిపించింది. కొరుక్కుతినడం ప్రారంభించాయి. ఒంటెకు నొప్పితోచి మెడ కదిలించేసరికి నక్కలు రెండూ దాని మెడ నరాలు బలంగా కొరికాయి. పాపం, ఒంటె ఇంక మెడను వెనక్కు తీసుకోలేక పోయింది. చచ్చి నక్కలకు ఆహారమైంది.*

> **వరగర్వంతో ఒంటె మిడిసిపడుతూ, ఎవరి సహాయం కోరక, ఎవరితోనూ కలియక ఒంటరిగా, బద్ధకంగా ఉంటూండేది.**

తెలిసిందా?! ఎన్ని వనరులు ఉన్నా, ఎన్ని వరాలు పొందినా అలసత్వం ఉంటే అవన్నీ నిష్ప్రయోజన మవుతాయి. 'అలసేన లబ్ధమపి రక్షితుం న శక్యతే!' సోమరి దొరికినదాన్ని కూడా రక్షించుకోలేడు. కనుక అప్రమత్తంగా ఉండడం కార్యశూరుల లక్షణం. జాగరూకులై వున్నవారికి వెళ్లినదారి పూలబాట అవుతుంది. పట్టిందల్లా బంగారం, ముట్టిందల్లా ముత్యం అవుతుంది.

ఏ విషయంలోనూ ఒకరి సహాయం నాకు అక్కర్లేదు అనుకునేవాడు మూఢుడు. ఎవరి సహాయమూ అక్కర్లే దనుకునేవాడు, సహాయులు లేనివాడు




ఏ విషయంలోనూ ఖచ్చితమైన నిర్ణయం తీసుకోలేడు. ఏదైనా ఒక ఆలోచన చేసేటప్పుడు ఒకరు చెప్పింది నేను వినడమా అన్న అహంకారం కూడా పనికిరాదు.

సముద్రానికి ఏం తక్కువ చెప్పండి?!

నీరా – సమృద్ధిగా ఉంది. పైగా నదులన్నీ వెళ్లి సముద్రంలోనే సంగమిస్తాయి. దానికితోడు దాని కడుపునిండా రత్నాలే. అయినా, అది ప్రతిక్షణం చంద్రుడికోసం ఎదురుచూస్తూనే ఉంటుంది. కనుక మనకెంత ఐశ్వర్యం ఉన్నా, తెలివైన వాళ్లని, బుద్ధిమంతుల్ని, సమర్థుల్ని దగ్గరకు చేర్చుకోవడంవల్ల మనకు మరింత బలం చేకూరుతుంది. బలం కలవాడు అంతకుముందు తన దగ్గరే లేనిదానిని, తనకు లభించనిదానిని పొందేందుకు ప్రయత్నిస్తాడు.

ఈమధ్యనే చదివాను – ఏరోజు కారోజు విస్తృతమవుతున్న కార్పొరేట్ రంగంలో పీపుల్ ఫాక్టర్ ఇప్పుడు ఎక్కువగా రాజ్యమేలుతోంది. ఒకప్పుడు మీ కంపెనీకి చెందిన మోస్ట్ వాల్యుబుల్ అసెట్స్ ఏమిటంటే బ్రాండ్, గుడ్‌విల్, ప్లాంట్ అండ్ మిషినరీ....ఇలా ఏవేవో చెప్పేవారు. కాని, అదే ప్రశ్నను ఇప్పటి కంపెనీల అధిపతుల్ని అడగండి – టక్కున పీపుల్ అని సమాధాన మిస్తారు. అంటే విషయ పరిజ్ఞానం ఉన్నవాళ్లను తమ టీమ్‌లో చేర్చుకుంటేకానీ సత్ఫలితాలు సాధించలేమన్న స్పృహ, జ్ఞానం ఈ తరం సంస్థల యజమానులకు కలిగా యన్నమాట. మిచిగన్ బిజినెస్ స్కూలుకు చెందిన ప్రొఫెసర్ వేన్ బ్రూక్‌బాంక్ మేనేజ్‌మెంట్‌మీద బిజినెస్ లైన్ ప్రచురించే ప్రాక్సిస్ అనే జర్నల్ ఇంటర్వ్యూ ఇస్తూ, "The human side of business is critical for success. The astute and successful companies recognise this and hence view people as an investment and not as a cost" అని పేర్కొన్నాడు. అంటే ఇంటలెక్చువల్ కాపిటలే అన్నిటికన్నా ముఖ్యం అని తేల్చారాయన.

> **మనకెంత ఐశ్వర్యం ఉన్నా, తెలివైన వాళ్లని, సమర్థుల్ని దగ్గరకు చేర్చుకోవడంవల్ల మనకు మరింత బలం చేకూరుతుంది.**

అంతేకాదు; Your success solely depends on how you get the people, how you retain them and how you use them and provide them opportunities for growth అని స్పష్టంగా చెప్పారు.

**మేథోతిథికి భార్యమీద కోపం వచ్చి ఆమెను చంపెయ్యమని చిరకారికి ఆజ్ఞాపించి విసవిస వెళ్లిపోయాడు.**

సరే, అదలా ఉంచండి. కార్య విచారం గురించి చెబుతూ తొందర ఎప్పుడూ పనికిరాదని చెప్పాడు భీష్ముడు.

మేథోతిథి అనే మునికి చిరకారి అనే కొడుకు ఉండేవాడు. అతను ప్రతిపనీ బాగా ఆలోచించి చేసేవాడు. అందుకే అతనికాపేరు వచ్చింది. ఒకనాడు మేథోతిథికి భార్యమీద కోపం వచ్చి ఆమెను చంపెయ్యమని చిరకారికి ఆజ్ఞాపించి విసవిస వెళ్లిపోయాడు.

*'నవమాసాలూ మోసిన కన్నతల్లికంటే ఎక్కువ ఏదీ లేదు. తల్లి దైవమంటారు. 'గురూణాం మాతా గరీయసీ'... పూజ్యులలో తల్లి గొప్పదంటారు. అన్ని అవస్థలలోనూ తల్లిని పోషించాలని శాస్త్రం చెబుతోంది. ఇప్పుడు మరి తల్లిని చంపడమా? తండ్రి ఆజ్ఞ మీరడమా?? ఏంచెయ్యను నేను?' అని అనుకుంటూ చిరకారి ఆలోచిస్తుండగానే చాలాసేపు గడిచిపోయింది. తాను ఏదో కోపంలో అన్నమాట పట్టుకుని కొడుకు తల్లిని చంపేశాడేమోనని విచారపడుతూ, తన కొడుకు అలా చెయ్యడని మధ్యమధ్యలో ధైర్యం తెచ్చుకుంటూ వడివడిగా ఆశ్రమానికి వచ్చాడు మేథోతిథి. చేతిలో ఉన్న కత్తి కిందపడేసి చిరకారి తండ్రి కాళ్లమీద పడ్డాడు. మేథోతిథి భార్య కూడా వచ్చి భర్తకు నమస్కరించింది. ఆయన కన్నీళ్లతో వాళ్లిద్దర్నీ గుండెకు హత్తుకున్నాడు. కొడుకును మెచ్చుకుని దీవించాడు.*

కనుక, ధర్మరాజా! కార్య విచారం చాలా జాగ్రత్తగా చెయ్యాలి. తొందరపడి ఏ పని చేసినా చివరకు పశ్చాత్తాప పడవలసి వస్తుంది' అని హితవు చెప్పాడు భీష్ముడు.

ఏ పని ఎలా చెయ్యాలో ముందు నిర్ణయించుకుని తరువాత ఆ పనిని ప్రారంభించాలి. అలాగే చేపట్టిన పని సక్రమంగా పూర్తయ్యేవరకు మధ్యమధ్య సమీక్ష జరుపుకుంటూ దోషాలను సవరించుకుంటూపోవాలి. ఏ దశలోనైనా, ఎవరివల్లనైనా కలిగే కార్యవిఘాతాలను నేర్పుతో తప్పించుకోవాలి. దేనికీ తొందరపాటు తగదు. ఉపాయశాలికి అసాధ్యమైనదంటూ ఏదీ ఉండదు.

బుద్ధిశాలులు కష్టమైన పనిని కూడా సులువుగా చేస్తారు.

పెద్దపెద్ద సంస్థల్లోని హ్యూమన్ రిసోర్స్ ప్రొఫెషనల్స్‌కు ఉండాల్సిన ప్రాథమిక లక్షణా లివి. ప్రపంచీకరణ నేపథ్యంలో సంస్థల పరిధి పెరిగి అంతర్జాతీయమవుతున్నప్పుడు, పోటీ విస్తృతమవుతున్నప్పుడు మానవ వనరుల నిపుణులందరూ ఎప్పటికప్పుడు కొత్తకొత్త వ్యూహాల్ని రూపొందించవలసి ఉంటుంది. ఇందుకోసం తరచూ చర్చలు, సమీక్షలు, సింహావలోకనాలు అవసర మవుతాయి. నాలెడ్జ్ ఆఫ్ ఎక్స్‌టర్నల్ ఎన్విరాన్‌మెంట్ అంటే – కాంపిటీటర్స్, కస్టమర్స్, ఫినాన్షియల్ మార్కెట్, గ్లోబలైజేషన్ ఇలా అనేక వ్యూహాలను మార్చుకుంటూ రేపటికోసం మార్గాన్ని సుగమం చేసుకునేవారే అసలైన హై పెర్‌ఫామింగ్ హ్యూమన్ రిసోర్సెస్ ప్రొఫెషనల్స్ ●

# 14. కాలమే అన్నిటికీ కారణం

ప్రయత్నం చేస్తే సంపదలు వస్తాయనీ, చెయ్యనందువల్ల రావనీ అనుకోవడం తెలివి తక్కువ. కాలాన్ని అనుసరించి జరుగుతాయి అన్నీ.

ఒక్కోసారి ఏ ప్రయత్నమూ చేయకపోయినా వస్తాయి సంపదలు. అలాగే, పోవల్సిన సమయం వస్తే ఎన్ని ప్రయత్నాలు చేసినా దక్కవు. శత్రువులు చెరుపు చెయ్యడం, మిత్రులు బతికించడం, ఆపదలూ – సంపదలూ రావడం అన్నీ ఆయా కాలాల్లో విధివశంవల్ల జరిగిపోతాయి. మన మేదో చేస్తున్నామనుకోవడం వెర్రితనం. మనమే అన్నిటికీ కర్తలమైతే మనం చేసే అన్ని పనులూ ఫలప్రద మయ్యేటట్టు, సకల కర్మలూ ఫలించేటట్టు ఎందుకు చేసుకోలేకపోతున్నాం?

అందుచేత దేనికీ మనం కర్తలం కాదు. అయితే, ఒక్క సంగతి! విధివల్ల జరిగే పనులు తానే చేస్తున్నాననే భ్రాంతిలో మనిషి ఎప్పుడైతే పడతాడో, అప్పుడు ఆ కర్మలు అతనికి శుభాశుభ ఫలితాల నిస్తాయి. ఆ భ్రాంతి నశించి జ్ఞానం పొందాడంటే ఆ కర్మవల్ల అతనికి మేలూ రాదు; కీడూ రాదు. జరుగుతున్న కర్మ లన్నిటినీ సంతోషంతో సాక్షీభూతుడై చూడగలగాలి మనిషి. అప్పుడు ఆ కర్మలవల్ల కలిగే సుఖదుఃఖాలు అతన్ని ఏమీ చెయ్యవు. సకలభూతాలూ అశాశ్వతమని తెలుసుకుని అన్నిబంధాలూ తెంచేసుకోవాలి. అప్పు డింక ఆనందమే ఆనందం.

*మహాసంపదతో వెలుగుతూండే బలి చక్రవర్తి విధివశంవల్ల ఒకసారి గాడిద అయ్యాడు. ఆ సంగతి బ్రహ్మవల్ల తెలుసుకున్నాడు ఇంద్రుడు. ఖర రూపంలో ఉన్న బలిని చంపనని బ్రహ్మకు మాట ఇచ్చి, ఆ గార్దభం ఆచూకీ తెలుసుకుని వెళ్లాడు. 'అయ్యో పాపం! ఎన్నో ఏనుగులు చుట్టిరాగా భద్రగజంమీద ఊరేగేవాడివి. అప్పుడు మమ్మల్ని కాసుకుకూడా లక్ష్య పెట్టేవాడవు కావు. ఇప్పుడిలా గాడిద వయ్యావా? బంగారు యూపస్తంభం*

*నాటించి యజ్ఞం చేసేవాడివి. ఇప్పుడీ ఖర్మ పట్టిందా? నిన్ను చూస్తుంటే బాధగా ఉంది నాకు' అన్నాడు.*

*బలి నవ్వాడు.*

*'నువ్విప్పుడు అధికుడవు. అల్పులదగ్గర బీరాలు పలకడం తగదు. ప్రాణులన్నీ కాలాన్ననుసరించి సుఖదుఃఖాలు పొందుతూంటాయి. ఆ సంగతి తెలుసుకో. గర్వపడకు' అన్నాడు ఇంద్రుడితో. ఇంతలో బలి శరీరాన్నుండి ఒక చక్కని స్త్రీ బయటకు వచ్చింది. ఇంద్రుడు ఆశ్చర్యపోతూ, 'ఎవరీమె?!!!' అని అడిగాడు. 'ఆమెనే అడుగు' అన్నాడు బలి. ఇంద్రుడు అడిగాడు.*

*'శ్రీ, భూతి (ఐశ్వర్యం), లక్ష్మి అని మూడు పేర్లు నాకు. నువ్వే కాదు, ఏ యుగాల్లోనూ ఎవరూ ఎరుగరు నన్ను' అందామె.*

*'ఇప్పుడు ఇతగాణ్ణి ఎందుకు విడిచిపెట్టేస్తున్నావ్?'*

*'సత్యం, ధర్మం, దానం, దమం, పరాక్రమం, వచన మాధుర్యం ఉన్నచోటే ఉంటాను నేను. ఇన్నాళ్లూ సచ్చరితంగానే ఉన్నాడు. ఈ మధ్యనే ఈర్ష్యాద్వేషాలు, అసూయ పొడచూపాయి ఇతనిలో. అందుకని ఇతన్ని విడిచిపెడుతున్నాను నేను' అంది.*

*అది విని బలి ఏం దిగులు చెందలేదు. అంతా విధివిధానం అనుకుని శాంతి పొందాడు.*

**జరుగుతున్న కర్మలన్నిటినీ సంతోషంతో సాక్షీభూతుడై చూడగలగాలి మనిషి. అప్పుడు సుఖదుఃఖాలు అతన్ని ఏమీ చెయ్యవు.**

కనుక దుర్దశలలో ధైర్యం అవలంబించటమే కర్తవ్యమని, ధైర్యంవల్లే సర్వం సానుకూలమవుతాయని, ప్రాణులకు వచ్చి పడింది సుఖమైనా సరే – దుఃఖమైనా సరే, అనుభవించడంకంటె గతిలేదని భీష్ముడు ధర్మరాజుతో చెప్పాడు.

నిజమే! కాలంవల్లే జనులకు కర్మ పరిపాకం కలుగుతోంది. లేకపోతే ఒకరికి ఒక సమయంలో హీనస్థితి కలుగుతూంటే మరొకరికి అదే విక్రమకాలం ఎలా అవుతోంది? అంతా కాలమహిమ. చెడుకాలం దాపురించేసరికి చేయ గూడని పనులు చేయవలసినవిగా కనిపిస్తాయి. బుద్ధి వక్రమార్గాన పడుతుంది. పక్కవాడి సొమ్ము పరమాన్నంలా, పరదార పంచదారలా అనిపిస్తుంది.

**ఒకరికి ఒక సమయంలో హీనస్థితి కలుగుతూంటే మరొకరికి అదే విక్రమకాలం ఎలా అవుతోంది?**

లేకపోతే శుక్రచార్యుడి నీతిశాస్త్రాన్ని ఔపోసన పట్టిన రావణబ్రహ్మ సీతను అపహరించుకు పోవడమేమిటి? నిండు పేరోలగంలో దుశ్శాసనుడు ద్రౌపదిని వివస్త్రను చేయడమేమిటి? అందుకు దుర్యోధనుడు, కర్ణుడూ మొదలైన వాళ్లంతా పగలబడి నవ్వడమేమిటి? వినాశకాలం వచ్చినవాళ్లకు అన్నీ విపరీత బుద్ధులు పుడతాయి.

అదంతే!

అసలు రహస్య మేమిటంటే, దేవతలు ఎవరి పీచమణచ దలుచుకుంటారో, ఎవర్ని పరాభవించ దలుచుకుంటారో వాళ్ల బుద్ధికాస్తా తొలగిస్తారు. దానితో వాళ్లకు చెడు మంచిలా, అవినీతి నీతిలా కనిపిస్తుంది. ఉన్న తెలివితేటలన్నీ పోయి వాజమ్మల్లా తయారవుతారు.

శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామి ఒకసారి భక్తుల ధర్మ సందేహాలకు సమాధానా లిస్తూ, ఒక్కో పనికోసం ఒక్కో జీవునిలో శక్తిని ఆవహింపచేసి ఆ పని అయిపోయాక ఆ శక్తిని భగవంతుడు మళ్లీ ఆకర్షిస్తాడని చెప్పారు. అందుకు ఉదాహరణగా పరశురాముని వృత్తాంతాన్ని పేర్కొన్నారు. పరశురామునిద్వారా దుష్ట పరిపాలనను నిర్మూలించడం అనే అవసరం తీరిపోయాక అతని కిచ్చిన శక్తిసామర్థ్యాలన్నింటినీ రామచంద్ర

ప్రభువు తీసేసుకున్నాడని చెప్పారు. అందుకేనేమో, ఒక్కోప్పుడు మనం పట్టుకున్నదల్లా బంగారమవుతుంది. మరోప్పుడు ముట్టినదల్లా మట్టి అవుతుంది.




భీష్ముడు ధర్మరాజుతో చెప్పాడు :

పుత్ర దారైః సుఖైశ్చైవ విముక్తస్య ధనేన ॥
మగ్నస్య వ్యసనే కృచ్ఛ్రే
ధృతిః శ్రేయస్కరీ నృప ॥

కట్టుకున్న భార్య, కన్నబిడ్డలూ దూరమైనా, చేతిలో చిల్లిగవ్వ లేకపోయినా, కష్టాలన్నీ ఒకేసారి కూడబలుక్కుని దండెత్తివచ్చినా, ధైర్యం వదలకుండా ఉంటే శ్రేయస్సు దానంతటదే కలుగుతుంది.

ధైర్యం ఎలా తెచ్చుకోవాలో కూడా చెప్పాడు భీష్ముడు. సత్వ తమో రజోగుణాలు మూడింటిలో సత్వ గుణాన్నొక్కదాన్నే అట్టే పెట్టుకుని మిగిలిన రెండింటినీ వదిలేయాలిట. అలా చేస్తే వివేకం, ధైర్యం, సంపద, సుఖం, స్థితప్రజ్ఞత అన్నీ  కలుగుతాయిట.

ఏతావత పితామహుడు చెప్పిందేమిటంటే, 'ఎంతటివారైనా కాలానికీ, ఏటికీ ఎదురీదలేరు. కాలమే అన్నిటికీ కారణం. కాలం కారణంగానే మనుషులు నిన్న ఉన్నట్టు ఈవేళ లేరు. ఈవేళ ఉన్నట్టు రేపు ఉండరు. కాలమే ఎవర్ని ఏ దశకు తీసుకువెళ్లినా, ఎవర్ని ఏ స్థితికి చేర్చినా! కాలగమనం తెలుసుకున్నవాడు శాంతివంతుడై దేనికీ చలించడు ●

# 15. సమయనిర్వహణ

ప్రతి ఒక్కరికీ కాలం విలువ తెలియాలి. పోయిన క్షణం తిరిగిరాదని తెలుసుకోవాలి. ఉన్న కాలాన్ని ఉపయోగించుకుని లాభపడాలి. అందుబాటులో ఉన్న సమయాన్ని చక్కగా వినియోగించుకోవడం చేతనైతే ఎన్ని పనులైనా చక్కబెట్టవచ్చని భారతం చెబుతోంది.

తెలివితక్కువవాళ్లే కాలాన్ని వృథా చేస్తారు. తెలివైనవాళ్లు ఏ పనీ వాయిదా వెయ్యరు. రేపు చేయాల్సిన పనిని ఈ రోజే చేస్తారు.

డబ్బు పోతే తిరిగి సంపాదించుకోగలం. కాని, కాలం అలా కాదు. కాలం కరిగిపోతుంది. ఇట్ కెన్ నెవర్ బి కాంపెన్సే టెడ్. ఫలితంగా ఒక్కోసారి అనూహ్యమైన నష్టాలను చవి చూడవలసివస్తుంది. కనుక, కాలం విలువ తెలిసినవారు ప్రయోజనాత్మకంగా, ప్రణాళికాబద్ధంగా 'టైమ్'ను ఖర్చు చేస్తారు. వాళ్లకు టైమ్ ఈజ్ మనీ. ఎవరన్నారో నాకు గుర్తు లేదు –

Yesterday is a cancelled cheque

Tomorrow is a Promissory Note.

Today is ready cash - use it.

మన దగ్గరున్న రెడీ కాష్ నుంచి మనం అత్యధికలాభాలు పొందాలి.

ఎలా?


టైమ్ మేనేజ్‌మెంట్ తెలియాలి.

ఎప్పటి పనులను అప్పుడే చెయ్యడం, వాయిదా వెయ్యకుండా ఉండడం, నిర్దేశించిన పనులనూ, లక్ష్యాలనూ సావధానంగా సవ్యంగా చేయడం, అందరి మన్ననలూ పొందడం అన్నవి టైమ్ మేనేజ్‌మెంట్‌లో కీలక అంశాలు.

శ్వః కార్య మద్య కుర్వీత

పూర్వాహ్ణే చాప రాహ్ణికమ్ ।

న హి ప్రతీక్షతే మృత్యుః
కృతం చాస్య న చాకృతమ్ ॥




రేపటి పనిని ఈ రోజే చెయ్యాలి. మధ్యాహ్నం చేద్దామనుకునే పనిని తొలిపొద్దునే పూర్తిచేయాలి. మృత్యువుకు ముందువెనుకలుండవు. దయాదాక్షిణ్యాలుండవు. ఈ పని చేశాడే; ఈ పని చెయ్యలేదే అని మృత్యువు మనకోసం ఆగదు. సమయం ముంచుకొస్తే గుటుక్కున మింగేస్తుంది. అది తెలుసుకుని మసలుకోవాలి.

టైమ్ మేనేజ్‌మెంట్‌లో మరో ముఖ్యవిషయం ప్రాపర్ ప్లానింగ్. సరైన కార్యాచరణప్రణాళిక లేకపోతే టైమంతా వృధా అవుతుంది. కాబట్టి వ్యూహం సరిగా ఉండాలి. ఇంగ్లీషులో దీన్ని స్ట్రాటజీ అంటారు. పనులన్నీ చకచకా జరిగిపోవాలంటే వ్యూహం బాగుండాలి. వ్యూహం పటిష్టంగా ఉంటేనే కార్యాలు సిద్ధిస్తాయి. వ్యూహరచన సరిగా చెయ్యలేనివారు సమయాన్నంతా

చెడగొట్టుకుంటారు. స్ట్రాటజీ ఎప్పుడూ ఆచరణయోగ్యంగా ఉండాలి. ఇట్ మస్ట్ బి రియలిస్టిక్. చేయవలసిన పనులను ప్రాధాన్యక్రమంలో ఎంపిక చేసుకోవాలి. ఏవి అత్యవసరమో, అవసరమో, ముఖ్యమో అముఖ్యమో మొదట తేల్చుకుని ఆ తరువాత రంగంలోకి దిగాలి. ఏది చెయ్యాలి, ఏది చెయ్యకూడదు అనే విషయాన్ని జాప్యం లేకుండా నిర్ధారించుకో గలిగినవాళ్లే ప్రాజ్ఞులు. ఇకపోతే, ఏకకాలంలో అనేక పనులు చేయాలనుకోవడం మంచిది కాదు. అలా చేయడంవల్ల ఏ పనికీ న్యాయం జరగదు. ఏ పనీ సమగ్రంగా ఉండదు. పైగా ఒకేసారి అనేక పనులు నెత్తిన పెట్టుకోవడంవల్ల మనకు తెలియకుండానే చాలా సమయం వృధా అవుతుంది.

ఒక్కోప్పుడు మనల్నిగురించి మనం చాలా ఎక్కువగా అంచనా వేసుకుంటాం. ఎదుటివారిని గడ్డిపోచలా తీసేస్తాం. మన కింద పనిచేసే వాళ్లను మనం నమ్మం. వాళ్లను విశ్వాసంలోకి తీసుకోం. వాళ్లకేమీ తెలీదనీ, అన్నీ మనకే తెలుసనీ భ్రమ పడతాం. దానితో వాళ్లకే బాధ్యతలూ అప్పగించం. అన్ని పనులూ మన నెత్తినే వేసుకుంటాం. we do not delegate our powers to our juniors either out of lack of confidence in them or out of too high opinion on ourselves. నిజానికి తెలివైన అధికారులు తమ కింద పనిచేసేవారిలో ఎవరికి ఏ పనిలో నేర్పు ఉందో గ్రహించి వాళ్లచేత ఆ పనులు చేయించుకుంటారు. అలా చేయించుకోలేకపోతే అది వాళ్ళ అసమర్థత. ఇకపోతే, కొందరు చాలా తెలివిగా తమ కిష్టంలేనివీ, తాము చెయ్యదలుచుకోనివీ, తమకసలు బొత్తిగా తెలియనివీ తమ జూనియర్లను చెయ్యమంటుంటారు. అది డెలిగేటింగ్ అనిపించుకోదు. ఇంపోజింగ్ అంటారు దాన్ని. కింది ఉద్యోగులకు అధికారాలు

**కొందరు చాలా తెలివిగా తమ కిష్టంలేనివీ, తమకసలు బొత్తిగా తెలియనివీ తమ జూనియర్లను చెయ్యమంటుంటారు.**

ఇసన్తా, స్వేచ్ఛగా పనిచేసే వీలుకలిగిసన్తా, స్వతంత్రంగా నిర్ణయాలు చేసే స్వయంప్రతిపత్తి కల్పించాలి. అదీ డెలిగేషన్ ఆఫ్ పవర్ అంటే. దీనివల్ల కింది తరగతి ఉద్యోగుల్లో ఆత్మ విశ్వాసం పెరగడమే కాదు, మనకు కావల్సినంత సమయం అందుబాటు లోకి వస్తుంది. దానితో మనం మరి కొన్ని ముఖ్యవిషయాల మీద దృష్టి కేంద్రీకరించేందుకు వెసులుబాటు కలుగుతుంది.

**చేతిలో ఉన్న పనులను పూర్తిచెయ్యకుండా కొత్తవేవో తెచ్చి నెత్తిన పెట్టుకుంటే మొదటికే మోసం వస్తుంది.**

చాణక్యుడు చెప్పాడు. చపలచిత్తుడు ఏ పనీ చెయ్యలేడుట.

స్థిరనిర్ణయాలు చెయ్యకుండా అన్‌డిసైడెడ్‌గా, డోలాయమానంగా ఉండేవాళ్లు సమయం దాటబెడతారట. దానితో కాలవే ఫలాన్ని మింగేస్తుందిట.

కనుక మంచి ఆలోచనలతోపాటు సత్వరనిర్ణయాలు చేస్తేనే కాలమూ కలిసొస్తుంది. కార్యాలూ సిద్ధిస్తాయని తెలుసుకోవాలి.

ఇంకో విషయమేమిటంటే చిన్నచిన్న విషయాల్లో కూడా పర్‌ఫెక్షన్ సాధించేందుకు ప్రయత్నిస్తే బంగారం లాంటి సమయం బోలెడంత వృధా అవుతుంది. దానికితోడు అధికంగా శ్రమ పడాల్సివస్తుంది. అల్పమైన విషయాలకోసం అంతంత సమయమూ, తెలివితేటలూ వెచ్చించే బదులు వాటిని మరింత విలువైన పనులకు వినియోగించడం మంచిదని కాలజ్ఞానులు చెబుతారు.

చివరగా ఓ మాట – ఈ ప్రపంచంలో మనం అందర్నీ సంతృప్తి పరచలేం. అందుకని మన ఎదుట ఎన్ని పనులున్నాయో, వాటిలో ఏవి ముఖ్యమో, ఏవి ముందు చెయ్యాలో నిర్ణయించుకున్నాక ఇంక మొహమాటాలకు తావు ఉండకూడదు. అదే వరుసలో వెళ్లిపోవాలి. మధ్యలో ఎవరేమి చెప్పినా,

నొప్పింపక, తానొవ్వక మర్యాదగానూ, దృఢంగానూ వారి అభ్యర్థనలను పక్కన పెట్టాలి. దానివల్ల మన కార్యాచరణప్రణాళిక డిస్టర్బ్ కాదు. పైపెచ్చు టైమ్ సేవ్ అవుతుంది.

ఒక పని ప్రారంభించిన తరువాత మధ్యలో తెగతెంపులు లేని ఆలోచనలు చెయ్యకూడదు. చేతిలో ఉన్న పనులను చిన్నచూపు చూసి కొత్తవేవో తెచ్చి నెత్తిన పెట్టుకుంటే మొదటికే మోసం వస్తుంది.

తస్మాత్ జాగ్రత, జాగ్రత! ●

# 16. సమర్థులకే పోటీ ప్రపంచంలో స్థానం

**భీ**ష్ముడు చెప్పాడు :

దూరదృష్టి, ఉపాయం లేనివాడు ఎన్నో రకాలుగా నష్టపోతాడు; ఒకోసారి ప్రాణాలు పోగొట్టుకుంటాడు. అప్పటికి తోచినట్టు నడిచేవాడు పరమ సంశయమైన జీవితం గడుపుతాడు. రాబోయేవాటిని ముందే ఊహించుకుని తగినవిధంగా ప్రవర్తించేవాడు సుఖపడతాడు.

●

*వేసవికాలం.*

*సూర్యుడు నిప్పులు చెరిగిపోస్తున్నాడు. చెరువులూ, మడుగులూ ఇంకిపోతున్నాయి.*

*'చూశారా! మడుగు ఎండిపోతోంది. ఈ కాసిని నీళ్లు కూడా ఇంకిపోతే ఇంకోచోటికి వెళ్లడం కూడా సాధ్యం కాదు. కనుక ఇప్పుడే 'ఎప్పుడూ ఇంకని నీళ్లుగల మడుగుకు వెళ్లిపోదాం' అన్నాడు దీర్ఘదర్శి.*

*'నీ కన్నీ భయాలే! ఊరుకో. అంతగా అలాంటి పరిస్థితే వస్తే అప్పటికి తగినట్టు చూసుకుందాంలే' అన్నాడు ప్రాప్తకాలజ్ఞుడు.*

*'బాగా చెప్పావు. దీర్ఘదర్శి ఎప్పుడూ అంతే. వాడు కంగారు పడతాడు, మనల్ని కంగారు పెడతాడు. మనం ఇప్పుడున్న మడుగు సముద్రంలా ఉంది. అప్పుడే ఏం మూడిందని ఇంతగా విచారపడడానికి? అంతగా ఆపదే ముంచుకొస్తే అప్పుడు చూసుకుందాంలే' అన్నాడు దీర్ఘసూత్రుడు.*

*'సరే అయితే... మీరు మీ ఇష్టం వచ్చినట్టు ఉండండి. నేను మాత్రం వెడుతున్నా' అని చెప్పి బయలుదేరాడు దీర్ఘదర్శి. అతనికి దూరదృష్టి ఎక్కువ. అరణ్యంలో ఉన్న ఆ మడుగులో ప్రాప్తకాలజ్ఞుడూ, దీర్ఘసూత్రుడూ అనే మిత్రులతో కలిసి చాలాకాలంగా ఉంటున్నాడు. 'స్నేహితులు కదా అని వాళ్ల హితం కోరి రాబోతున్న ప్రమాదాన్ని గురించి హెచ్చరించాడు. వినకపోతే*



*తానేం చేస్తాడు?! తాము చెపలయ్యే! ఎప్పుడూ నీళ్లలోనే బతకాల్సి ఉండె! ఎండలా రాను రాను ముదురుతున్నా యయ్యే! మడుగు ఇవాళ కాకపోతే రేపైనా ఇంకక ఏంచేస్తుంది? నీళ్లు ఇంకితే జాలర్లు చేపల్ని బతకనిస్తారా? మరోచోటికి పోనిస్తారా? అప్పుడు బితుకు బితుకు మంటూ ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని తొక్కిసలాడేకంటే ముందే జాగ్రత్త పడడం మంచిదికదూ! ఎంత చెప్పినా వినరాయె... ఇంకేం చేస్తాం?' అనుకుని ఓ నిట్టూర్పు విడిచి, మెల్లమెల్లగా వెళ్లి ఒక పెద్దమడుగులో ప్రవేశించాడు దీర్ఘదర్శి. మిగిలినవాళ్ళిద్దరూ ఇంతకు మునుపున్న మడుగులోనే వున్నారు.*

*దీర్ఘదర్శి చెప్పినట్టే కొన్నాళ్లకు మడుగులోని నీళ్లన్నీ అడుగంటసాగాయి. చేపలు పట్టేవాళ్లు వలలు పట్టుకుని రానే వచ్చారు.*

*'అయ్యయ్యో! ఎంత ప్రమాదం వచ్చిపడింది!! ఈ జాలర్లు ఊతలతోనూ, వలలతోనూ కాకుండా, చేతులతో కూడా పట్టేస్తున్నారు చేపల్ని. తాళ్లతో*

గుచ్చుతున్నారు. ఏంచేద్దాంరా దీర్ఘసూత్రా!' ప్రాప్తకాలజ్ఞుడు ఏడుపు ముఖం పెట్టి అడిగాడు.

'ఏమోరా, దీర్ఘదర్శి చెబితే విన్నాం కాదు. ఇప్పుడేం చేయాలో నాకు తోచడం లేదు' అంటూ అటూ ఇటూ కంగారుగా ఎగిరిపడడం మొదలుపెట్టాడు దీర్ఘసూత్రుడు.

అలా ఎగరడం ఒక జాలరివాడు చూడనే చూశాడు. రెండు చేతులతోనూ పట్టుకుని చంపి తాడుకు గుచ్చేశాడు.

అది చూసి ప్రాప్తకాలజ్ఞుడి గుండె జల్లుమంది. నిలువెల్లా వణికిపోయాడు.

ఆలోచించి ఆలోచించి ఒక ఉపాయం పన్నాడు. చేపలను గుచ్చిపెట్టిన తాడు దగ్గరకు మెల్లగా వెళ్లి, ఆ తాడును రెండు దవడలతోనూ కరిచి పట్టుకుని అచ్చం చచ్చినట్టే, ఆ తాడుకు గుచ్చినట్టే పడి ఉన్నాడు. వేటంతా అయిపోయాక, మంచినీళ్ల మడుగులో ముంచాడు. బతుకు జీవుడా అనుకుని ప్రాప్తకాలజ్ఞుడు గబగబా ఆ తాడును విడిచిపెట్టి నీళ్లల్లోకి దూసుకుపోయి ఇతర జలచరాల్లో కలిసిపోయాడు.

అదీ కథ.

చాణక్యుడు కూడా చెప్పాడు.

'యత్ర సుఖేన వర్తతే తదేవ స్థానమ్' – ఎక్కడ సుఖంగా నివసించగలుగుతామో అదే సరైన స్థానమని తెలుసుకోవాలి.

'స్వర్గం న యతి సూనృతమ్' సత్యమూ హితమూ అయిన వాక్యం వినాలి. అది స్వర్గానికి తీసుకుని వెడుతుంది.

**ముంచుకొచ్చినప్పుడు తొక్కిసలాడేకంటే ముందే జాగ్రత్త పడడం మంచిదికదూ! ఎంత చెప్పినా వినరాయె...**

ఏతావతా చెప్పొచ్చేదేమిటంటే, రేపటిరోజును ఈ రోజే ఊహించేవాళ్లూ, రాబోయే ప్రమాదాలను ముందుగానే పసిగట్టేవాళ్లూ, వాటిని అధిగమించేందుకు దూరదృష్టితో పథకాలు రూపొందించుకునేవాళ్లూ, పనిపట్ల అలసత్వం, బద్ధకం ప్రదర్శించని వాళ్లూ సమర్థులు. సామర్థ్యానికి గల అనేక పార్శ్వాల్లో దూరదృష్టి ఒకటి. అందువల్ల దూరదర్శనం సమర్థుల లక్షణం.

సమర్థులకే ఈ పోటీ ప్రపంచంలో స్థానం ●

# 17. సిబ్బందితోనే 'బిగ్ బి' సక్సెస్!

ఒకసారి మనస్సుకూ, ఇంద్రియాలకూ వాదం జరిగింది. 'మనసా! నువ్వూ, మేమూ ఒకటే సుమా!' అన్నాయి ఇంద్రియాలు మనస్సుతో.

'ఏందుకవుతుంది? మీ కంటే నేనే గొప్పదాన్ని. నేను కనుక కొంచెం పక్కకు తప్పుకున్నానంటే ముక్కు వాసన చూడలేదు. కళ్లు చూడలేవు. చెవులు వినలేవు. నాలుక రుచి తెలుసుకోలేదు. చర్మం స్పర్శను గ్రహించలేదు. తెలుసా?! ఇంక నేను పూర్తిగా మీ నుంచి వైదొలిగిపోతే మీరు ఒడ్డున పడ్డ చేపల్లా గిలగిలలాడుతారు' మనస్సు గర్వంగా అంది.

'నువ్వన్నది కొంతవరకూ నిజమే కావచ్చు. అంతమాత్రం చేత నువ్వు మాకంటే గొప్పదాని వవుతావా? మేం లేకుండా విషయసుఖాలను నువ్వు ఆవగింజంతైనా అనుభవించగలవా? అలా అనుభవించగలిగితే నువ్వు గొప్ప దానివని అంగీకరిస్తాం. మాలో ఏ ఒక్కటి అణిగిపోయినా ఆ విషయాన్ని ఇంకోదానితో అనుభవించే సామర్థ్యం లేదు నీకు. అంటే, ఒకవేళ కళ్లు లేకుండా పోయాయనుకో... 'చూడడం అనే పనిని చెవులతో గాని, మరింక దేనితో నైనాగాని చెయ్యగలవా? చెయ్యలేవు. ఆయా విషయాలు ముందుగా మేము గ్రహించి నీకు అందిస్తూంటే మహారాజులా నువ్వనుభవిస్తున్నావు. కనుక మేము లేకపోతే నువ్వు లేవు. మా తోటిదే నీ బతుకు. ఇంక మాకంటే నీ గొప్పేమిటి? నీ ఆధిక్యమేమిటి? ఒకవేళ నువ్వు అణిగిపోతే నీకు మళ్లీ తెలివి కలిగించి ప్రాణాలు రక్షించేది కూడా మేమే! తెలివైన పిల్లలకు ఏదో చెప్పబోయి, ఎన్నెన్నో కొత్తకొత్త విషయాలు వాళ్లనుంచే తెలుసుకున్న గురువులాగ మమ్మల్ని ఆధారంగా

> **మేం లేకుండా విషయసుఖాలను నువ్వు ఆవగింజంతైనా అనుభవించగలవా? అలా అనుభవించగలిగితే నువ్వే గొప్ప!**

*చేసుకుని ఇన్నాళ్లూ అన్ని విషయాలూ తెలుసుకుంటూ వచ్చావు. ఇప్పుడు మమ్మల్ని వదిలి ఒంటరిగా బతకాలని కలలు కంటున్నావు. ఆ కల నిజం కాదని మమ్మల్ని విడిచిన మరుక్షణానే తెలుస్తుందిలే. అప్పుడు 'మీరే గతి' అని మమ్మల్ని ఎలాగో మళ్లీ ఆశ్రయిస్తావు. వెళ్లు, వెళ్లు. అనవసరంగా హెచ్చులు పలకకు. బీరాలు పోకు. నువ్వూ, మేమూ కలిసి ఉంటేనే ఏ భోగాలైనా! తెలిసిందా' అన్నాయి ఇంద్రియాలు. మారు మాట్లాడక నోరు మూసుకుంది మనస్సు.*

ఈ ఇతిహాసం భారతంలో ఉంది.

బిజినెస్‌లోనూ, ఇండస్ట్రీలోనూ, ఆఫీసుల్లోనూ ఉండే బాసులందరూ ఈ కథ నుంచి తెలుసుకోవలసిన నీతి ఎంతైనా ఉంది.

బాస్‌లకు హోదా ఉండొచ్చు. అనుభవం ఉండొచ్చు. వనరు లుండొచ్చు. వినయంగా వంగివంగి నమస్కారాలు చేసే అతి వినయధూర్తు లుండొచ్చు. కాని, మొత్తంమీద చూసినప్పుడు యజమాని అందరి మీద ఆధారపడాల్సిందే. అందరి సహకారం తీసుకోవాల్సిందే. కనుక అందరి ఆదరాభిమానాలూ చూరొగనగలిగిన వాళ్లే సమర్థులైన బిగ్ బిలు.

బి ఎ గుడ్ లిజనర్. తమ కింద పనిచేసేవాళ్లు ఏదైనా చెబుతూంటే శ్రద్ధగా వినాలి. లిజన్ విత్ అండర్‌స్టాండింగ్. ఎదుటివారు చెబుతోంది వినాలన్న సంస్కారం, వినేందుకు అవసరమైన సహనం బాస్‌లకు ఉండాలి. వినడమంటే చెవివొగ్గి వినడం, సమస్యను అవగతం చేసుకోవడం, ఆకళింపు చేసుకోవడం. అలా చేయడంవల్ల ఒకరికొకరు అర్థమవుతారు. ఇంటర్ పర్సనల్ రిలేషన్‌షిప్ మెరుగవుతుంది. వెనువెంటనే చాలా సమస్యలకు సులభమైన పరిష్కారాలు దొరుకుతాయి. దీనినే 'వినదగు

**ఎదుటివారు చెబుతోంది వినాలన్న సంస్కారం, వినేందుకు అవసరమైన సహనం బాస్‌లకు ఉండాలి.**



నెవ్వరు చెప్పిన, విని నంతనె వేగపడక వివరింప దగున్' అని రెండు ముక్కల్లో తేల్చి చెప్పాడు సుమతీ శతకకారుడు.

అలాగే, అధికారం ఉన్నది కదా అని తమకింద పనిచేసే వాళ్లను చీటికీ మాటికీ విమర్శించకూడదు. వాళ్ల పనుల్లో ఎప్పుడూ ఎగ్గులు పెట్టడం, ఛీత్కారంగా మాట్లాడడం, పరుషంగా మాట్లాడడం మంచిది కాదు. దానివల్ల వాళ్ల మనస్సు గాయపడుతుంది. బాస్ ఈజ్ బాడ్ అన్న అభిప్రాయం ఏర్పడి రిజెంట్‌మెంట్ మొదలవుతుంది. బాస్ అంటే గిట్టకపోవడం, ఏహ్యభావం కలగడం, పగ, ద్వేషం చోటు చేసుకోవడం, క్రమక్రమంగా సిబ్బంది సామర్థ్యం సన్నగిల్లడం జరుగుతాయి. బిగ్‌బాస్‌లకూ, ఎగ్జిక్యూటివ్‌లకూ వాక్పారుష్యం అసలు పనికిరాదు. అది చాలా చేటు తెస్తుంది. ఆన్‌డ్యూ క్రిటిసిజమ్, సినిసిజమ్ రాదర్ హార్మ్స్ యువర్‌సెల్ఫ్ అండ్ అదర్స్ టూ. మరొక విషయం కూడా గుర్తుంచుకోండి, క్రిటిసైజ్ ద ఇష్యూస్ బట్ నాట్ ద పర్సన్స్.

'అల్పమయ్యు గర్వము బహుకాలసంచిత తపఃఫల హాని యొనర్పకుండనే'. గర్వం, అతిశయం కొంచెమే అయినా, ఎంతో కాలంగా

కూడబెట్టిన తపస్సుయొక్క ఫలితా న్నంతా హరించివేస్తుందిట. కనుక, ఇక్కట్లన్నిటికీ ఇగోయే కారణం అని తెలుసుకోవాలి. తనకే అన్నీ తెలుసునన్న అహంభావం, తన మాటే చెల్లాలన్న మూర్ఖపు పట్టుదల, తనొక్కడే ఆజానుబాహువు, మిగిలినవాళ్లంతా అంగుష్ఠ మాత్రులన్న అజ్ఞానాహంకారాలు అనర్థాలను తెచ్చిపెడతాయి. అరమరికలు లేకుండా అందరితో కలిసిపోయి అందరిలో తనూ ఒకడై జట్టును ముందుకు నడిపించే టీమ్ మేనేజర్లు కావాలిప్పుడు. దే మస్ట్ బిల్డ్ టీమ్స్ దట్ గివ్ బర్త్ టు లీడర్స్.

ఎంప్లాయీస్ లాయల్‌గా ఉండడం గొప్ప విషయం. చాలా సంస్థలు ఈ రోజున బ్రిలియంట్ స్టాఫ్‌కన్నా, లాయల్‌గా ఉండే సిబ్బందిపైన, కస్టమర్ రిలేషన్స్ పెంపొందించే సిబ్బందిపైన మక్కువ చూపుతున్నాయి.

ఏ సంస్థకైనా లాయల్ టీమ్ ఏర్పడాలంటే బాస్‌లకూ, సిబ్బందికీ మధ్య అంతరాలు ఉండకూడదు. అంతేకాదు; Bosses should consider their people as instrumental because people make the things happen. యుద్ధభూమిలో నిలబడ్డ జనరల్, సోల్జర్ లేకుండా ఏం చేస్తాడు? He can not do any thing. కంపెనీ సిఇఓ కూడా అంతే. ఉద్యోగుల్లో సెన్స్ ఆఫ్ బిలాంగింగ్‌నెస్‌ని, టీమ్ వర్క్ కాన్సెప్ట్‌ని డెవలప్ చేయాలి. మోటివేట్ చేయాలి. అప్పుడు వాళ్లు మన వెన్నంటి ఉంటారు. They become loyal and devoted to the Organisation.

అదీ రహస్యం ●

# 18. హౌ టు మోటివేట్ ఎంప్లాయీస్

**హౌ** టు మోటివేట్ ఎంప్లాయీస్?

కార్పొరేట్ సంస్థల 'దృష్టి' అంతా ఇప్పుడు దీనిమీదే!

ఇన్ ఫాక్ట్ ది సీజ్ ఎ గ్రేట్ ఆర్ట్ విచ్ షుడ్ బి ఎడాప్టెడ్ అట్ ద టాప్.

జాబ్ ఓనర్‌షిప్‌ని ప్రమోట్ చేయడం, లక్ష్యాలను నిర్దేశించడం, సవాళ్లు విసరడం వంటివి చేసి ఉద్యోగుల్లో సహజంగా ఉండే డిజైర్ ఫర్ ఓనర్‌షిప్‌నీ, డిజైర్ ఫర్ పవర్‌నీ టికిల్ చేయాలనీ, అలాగే మనుషుల్లో సహజంగా ఉండే డిజైర్ ఫర్ ఎఫీలియేషన్ ఆర్ ఎటాచ్‌మెంట్, డిజైర్ ఫర్ అచీవ్‌మెంట్, రికగ్నిషన్, మీనింగ్‌ఫుల్‌నెస్ ఇన్ వర్క్ వంటి వాటిని ప్రేరేపించాలనీ ఒక 'ఆంగ్ల దినపత్రిక'లో చదివాను.

దటీజ్ రైట్! For motivating the employees all that you need to do is to utilise their natural ability. ప్రతి ఉద్యోగికీ అతను పనిచేసే సంస్థతో ఒక అనుబంధం ఉంటుంది. అది చేసే నిర్ణయాలలో అతనికి ప్రమేయం ఉండాలనుకుంటాడు. అతని ఆలోచనలను పైవాళ్లు పరిగణనలోకి తీసుకోవాలనుకుంటాడు. తనను గుర్తించాలనీ, గౌరవించాలనీ తాపత్రయపడతాడు. The universal human desire is that he or she should be cared for and his or her views and opinions be valued. దానితోపాటు తాను చేసే పని అర్థవంతంగా ఉండాలనీ, రొటీన్‌కి భిన్నంగా సృజనాత్మకత ఉట్టిపడేలా చేయాలనీ అనుకుంటాడు. ఇవన్నీ మానవ సహజమైన కోర్కెలు. వాటిని ప్రోత్సహిస్తే చాలు, వాళ్లంతట వాళ్లే మోటివేట్ అవుతారు. 'ఎవరికి ఏ పనిలో నేర్పు ఉంటుందో వాళ్లను ఆ పనిలోనే నియమించాలి. ఉత్తములకు ఉత్తమకార్యాలు, నడిమిరకం వారికి నడిమిరకం పనులు, అంతకంటే తక్కువవారికి సామాన్యమైన పనులు అప్పగించాలి. అప్పగించిన పని బాగా చేసినవారిని మెచ్చుకోవాలి. జీవితంలో

పెంపుదల చూపించాలి. విద్యావినయ సంపన్నుల్నీ, జ్ఞానుల్నీ తగువిధంగా సన్మానించాలి' అని భారతంలో చెప్పారు.

నిజంగా గొప్పపనులు చేసినప్పుడో, పనుల్ని గొప్పగా చేసినప్పుడో, అనూహ్యమైన ఫలితాలు సాధించినప్పుడో ప్రశంసిస్తే పోయేదేముంది? A pat on the back can go a long way to keep your employees motivated.

క్షేమేంద్రుడు చారు చర్యలో చెప్పాడు.

**గుణస్తవేన కుర్వీత మహతాం మాన వర్ధనమ్ ।**

**హనుమాన భవత్స్తుత్యా రామకార్య ధురంధరః ॥**

కార్యనిర్వహణలో నేర్పరులైన వారినీ, మంచిపనులు చేసేవారినీ, సద్గుణ సంపన్నుల్నీ మెచ్చుకోవడంవల్ల లోక కళ్యాణం జరుగుతుందిట.

ఇచ్చకాలమారి మాటలు కాకుండా మనఃపూర్వకంగా ప్రశంసిస్తే ఇంకా ఇంకా మంచిపనులు చేయాలనే కోర్కె వాళ్లలో బలపడుతుందిట.

ఉదాహరణగా క్షేమేంద్రుడు ఆంజనేయుని దృష్టాంతం చెప్పాడు. జాంబవంతుడు మొదలైన భల్లూక వానర వీరులందరూ, సముద్రాన్ని అవలీలగా లంఘించే శక్తి నీకు మాత్రమే ఉందనీ, నువ్వే సమర్ధుడవనీ పొగిడేసరికి హనుమంతుడికి తన బలంమీద అపార విశ్వాసం కుదిరింది. దానితో ఆయన సముద్రాన్ని అవలీలగా దాటేసి సీతమ్మ తల్లి కుశలవార్త తెలుసుకుని రామకార్యం సాధించాడు. కనుక తెలుసుకోవలసిందేమిటంటే, సమర్థుల్ని తగు సమయంలో ప్రశంసించడంవల్ల వాళ్ల బ్యాటరీ రీచార్జ్ అవుతుంది.

**ప్రతి ఉద్యోగి తాను చేసే పని అర్ధవంతంగా ఉండాలనీ, రొటీన్‌కి భిన్నంగా సృజనాత్మకత ఉట్టిపడేలా చేయాలనీ అనుకుంటాడు.**

Appreciation at various levels works magic to stimulate the

employees for performing better. ఛీప్ ఎగ్జిక్యూటివ్ లందరికీ ఈ కిటుకు తెలియాలి.

> **నిజంగా గొప్పపనులు చేసినప్పుడో, పనుల్ని గొప్పగా చేసినప్పుడో, అనూహ్యమైన ఫలితాలు సాధించినప్పుడో ప్రశంసిస్తే పోయేదేముంది?**

'ఉద్యోగు లందరిమధ్య సుహృద్భావ సంబంధాలను పెంపొందించాలి. వారంతా ఉత్సాహంగా, ఉల్లాసంగా పని చేసేటందుకు అనువైన వాతావరణాన్ని కల్పించాలి. వాళ్ల లోభాలకు లొంగకుండా, లంచాలు పుచ్చుకోకుండా ఎప్పటి జీతాలు అప్పు డిస్తుండాలి. ఏదో ఒక సాకున జీతాలు విరగ్గొయ్యటం కానీ బిగపట్టడంకానీ చెయ్యకూడదు. చాలా మంచిగుణాలు ఉన్నవాళ్లను ఏదో ఒక చిన్నదోషం కనిపించినంతమాత్రాన బాధ పెట్టకూడదు. చెప్పుడు మాటలు విని ఆశ్రితుల పొట్టమీద కొట్టకూడదు. కార్యనిర్వహణలో నేర్పరి కదా అని ఎప్పుడూ ఒకరిమీదే బరువు వేయకూడదు. తలకు మించిన భారం మనిషిని క్రుంగదీస్తుంది' అని భారతం చెబుతోంది.

'సంస్థల్లోనూ, కార్యాలయాల్లోనూ పని చేసేటందుకు కావాల్సిన మంచి వాతావరణం – 'గుడ్ వర్క్ కల్చర్' ఉంటే ఉద్యోగులు సమర్థంగా పనిచేయ గలుగుతారు అని మేనేజ్‌మెంట్ నిపుణుడు ఎస్.కె.రే రాశారు. మహాభారతంలో చెప్పినట్టే ఆయన కూడా అని చెప్పారు.

ఇప్పుడుందో, లేదో నాకు తెలియదు.

కొన్నేళ్లక్రితం విజయవాడ ఆకాశవాణి కేంద్రంలో చిత్తశుద్ధితో పనిచేసిన ఉద్యోగులకు 'ఉత్తమ ఉద్యోగి' అవార్డు ఇచ్చి సత్కరించే సత్సంప్రదాయం ఉండేది. అంటే A system of selecting the employee of the year on the basis of their performance, contribution and involvement with in the organisation. మా న్యూస్ ఎడిటర్ ఆర్.వి.వి. కృష్ణారావుగారు

చాలా పెద్దమనిషి, బాధ్యత లెరిగిన అధికారి, మర్యాదస్తుడు. వర్కహాలిక్. మరో ధ్యాసలేకుండా పని చేసే వ్యక్తి. వరుసగా ఆయనకు రెండేళ్లు ఈ అవార్డు కూడా వచ్చేసరికి ఆయన కమిట్‌మెంట్ ఏ లెక్కలూ కూడి పెట్టలేనంతగా ఏ ఎక్కాలూ గుణించి పెట్టలేనంతగా పెరిగింది. ఎందుకు చెబుతున్నానంటే ఇలాంటి స్పెషల్ అప్రీసియేషన్లవల్ల ఉద్యోగుల పనితీరు శతాధికంగా పెరిగి తీరుతుంది.

బాపూగారి 'పెళ్లిపుస్తకం' సినిమాలో గుమ్మడిగారు ఓ టెక్స్‌టైల్ కంపెనీ అధినేత. హీరో రాజేంద్రప్రసాద్ అందులో డిజైనర్. సంస్థ యజమాని, యజమానురాలు, సంస్థలోని ఉద్యోగులు, వాళ్ల కుటుంబాలు అందరూ ఒకసారి ఓ చక్కటి తోటలో విందు సమావేశం ఏర్పాటు చేసుకుంటారు. 'యజమాని – భృత్యులు' అని కాని, 'అధికారులు–చిన్న ఉద్యోగులు' అని కాని తేడాలేవీ లేకుండా భోజనానికి ముందు అందురూ కలిసిపోయి ఆటలాడుతారు, పాటలు పాడుతారు.

ఇది సరదా సన్నివేశంలా అనిపించొచ్చు గాని, అంత తేలికగా తీసుకోవాల్సింది మాత్రం కాదు. తారతమ్యాలను చెరిపివేయడం, స్పిరిట్ ఆఫ్ యూనిటీని పెంచడం మూలంగా ఉద్యోగుల్లో సెన్స్ ఆఫ్ బిలాంగింగ్‌నెస్ పెరుగుతుందనీ, తద్వారా సంస్థ అభ్యున్నతి కోసం వారంతటవారే పాటుపడతారనీ చెప్పడం ఆ సన్నివేశం యొక్క ఆంతర్యమై వుండాలి.

**సమర్థుల్ని ప్రశంసించడంవల్ల, ప్రోత్సహించడంవల్ల వాళ్ల బ్యాటరీ రీచార్జ్ అవుతుంది.**

అంతేకాదు, ఉద్యోగుల్ని వాళ్ళ కుటుంబాలతో సహా రమ్మని పిలిచారంటే కుటుంబాన్ని నడిపేందుకు దంపతుల సమష్టికృషి ఎంత అవసరమో, ఓ సంస్థకు యజమాని, ఉద్యోగుల సమైక్యకృషి

కూడా అంతే అవసరమని పరోక్షంగా చెబుతున్నారన్న మాట. మరోలా చెప్పాలంటే – కంపెనీ యజమాని తన ఇల్లాలితో సహా విందు సమావేశానికి హాజరై, సిబ్బందిలో ప్రతి ఒక్కరినీ పేరుపేరునా పలకరిస్తూ వాళ్ళ కుటుంబాలకు తమను తాము పరిచయం చేసుకోవడం ద్వారా, 'విజయపథంలో నడిచే ప్రతిపురుషుడి వెనుక ఒక స్త్రీ వుంటుంది. నా వెనుకనున్న అద్భుతం ఈమె' అని చెప్పినట్టయింది. అలా, సంస్థలోని ఉద్యోగుల్ని, వాళ్ళ కుటుంబాల్ని కూడా మోటివేట్ చెయ్యవచ్చు.

నాకు ఇంకొకటి అనిపిస్తోంది. ఎవరూ పుట్టుకతోనే అన్ని విద్యలూ చేతబుచ్చుకుని రారు. ఎవ్విరిథింగ్ కమ్స్ బై లెర్నింగ్, కమ్స్ బై ప్రాక్టిస్. లెర్నింగ్ ప్రాసెస్‌లో ఎదురయ్యే తప్పుల్ని ఎవరూ పట్టించుకోకూడదు. వాటిని అసలు విమర్శించకూడదు. అవసర మనిపిస్తే నిర్మాణాత్మక సూచనలు మాత్రమే చేయాలి.



భారతం ఎంత గొప్ప కావ్యమంటే ధర్మతత్త్వజ్ఞులకు ధర్మశాస్త్రంలా, ఆధ్యాత్మ విదులకు వేదాంతంలా, నీతి విచక్షణులకు నీతిశాస్త్రంలా, కవి వర్యులకు మహాకావ్యంలా, లాక్షణికులకు సర్వలక్షణ సంగ్రహంలా, ఐతిహాసికులకు ఇతిహాసంలా, పరమ పౌరాణికులకు బహు పురాణ సముచ్చయంగా – ఎవరికి ఎలా కావాలనుకుంటే అలా ఉపయోగపడుతూ తరతరాలుగా సమాజానికి వెలుగు నిస్తోంది.

నౌ బియాండ్ మీటింగ్ ఆల్ దోజ్ క్రైటీరియా, ఇన్ దిస్ ట్వెంటీఫస్ట్ సెంచరీ ఇట్ హాజ్ బికమ్ ద స్టయిల్‌బుక్ ఫర్ డెసిషన్ మేకర్స్ అండ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్స్. అదీ గొప్ప!●

# 19. రైట్ టు ఫుడ్

'రాజు అనేవాడు ఒకడు ఉండడం, ప్రజలకు చక్కగా పాలించడం, వాళ్ళెవరూ అతని మాట మీరకపోవడం అన్నవి విష్ణుదేవుడి అభీష్టాలు. ఆయన తన తేజోరూపంతో రాజులలో ప్రవేశించి ఉంటాడు. అందుచేతనే రాజు దేవుడిలాంటివా డయ్యాడు. అందుకే అందరి నమస్కారాలూ అందుకో గలుగుతున్నాడు. లోకమంతా ఒకరి వశమై ప్రవర్తించడమనేది దైవాంశ అతనిలో ఉంటేనే సంభవిస్తుంది. రాజులెప్పుడైతే దేవసమానులయ్యారో అప్పుడే వాళ్ళకు ప్రజలను రక్షించవలసిన బాధ్యత ఏర్పడింది. అంతేకాదు; వాళ్ళు ప్రజలను ఉద్ధరించాల్సి వచ్చింది. ప్రజలకు తిండిపెట్టాల్సి వచ్చింది. ధర్మాన్ని నిలబెట్టాల్సి వచ్చింది. క్షతులను అంటే బాధలకు గురవుతున్న వాళ్ళనూ, వేదవర్యులనూ ఆదుకుంటాడు గనుక క్షత్రియుడనీ, ప్రజలను రంజింప చేసేవాడు గనుక రాజనీ ప్రభువుకు పేర్లొచ్చాయి' అని గాంగేయుడు పాండవులకు బోధించాడు.

ఇప్పటివారు 'మేము ప్రభువులం కాదు; నిరంతర ప్రజాసేవకులం' అని అతి వినయాలు పోయినా అధికారంలో వున్నవాళ్ళు గమనించాల్సిన విషయాలు అప్పుడూ, ఇప్పుడూ ఒకటే.

> **తన శరీరం ఇచ్చి అయినాసరే బడుగుల్ని ఆదుకుంటాననే దృఢసంకల్పం ఎవరికైతే ఉంటుందో వాళ్లకే సమస్త ధర్మసిద్ధులూ!**

'రాజుకు శరీరం ప్రజలు. ప్రజలకు ఆత్మ రాజు. కనుక వాళ్ళు ఒకరి నొకరు రక్షించుకుంటూ ఉండాలి. ప్రజలు ఆకలితో అల్లాడిపోకుండా పాలకులు చూడాలి. ప్రజలకు తిండినిచ్చే పంటలు సమృద్ధిగా పండించేలా, భూమి సస్యాలు కురిసేలా రైతులకు కావల్సిన సాధనసంపత్తి నంతా సమకూర్చి పెట్టాలి. విపత్కర పరిస్థితులు రాకుండా

చూడడమూ, వస్తే ఆ పరిస్థితుల్ని చక్కదిద్ది ప్రజలకు కనీసమైన తిండి లభించేలా చూడడమూ ప్రజా పరిపాలకుల కర్తవ్యం' అని భీష్ముడు చెప్పాడు. పరిపాలక ధర్మాలలో ఇదే ప్రధానమైందని కూడా చెప్పాడాయన. 'అతిథుల్నీ, దీనుల్నీ, ధనసంపాదన లేని సన్యాసుల్నీ, సాధువుల్నీ, బీదసాదల్నీ పాలకులే ఆదరించాలి. తన శరీరం ఇచ్చి అయినాసరే బడుగుల్ని ఆదుకుంటాననే దృఢసంకల్పం ఎవరికైతే ఉంటుందో వాళ్ళకు సమస్త ధర్మసిద్ధులూ



కలుగుతాయి. కూడే పెడ్తారో, గుడ్డే ఇస్తారో, గూడే కడతారో, డబ్బే ఇస్తారో... అది ప్రభువుల ఇష్టం. ప్రజల పరిస్థితినిబట్టి చేయాలి. ఎంత ఎక్కువమందికి రాజు బాసటగా నిలుస్తాడో అంతగా ప్రజల మన్నన పొందుతాడు. అలా కాకుండా, పాలించవలసినవాళ్లు సరిగా ప్రజలను పాలించకపోయినా, ధర్మాన్ని ఉపేక్షించినా అరాజకం పెరుగుతుంది. అప్పుడు మంచి – చెడు అన్న హద్దులు చెరిగిపోతాయి. భూమి ఫలించడం మానేస్తుంది. ప్రకృతి వైపరీత్యాలు ఏర్పడతాయి. ప్రజలకు ఆయువూ, ఐశ్వర్యం తగ్గుతాయి. భయోత్పాతం పెరుగుతుంది. మానవ ధర్మాలన్నీ మంట గలుస్తాయి' అని భీష్ముడు హెచ్చరించాడు. పాలకులు విజ్ఞులైతే ఈ పరిస్థితి రాకుండా ముందే

జాగ్రత్త పడతారు. ప్రజోపయోగకర రంగాలు. సామాజికసేవా రంగాలలో ఎక్కువగా పెట్టుబడులు పెట్టడం, గ్రామప్రాంతాలలో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, పేదప్రజలకు ఉపాధి కల్పించడం, తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం వచ్చే పనులు చేపట్టడం వంటివి చేస్తారు. ఎన్ని చెప్పినా, the business of the government is to offer good governance.

కాని ఇప్పుడు మనకు లేనిదే అది. ఇటీవలి కాలంలో పరిస్థితి మరీ అదుపు తప్పింది. మంచి మనుషులకు కొరత వచ్చింది. ఎప్పటి కెయ్యది ప్రస్తుత మప్పటికా మాటలాడి పబ్బం గడుపుకునేవాళ్లు పాలకులుగా, అధికారులుగా రావడంతో పాలనా యంత్రాంగమంతా నిర్వీర్యమైంది. అన్నిటిమీదా బ్యూరోక్రాటిక్ కంట్రోల్ పెరిగింది. జనసామాన్యానికి వాళ్ళేమాత్రం సహాయం చేయకపోగా, పరిస్థితిని తమకు అనుకూలంగా మలుచుకుని అక్రమమార్గాల్లో వాళ్ళు లబ్ధి పొందుతున్నారు. అదీ దారుణం!

Nothing has indicated government's performance more trenchantly than the Supreme Court's observation that it is the primary responsibility of the Central and the State Governments to ensure that the food grains over-flowing the godowns of the Food Corporation of India reach the starving people and not wasted by being dumped into the sea or eaten by rats.

ఆహార గిడ్డంగుల్లో యాభై మిలియన్ టన్నులకు పైగా ఆహారధాన్యాలు పేరుకుపోయి ఉంటే దేశం వివిధ ప్రాంతాల్లో ప్రజలు ఆకలిచావులకు గురికావడం పరమ విషాదకరం కదూ! The harmonious socialism of India always flourished on the basis of

> **ఒకపక్క గిడ్డంగుల్లో ఆహారధాన్యాలు పేరుకుపోయి ఉంటే, మరోవైపు ప్రజలు ఆకలిచావులకు గురికావడం విషాదకరం!**

Annadana and Jaladana. Annadana is in fact Pranadana which is the same as giving the gift of life.

అంతెందుకు, రాజ్యాంగం 21వ ఆర్టికల్‌లో ఆహారభద్రత గురించి రాసుకున్నామా, లేదా? మరి అది ఏమేరకు అమలవుతోంది?? Does the right to life enshrined in Article 21 of the Consitution also include the right to Food? Are not the poor who have no means to buy food entitled to free supply of grains, particularly when the State holds surplus stocks which are lying unused and getting rotten? Why should people die of chronic malnutrition?

దీనికేం సమాధానం చెబుతారు? తరచూ అనుకోని వైపరీత్యాలు సంభవించే ఒరిస్సాలో దురాశాపరులైన వ్యాపారులూ, అధిక వడ్డీలకు అప్పులిచ్చే కాబూలీవాలాలూ దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారి కోసం ఉద్దేశించిన ధాన్యాన్ని గద్దల్లా తన్నుకుపోతుంటే 'కాలే కడుపులకు మండే గంజి' అన్న సామెతగా చేతికి దొరికిన దుంపలూ, కాయలూ తింటూ పేదప్రజలు ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్నారని అక్కడి స్పెషల్ రిలీఫ్ కమీషనర్ చెప్పారు.

ఇక దేశం మొత్తంమీదా చూస్తే, ప్రజాపంపిణీ కోసం కేటాయిస్తున్న ఆహారధాన్యాలలో ముప్పై శాతానికి పైగా ప్రైవేట్ ట్రేడర్లు, కాంట్రాక్టర్ల చేతుల్లోకి పోతున్నాయని కేంద్ర ప్రణాళికా సంఘమే ఒప్పుకుంది. ఇంతకన్నా సిగ్గుమాలినతనం వుందా?

'రైతులు పండించే ఆహారధాన్యాలూ, గోపాలకులు ఉత్పత్తి చేసే పాలూ నెయ్యి మజ్జిగ వంటివి ప్రజలకు అందచేసేటప్పుడు దళారుల దౌష్ట్యం లేకుండా చూడాల'ని భీష్ముడు ఏనాడో చెప్పాడు●

# 20. గివ్ ఫుడ్.. గివ్ ఫుడ్.. గివ్ ఫుడ్...

'**అ**న్నదానమే అన్నిటికన్నా మిన్న. ప్రజలను ఏలే ప్రభువులూ, సిరిసంపదలతో తులతూగే సంపన్నులూ యజ్ఞయాగాది క్రతువులు చేస్తూ నిరంతరం ప్రజలకు అన్నదానం చేయాలి. ఎక్కడా ఎవరూ ఆకలితో అలమటించకూడదు.

'ఉన్నవాళ్లు దానధర్మాలు చేయడంవల్ల వాళ్ళ సంపదలు పది మందికీ అక్కరకు వచ్చి లోకకళ్యాణం జరుగుతుంది. అంతేకాదు; సంపదంతా ఒకేచోట పోగుపడకుండా అంతటా సర్దుకోవాలంటే ఉన్నవాళ్ళు లేనివాళ్ళను చేరదీయాలి. అప్పుడే సంక్షేమరాజ్యం ఏర్పడుతుంది. అలా అని ఇది కేవలం సంపన్నుల బాధ్యత అని అనుకోకూడదు. సామాన్యులు కూడా ఎవరికి తగినట్టు వారు దాతలు కావాలి. ఎవరెంత చేదితే అంత నీరూరుతుంది మళ్ళీ బావిలో. వినలేదూ – 'శ్రియా దేయం' అంటోంది శృతి కూడా!' అని బోధ చేశాడు భీష్ముడు ధర్మరాజుకి.

చేతులారా అయినవాళ్లనూ, అన్నదమ్ముల్నీ చంపుకున్నాని ధర్మరాజు దిగులుపడుతుంటే, 'యజ్ఞయాగాలు చెయ్; దానధర్మాలు చెయ్; అన్నదానం చెయ్... అంతేగాని, మాటిమాటికీ ఇలా విచారించడం ఏమీ బాగాలేదు' అని మందలించాడు. శ్రీకృష్ణుడు కూడా 'దదాశ్వాన్నం దదాశ్వాన్నం దదాశ్వాన్నం యుధిష్ఠిర' అని సలహా ఇచ్చాడు.

In deed that is the essence of the entire teaching of Bhishma. Give Food! Give Food! Give Food!

'సమస్త భూతజాలం అన్నం మీదే ఆధారపడి జీవిస్తున్నాయి. అన్నం పెట్టేవాడే ప్రాణాలు నిలిపే వాడికింద లెక్క. ఈ లోకంలోనూ, పైలోకంలోనూ సుఖసంతోషాలతో ఉండాలనుకునేవారు నిరంతరం అన్నదానం చేస్తూండాలి'

అని చెప్పా డాయన. ఆ తరువాతే ధర్మరాజు తమ్ములతో కలిసి అశ్వమేధయాగం చేశాడు.

India was never callous about scarcity and hunger. ఆహార కొరత, ఆకలి అన్నవి ఇన్నాళ్లూ మనకు తెలీదు. అన్నబాహుళ్యం, అన్నదానం వంటివి మన ధార్మిక జీవనానికి ఆలంబనగా, పునాదులుగా నిలిచాయి. నిజానికి అన్నదాన మొక్కటే ముక్తి సోపానంగా, వైకుంఠానికి రాజమార్గంగా తలపోస్తూ వచ్చాం. అలాంటిది ఇప్పుడు ఈ దేశానికి ఆహారకొరత, పౌష్టికాహార లేమి, ఆకలి, దారిద్ర్యం పట్టుకున్నాయి. ప్రపంచంలోని ఇతర ప్రాంతాల ప్రజలు తీసుకునే స్టేపుల్ ఫుడ్స్‌తో పోలిస్తే మనం మూడింట ఒక వంతు తక్కువగా తీసుకుంటున్నామని అప్పుడెప్పుడో ప్రభుత్వమే చెప్పిన గణాంకలెక్కల్లో తెలిసింది. పాపం, మన పశువులకైతే పచ్చగడ్డీ, ఎండుగడ్డీ కూడా కరువే! They get almost no grass or roots at all. అయినా, మనం ఆహారసమృద్ధిని సాధించామనే చెప్పుకుంటున్నాం.

నవ్వుకోవాల్సిన విషయ మిది!

'ధర్మంతోనే శ్రేయస్సయినా, సుఖమైనా, సంతోషమైనా! ధర్మంతోనే వృద్ధి పొందేది ఎవరైనా! మంచి ఆరోగ్యం, శక్తి ఉంటేనే ధర్మాన్ని ఆచరించ గలుగుతాం. ఆరోగ్యం, శక్తి కావాలంటే మంచి ఆహారం, మంచి జీవనం ఉండాలి. అన్నమే లేనివాళ్లు, అమితంగా తినేవాళ్లు ధర్మాన్ని పోషించలేరు. యోగాన్ని ఆచరించలేరు. మితంగా తింటూ, శరీరాన్ని రక్షించుకుంటూ ప్రాణలు నిలుపుకోవటమే నిజమైన తపస్సు' అని కృష్ణుడు చెప్పాడు.

**అన్నమే లేనివాళ్లు, అమితంగా తినేవాళ్లు ధర్మాన్ని పోషించలేరు. యోగాన్ని ఆచరించలేరు. మితంగా తినాలి.**

మన ప్రజలందరూ కడుపునిండా తిని, హుందాగా బతికేందుకు కావాల్సిన వనరులన్నీ మన కున్నాయి. పుష్కలంగా

పండించడం, అందరం అనుభవించడం అన్నది కేవలం ఎకనామిక్స్‌తో ముడిపడిన విషయం కాదు. మన ధార్మిక జీవనం అంతా అందులో ఇమిడి ఉంది. 'అన్నం న నింద్యాత్' – అన్నాన్ని దూషించవద్దు; అన్నాన్ని నిర్లక్ష్యం చేయొద్దు. 'అన్నం బహుకుర్వీత' – అన్నాన్ని సమృద్ధిగా సేకరించండి; అందరికీ పంచండి అని చెప్పుకుంటూ వచ్చాం.

> **అన్నం అందరికీ దొరికిననాడు దోపిడీలూ, దొంగతనాలూ, ఒకరినొకరు చంపుకోవడాలూ ఉండవు.**

1996లో అనుకుంటాను, చెన్నైకు చెందిన 'సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్' వారు తిరుపతిలో 'అన్నం బహు కుర్వీత' అన్న విషయంమీద ఒక సదస్సు నిర్వహించారు. పలువురు పీఠాధిపతులు, మఠాధిపతులు, ఆచార్యులు అందులో పాల్గొన్నారు. 'అన్నిపాట్లూ అన్నంకోసమే! అన్నం అందరికీ దొరికిననాడు దోపిడీలూ, దొంగతనాలూ, ఒకరినొకరు చంపుకోవడాలూ ఉండవు. సుస్థిరశాంతి నెలకొంటుంది. సమ సమాజం ఏర్పడుతుంది. ఈ దిశగా పని చెయ్యాల్సిన బాధ్యత ప్రభుత్వాలది. వ్యవసాయభూముల్ని నివేశన స్థలాలుగా మార్చడం తగదు. బంగారంలాంటి పంటలు పండే భూములన్నీ ఇళ్ల స్థలాలుగానూ, పారిశ్రామిక వాడలుగానూ మారిపోతే మనకు అన్నం ఎక్కడనుంచి వస్తుంది? ఊసరక్షేత్రాలను మాత్రమే వ్యవసాయేతర కార్యక్రమాలకు వినియోగించాలి. సేద్యయోగ్యమైన భూములన్నిటిలో ఆహారధాన్యాలు పుష్కలంగా పండించి విరివిగా ప్రజలకు పంపిణీ చేయాలి. పౌరసరఫరా వ్యవస్థను పటిష్టం చేయాలి. శిబి చక్రవర్తులు, దానకర్ణులు వేలకు వేలుగా పుట్టుకు రావాలి' అని ఆ సదస్సులో పాల్గొన్న పెద్దలందరూ ఆకాంక్షించారు.

అయిన ఒకటి చెప్పనా!

ఇప్పటి మనుషులందరూ బోలు మనుషులు. ఈతకాయ వేసి తాటికాయ లాగాలని ఆశించే పరభాగ్యోపజీవులు. ఊరికే ఎవరికీ ఏదీ ఇవ్వరు. ఏదో ఒక లాభం ఉంటేగాని చెయ్యి విదల్చరు. 'మాతృదేవో భవ, పితృదేవో భవ, ఆచార్యదేవో భవ, అతిథిదేవో భవ' అన్న సనాతన ధర్మానికి నూకలు చెల్లి చాలా రోజు లయింది. యాచకులంటే ఇక చెప్పేదే లేదు. ఈసడిస్తాం, తిట్టిపోస్తాం. ఇల్లిల్లూ తిరిగే భిక్షకుడు మన ల్నేమీ యాచించడం లేదు. దాన మహిమను గురించి ప్రచారం చేస్తున్నాడు. పెట్టనిదే పుట్టదని, దానంవల్ల ఊర్ధ్వగతి కలుగుతుందని, మన మెప్పుడూ మరొకరి దగ్గరచెయ్యి చాచకుండా బతకాలని, చేతినిండా ఇచ్చే శక్తి మనకెప్పుడూ ఉండాలని భిక్షకులు మనల్ని ఆశీర్వదిస్తున్నారు. ఎవరొచ్చినా, లేదనకుండా, కాదనకుండా ఇచ్చి, ఇవ్వగలిగే శక్తిని వృద్ధి చేసుకోమని కోరుతున్నారు. వాళ్ళలా యాచకులు కావద్దని మనల్ని వేడుకుంటున్నారు.



రోమ్‌లో 'The Right to Food : A Challenge for Peace and Development in the 21st Century' అన్న విషయంమీద ఒక సెమినార్ జరిగింది. మనదేశానికి చెందిన ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఎమ్.ఎస్.స్వామినాథన్ ప్రారంభోపన్యాసం చేస్తూ 'ఆకలిని పారద్రోలేందుకు గ్రామస్థాయిలో కమ్యూనిటీ ఫుడ్ బ్యాంకులు ఏర్పాటు చేసి మొదట్లో కొన్నాళ్లు ప్రభుత్వాలూ, డోనార్ ఏజన్సీలూ గ్రాంటుగా ఆహారధాన్యాలు అందచేయాలి. క్రమంగా స్థానికంగా లభించే పౌష్టికాహారాన్ని అంటే ఎక్కువగా వినియోగంలోకి రాకుండా ఉన్న రాగి, మొక్కజొన్న, చమురుగింజలు వంటివాటిని అవి సేకరించుకోవాలి. అలా వాటి వినిమయాన్ని కూడా ప్రజల్లో పెంచాలి. అంతేకాదు; తుపానులు, వరదలు, భూకంపాలు, అతివృష్టి, అనావృష్టి వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఫుడ్ బ్యాంకులు ప్రజల ఆహార అవసరాలు తీర్చగలిగేలా ఉండాలి. అలా చేయడంవల్ల అత్యవసర పరిస్థితుల్లో ఆహారధాన్యాలను ఎక్కడెక్కడనుంచో వ్యవప్రయాసల కోర్చిరవాణా చేయాల్సిన అగత్యం కూడా ఉండదు' అని తమ అనుభవసారాన్నంతా రంగరించి ఒక సూచన చేశారు.

రోమ్‌లో ఆయన చెప్పిన ఈ మంచిమాట మనవాళ్ల చెవిన పడిందో, లేదో?!●

# 21. అతిథి సేవ

**'మా** ఇంటికొస్తే మాకేం తెస్తావు, మీ ఇంటికొస్తే మాకేమిస్తావు' అనేవాళ్లే ఎక్కువిప్పుడు. 'మాకాయుష్యం, మాకారోగ్యం' అన్నది వాళ్ళ నినాదం. వాళ్ళకోసమే ఈ కథ.

భీష్ముడు ధర్మరాజుతో అంటాడు : మనం బతికి ఎందరి బతుకులకు ఆధారంగా నిలుస్తున్నామని ఎవరికి వారు ప్రశ్నించుకోవాలి! మన బతుకు కేవలం మనం బతకడంతోనే పండిపోదు; మనం బతికి పదిమందినీ బతికించాలి. నీ ఇంటికి వచ్చేవాడికీ, నీ వాకిటి ముందు నిలిచేవాడికీ ఎంతో కొంత పెట్టి మిగిలింది నువ్వనుభవించు. అదీ ఔదార్యం! ఆకలి గొన్నవాడికి అన్నం పెట్టడం గొప్ప. అవసరం ఉన్నవాణ్ణి ఆదుకోవడం గొప్ప. వచ్చినవాడు శత్రువే అయినా, నీ ఇల్లు వెతుక్కుంటూ వస్తే వాణ్ణి అతిథిగా ఆదరించు. After all a tree does not withdraw its shade from those who come to it with the intention of cutting it down. It is the duty of all to offer hospitality to the one who comes to their house.

అసలు మనిషన్నాక దేవ మనుష్య భూత పితృ యజ్ఞాది పంచ మహాయజ్ఞాలనూ చేయాలి. చేయకపోవడం పాపం! తనకు మాలిన ధర్మం మొదలు చెడ్డ బేరం అన్నారు కాని, అతిథి సేవనం విషయంలో అది వర్తించదు. ఇతరులకు పెట్టాకే మనం అనుభవించాలి. ఇతరుల శేషం మనం గ్రహించాలిగాని, మన శేషం ఇతరులకీయడం మంచిది కాదు.

**ఇతరులకు పెట్టాకే మనం అనుభవించాలి. మన శేషం ఇతరులకీయడం మంచిది కాదు.**

కథలోకి వెళ్లాం.

*కపోతదంపతి కథ ఇది. The story of a host, who is happily ready to give up everything of his - including his very life to satisfy the hunger of his guest.*

**పొద్దుననంగా ఇల్లు వదిలివెళ్ళిన భార్య ఎక్కడ ఉందో, ఏమైపోయిందోనని దిగులుపడుతోంది కపోతం.**

*ఆకాశం నిండా కారుమబ్బులు. హోరుగాలి. కుండలతో కుమ్మరించినట్టు ఒకటే వాన. నీళ్ళతో ఎత్తుపల్లాన్నీ ఏకమయ్యాయి. ఆకాశం ఉరిమినప్పుడల్లా చెవులు బద్దలవుతున్నాయి. మెరుపులు కళ్ళను చీల్చుకుంటూ మెరుస్తున్నాయి. కిరాతుడికి భయం వేసింది.*

*రోజూ పక్షుల్నీ, జంతువుల్నీ వేటాడి చంపితినడం, అమ్ముకోవడం అతడి వృత్తి అయినా, ఆ రోజు మాత్రం ఆ బోయ దట్టమైన ఆ అడవిలో చిక్కుబడిపోయి, చీకట్లో దారితెన్నూ కానక, పులి నాకిన మేకపిల్లలా భయపడిపోతూ వణుకుతూ ఒక చెట్టుకిందకు చేరాడు. అక్కడ ఎత్తయిన ఒక బండమీద కూర్చుని, పక్కనే వలనూ, పక్షుల్ని పట్టే సాధనాలనూ పెట్టుకున్నాడు. అతడికి వంటినిండా బట్టలు కూడా లేవు. చలి చంపేస్తోంది. 'రక్షించు దేవుడా' అని పెద్దగా దణ్ణాలు పెట్టుకుంటూ ముడుచుకుపోయి కూర్చున్నాడు. చెట్టుమీద ఉన్న ఒక కపోతం అలికిడి గ్రహించి కిందకు తొంగిచూసింది. అప్పుడే తళుక్కున ఒక మెరుపు మెరిసింది. ఆ వెలుగులో అది కిరాతుణ్ణి చూసింది. పొద్దుననంగా ఇల్లు వదిలివెళ్లిన భార్య ఎక్కడ ఉందో, ఏమైపోయిందోనని దిగులుపడుతున్న సమయంలో కిరాతుడు కనిపించేసరికి కపోతానికి అంత గాలివానలోనూ ముచ్చెమటలు పోశాయి. 'అసలు బతికి ఉందో, లేదో? వీడిలాంటి కిరాతుడు ఎక్కడైనా పట్టాడో, ఏమో? ఈ వర్షానికీ, హోరుగాలికీ ఎక్కడ చిక్కుబడిందో? అది లేకుండా నేను బతకలేను. అయ్యో... ఏం చెయ్యను?' అని దుఃఖంతో ఆక్రోశించాడు. అతని ఏడుపు అతని ప్రియురాలికి వినిపించింది.*

'ఇక్కడున్నాను.'

కపోతం తన భార్య గొంతు వింటూనే 'ఎక్కడ? ఎక్కడున్నావు?' అని ఆదుర్దాగా అడిగింది.

'ఇదిగో, మన చెట్టుకిందే! ఈ బోయవాడి వలలో ఉన్నాన!!'

'అయ్యో వలలో చిక్కావా? ఇప్పుడెలా?'

'బాధపడకు ఉదయం మేతకోసం వెళ్లిన నేను ప్రమాదవశాన ఇతని వలలో చిక్కుకున్నాను. ఏమీ చెయ్యలేని స్థితిలో ఉన్నాను. అదృష్టమేమిటంటే, ఈ కిరాతుడి చేతిలో చావబోయేముందు కడసారిగా నిన్ను చూడగలిగాను. భగవంతుడే ఈ అవకాశం మనకు కల్పించాడు. లేకపోతే ఈ బోయ మనం నివాసం ఉంటున్న చెట్టుకిందకే ఎందుకు రావాలి? పాపం ఇతను ఆర్తుడై ఆపదలో ఉన్నాడు. చలితో బాధపడుతూ కొంకర్లు పోతున్నాడు. ఇతనికి



చేతనైన సహాయం చెయ్యి. అతిథి సేవలో అవధులు లేని ఔదార్యం చూపే నేలమీద పుట్టాం మనం. శరణాగత రక్షణాన్ని మించిన ధర్మం లేదు. శత్రువైనాసరే, మన ఇంటికి వస్తే మనం ఆదరించాలి' అని కర్తవ్యబోధ చేసింది.

**'దాచిపెట్టుకునే ఆహారం పక్షులదగ్గర ఏముంటుంది? ఆకలేసినప్పుడు ఏది దొరికితే అది తింటాం మేము'**

కపోతం వెంటనే చెట్టు దిగివచ్చి బోయవాడి ఎదుట నిలబడి, 'అయ్యా! నేను ఈ చెట్టుమీద ఉంటున్నాను. నువ్వు మా ఇంటికి అతిథిగా వచ్చావు. చూడబోతే బాగా అలసిపోయినట్టున్నావు. నీకేం కావాలో చెప్పు. చేతనైన సేవలు చేస్తాను' అంది.

బోయవాడు ఆ అరణ్యంలో తన గోడు వినే దిక్కు లభించినందుకు సంతోషిస్తూ, 'ఓ పావురమా! దుర్భరమైన ఈ చలితో చచ్చిపోయేట్టున్నాను. ఎలాగైనా సరే నన్ను రక్షించు' అని వేడుకున్నాడు.

కపోతం సరేనని చెట్టుమీదకు ఎగిరివెళ్లి కొన్ని ఎండుపుల్లలు ముక్కున కరుచుకుని వచ్చింది. వాటన్నింటినీ ఓ రాతిమీద పోగుపెట్టి మంట చేసింది. బోయవాడు మంటదగ్గర కూర్చుని హాయిగా ఒళ్లంతా కాచుకున్నాడు. 'గువ్వా! నువ్వెంత మంచిదానవు!' అని కపోతాన్ని మెచ్చుకున్నాడు. ఒళ్లు వేడెక్కేసరికి ఆకలి వేసింది అతనికి. 'గువ్వా! నాకు ఆకలేస్తోంది' అన్నాడు.

కపోతం ఆ మాట విని, 'అయ్యా! దాచిపెట్టుకునే ఆహారం పక్షులదగ్గర ఏముంటుంది? ఆకలేసినప్పుడు ఏది దొరికితే అది తింటాం మేము. ఆకలిగా ఉందని నోరు తెరిచి అడిగావు గనుక నా శరీరం ఆహారంగా ఇస్తాను. తీసుకో!' అని అగ్నికి ముమ్మారు ప్రదక్షిణం చేసి అందులో దూకింది. అది చూసి బోయవాడు ఆశ్చర్యపోయాడు. 'ఆహా! ప్రపంచంలో ఇంతటి దయామూర్తులు కూడా ఉంటారా?' అనుకున్నాడు. 'ఈ పక్షి నాకోసం తన శరీరాన్నే సంతోషంగా త్యాగం చేసింది. మరి నేనో? పాపాత్ముణ్ణి! పుట్టినప్పటి

నుంచీ ఒక ప్రాణిని బాధించడమేకాని, రక్షించింది లేదు. నాదీ ఒక బతుకే!? ధర్మంకోసం తన శరీరాన్ని అగ్నికి ఆహుతి చేసిన ఈ గువ్వే నాకు గురువు. ఈ రోజు నుంచి ఇక జీవహింస చెయ్యను. పుణ్యకార్యాలు చేస్తూ నా పాపాలన్నీ పోగొట్టుకుంటాను' అనుకుని వలలో ఉన్న పక్షులన్నిటినీ విడిచి పెట్టేశాడు.

వెంటనే కపోతి అగ్నిదగ్గరకు వెళ్ళి కాలిపోతున్న తన భర్త శరీరం చూసి పెద్దగా ఏడ్చింది. 'నిన్ను విడిచి నేను బతకలేను. నీతోనే వస్తాను. నా శరీరం కూడా ఇతనికి ఆహారంగా ఇస్తాను' అంటూ ఆ కపోతి అగ్నిని మరింత పెద్దదిచేసి తన భర్తను తలుచుకుంటూ అందులోకి దూకింది. బోయవాడు అదంతా చూస్తూ రెప్పవెయ్యకుండా నిలబడిపోయాడు. ఇంతలో ఆ పక్షిదంపతులు దేవతారూపులై దేదీప్యమానంగా ప్రకాశిస్తూ అప్సరసల అభినందలు అందుకుంటూ ఒక దివ్య విమానంలో వెళ్ళిపోవడం కూడా బోయ చూశాడు. 'నేను ఇలాగే నా జన్మను చరితార్థం చేసుకుంటాను' అనుకుంటూ ఆ బోయవాడు అరణ్యమార్గాన నడక సాగించాడు. అప్పు డతనికి ఆకలిదప్పుల్లేవు. కోరిక ల్లేవు. మోసం లేదు, ద్వంద్వాల్లేవు, మమకారా ల్లేవు. నడుస్తున్నాడు.

రాళ్లతో కాళ్లచర్మం పగిలింది. ముళ్ళు గుచ్చుకుని పాదాలు రెండూ మోదుగుపూలయ్యాయి. అయినా, చింతాకంత బాధ కూడా లేదు. పరమేశ్వర ధ్యానంలో తనను తాను మరచిపోయి నడుస్తున్నాడు. అలా వెళ్తూ వెళ్తూ ఉండగా ఒకచోట అరణ్యాన్నంతా అలుముకుని దహిస్తున్న దావానలం కనిపించింది. నిర్మలమైన మనస్సుతో ఆ అగ్నిలో ప్రవేశించాడు బోయ.

అతని శరీరం బూడిదైంది. ఆత్మ దేవత్వం పొంది దివ్యవిమాన మెక్కి వెళ్ళిపోయింది ●

# 22. స్పిరిచువాలిటీ కోషెంట్

‘**కా**మ క్రోధ లోభ మోహ మద మాత్సర్యాలనే ఆరింటినీ అరిషడ్వర్గాలంటారు. సంకల్పం వల్ల కామం పుడుతుంది. దేహం వట్టి మాంసపుముద్ద అనీ, చీము, నెత్తురు నరాలతో నిండి అసహ్యంగా ఉంటుందనీ తెలుసుకుంటే కామం నశిస్తుంది. ఇతరులు చేసిన కీడువల్ల మనలో క్రోధం కలుగుతుంది. శాంతం వహించి ఆలోచిస్తే అది కాస్తా పోతుంది. చుట్టూ ఉన్న వస్తువులూ, సకలభూతాలూ శాశ్వతం అనుకోవడంవల్ల లోభం పుడుతుంది. ఏవీ శాశ్వతం కావని తెలుసుకుంటే దేనిమీదా లోభం ఉండదు. అజ్ఞానం వల్ల మోహం కలుగుతుంది. ధర్మం తెలుసుకుంటే అది నశిస్తుంది. **డబ్బువల్ల, అధికారంవల్ల, గొప్ప వంశంలోనో, కులంలోనో పుట్టాము అన్న భావనలవల్ల, భ్రమలవల్ల అతిశయం కలుగుతుంది.** వాటి అసలు స్వరూపం తెలిస్తే ఆ గర్వం పోతుంది.

‘సాత్వికుడు కానివాడికి మాత్సర్యం కలుగుతుంది. సద్గురువును సేవించడంవల్ల ఆ దుర్గుణం తొలగుతుంది. మానవులకు కలిగే కీడు కంతటికీ ఈ ఆరుగుణాలే కారణం. వీటివల్లే చెడిపోతారు. దీనికితోడు మనిషిని నిలబడనీయకుండా సత్వ, తమో, రజోగుణాలు తోడేళ్లలా పీక్కుతింటుంటాయి. అదే మాయ. ధ్యానంతోనూ, నిశ్చలమైన మనస్సుతోనూ, నిష్ఠతోనూ, వైరాగ్యంతోనూ ఈ మాయను వదిలించుకోవాలి. అలా వదిలించుకోగలిగిన వాడు ధన్యుడు. ప్రతి జీవిలో పరమాత్ముడు ఉన్నాడు. ఆత్మకు అజ్ఞానం అడ్డుపడితే ఆయన

**డబ్బువల్ల, అధికారంవల్ల, గొప్ప వంశంలోనో, కులంలోనో పుట్టాము అన్న భావనలవల్ల, భ్రమలవల్ల అతిశయం కలుగుతుంది.**

కనిపించదు. మురికినీళ్లలో చూసుకుంటే మనకు మన ప్రతిబింబం ఎలా కనిపించదో, అలాగే మనస్సు కోరికలతో కలతబడితే మనల్ని మనం తెలుసుకోలేం. మన లోపలి వెలుగును మనం చూడలేం. నిర్మలచిత్తులకే ఆయన కనిపిస్తాడు. అంటే ఇంద్రియాలను జయించాలి. నియమనిష్ఠలతో చిత్తాన్ని శాంతింప చేసుకోవాలి. మనస్సును అద్దంలా ఉంచుకోవాలి. అప్పుడే ఆ వెలుగు కనిపిస్తుంది. జ్ఞానులెవరూ మోహబంధాలు పెంచుకోరు.

'పంచభూతాలకూ, ఇంద్రియాలకూ, త్రిగుణాలకూ, సర్వప్రపంచానికీ అహంకారమే ఉనికిపట్టు. అహంకారం వల్లే కర్మలు కలుగుతాయి. కర్మలవల్లే జన్మలు కలుగుతాయి. జన్మమంటే మరేంలేదు; పుట్టటం, గిట్టటం. తల్లి గర్భంలో మలమూత్రాల్లో తొమ్మిది మాసాలు పెరిగి అతికష్టం మీద బయటకు వచ్చి మళ్ళీ తాపత్రయాలూ, బంధాలూ పెంచుకుని సంసారంలో చిక్కుబడి చస్తూ పుడుతూవుంటారు మనుషులు. దీని కంతటికీ మూలం తృష్ణ. తృష్ణకు మూలం కామం. కనుక ఇంద్రియాలను బుద్ధితో అణచగలిగినవాడు విజ్ఞానవంతుడు. అతనే శ్రేష్ఠుడు. అలాంటివాళ్లకు కోర్కెలూ ఉండవూ;



మళ్ళీ జన్మా ఉండదు. విజ్ఞానం మనిషికి నేత్రం లాటిది. అది లేనివాడి నడవడి గుడ్డివాడి నడక లాంటిది. లోకంలో అనుక్షణం కంటికి కనిపిస్తున్న పుట్టుకలూ, చావులూ, రోగాలూ, ముసలితనం, ఇవన్నీ చూసైనా మనుషులు ఎందుకు బుద్ధి తెచ్చుకోరో! ఇంతకీ చెప్పదలుచుకున్న దేమిటంటే, బ్రహ్మచర్యం అవలంబిస్తూ, మనస్సునీ, వాక్కునీ, శరీరాన్నీ శుచిమార్గంలో నడుపుకునే వాళ్ళకు సులువుగా పరమపదం లభిస్తుంది' అని భీష్ముడు పాండు కుమారులకు చెప్పాడు.

**ఎప్పుడైతే విషయసుఖాలు అంటవో అప్పుడు జ్ఞానగంగ పెల్లుబుకుతుంది. సర్వ జీవులపట్ల అనుకంపన కలుగుతుంది.**

'తాతగారూ! నిర్మలమనస్కులకు ఇంకా ఏమేం సిద్ధిస్తాయో చెప్పరూ?' అని అడిగారు అన్నదమ్ములైదుగురూ.

'నాయనలారా! ఒక్కోప్పుడు మనస్సుకు ఉన్నట్టుండి సంతోషం, శాంతి కలుగుతాయి. అవి సత్త్వగుణలక్షణాలు. మరోసారి విచారం, అశాంతి, దుఃఖం కలుగుతాయి. అవి రాజసలక్షణాలు. పనికిమాలిన ఆలోచనలు రావడం, సోమరితనం, ఏమరుపాటుగా ఉండడం, భ్రమపడడం మొదలైనవి తమోగుణలక్షణాలు. వీటిల్లో పడకుండా ఎల్లప్పుడూ ఆత్మానందం అనుభవించేవాళ్ల పరిస్థితే వేరు. 'నీ రాజధాని మిథిల కాలిపోతోందయ్యా' అని గావుకేకలు పెట్టినా, జనకమహారాజు చలించలేదంటే ఇదే కారణం. కర్మబంధాన్ని తోసిపుచ్చే విజ్ఞానవంతులు మేలిమి బంగారంలా ప్రకాశిస్తారు. ఎప్పుడైతే విషయసుఖాలు వాళ్ళను అంటవో అప్పుడు వాళ్ళల్లో జ్ఞానగంగ పెల్లుబుకుతుంది. సర్వజీవులపట్ల అనుకంపన కలుగుతుంది. మమకారాలూ గాలికెగిరిపోతాయి. నేను, నాది అన్న అజ్ఞానం తొలగుతుంది. బీరాలూ, గర్వాలూ సమసిపోతాయి. నిశ్చలతత్వం, కర్తవ్యదీక్ష, అందరినీ

సమాదరించాలన్న సద్బుద్ధి, వినయం, వివేకం అన్నీ కలుగుతాయి, అన్నీ వెలుగుతాయి' అని చెప్పాడు భీష్ముడు.

ఈ మధ్యనే చదివాను : చెన్నయ్‌లోని మహర్షి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మానేజ్‌మెంట్‌లో వేదిక్ మానేజ్‌మెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఇయాన్‌బ్రౌన్ లీడర్‌షిప్ సక్సెస్‌కు పనికొచ్చే కొన్ని 'టిప్స్' చెప్పారు. చిట్టి సలహాలవి. కాని, కొండంత మేలు చేస్తాయి. కార్యనిర్వాహకులు తమ స్వభావాల్లో గల అంతశ్చేతన, అననుకూల అంశాలను తొలగించుకుంటూ స్వచ్ఛమవుతున్నకొద్దీ వాళ్ల ఆలోచనలూ, వాళ్ళ చర్యలూ అభివృద్ధికి దోహద చేసే కొన్ని మౌలికలక్షణాలను వ్యక్తం చేస్తుంటాయని ఇయాన్‌బ్రౌన్ చెప్పారు. పనులలో సృజనాత్మకత (క్రియేటివిటీ), ఆలోచనల్లో స్థిరత్వం (స్టెబిలిటీ) సమగ్రదృష్టి, మంచిచెడులను వేరుచేసి చూడగల నేర్పు, కొత్తసందర్భాలలో సర్దుబాటు ధోరణి (ఎడాప్టిబిలిటీ) అలవడినకొద్దీ అభివృద్ధిని సాధించడం సులభమవు తుందని ఆయన తెలియజేశారు. ఇరవయ్యవ శతాబ్దపు తొలినాళ్లలో 'ఇంటెలిజెన్స్ కోషెంట్'కి ఎక్కువ ప్రాధాన్యమిచ్చేవారు. అంటే మేధను కొలవడమన్నమాట. అదే శతాబ్దపు చివరి దశకానికి వచ్చేసరికి 'ఎమోషనల్ ఇంటెలిజెన్స్'కి ప్రాముఖ్యం హెచ్చింది. ఇప్పుడు ఆ రెండింటితోపాటు 'స్పిరిచువాలిటీ కోషెంట్' కూడా ప్రముఖంగా రంగం మీదకు వచ్చింది. ఐక్యు, ఇక్యు, ఎస్‌క్యుల సమాహారమే మనిషిని విజేతగా నిలబెడుతుందని శాస్త్రీయపరిశోధనలు కూడా తేల్చాయి.

**ఐక్యు, ఇక్యు, ఎస్‌క్యుల సమాహారమే మనిషిని విజేతగా నిలబెడుతుందని శాస్త్రీయ పరిశోధనలు కూడా తేల్చాయి.**

ఇన్నాళ్లూ 'ది బిజినెస్ ఆఫ్ ఈజ్ ఓన్లీ బిజినెస్' అని చెబుతూ వస్తున్న ఆధునిక కార్పరేట్ సిద్ధాంతాలు ఆధ్యాత్మికతకు ఎక్కడా చోటు పెట్టలేదు. అయితే, మనం చాలా గొప్పగా భావించే అమెరికన్ కార్పొరేట్

కారిడార్లలో ఇటీవల స్పిరిచువాలిటీని గురించిన స్పృహ కలిగింది. ఆ వెనుకనే జరిగిన పరిశోధనల ఫలితంగా దాని తాలూకు అవగాహనా పెరిగింది. ఆధ్మాత్మికతను సక్సెస్‌కి సరైన వాహికగా అమెరికన్లు గుర్తించారు. ఈ నేపథ్యంలోంచి వెలువడిన 'ది సెవెన్ స్పిరిచువల్ లాస్ ఆఫ్ సక్సెస్', 'ది సెవెన్ హ్యాబిట్స్ ఆఫ్ హైలీ ఇఫెక్టివ్ పీపుల్' వంటి పుస్తకాలు అత్యధికంగా అమ్ముడవుతున్నాయి.

మానవసమాజం అభివృద్ధి చెందుతూ వస్తున్న శతాబ్దాల పరంపరలో కళ, విజ్ఞానం, మతం వంటి మౌలికాంశాలను వేటికవిగా విడదీసి అభివృద్ధి చేసుకోగలిగాం. ఇప్పుడు మనముందున్న అవసరం ఏమిటంటే, స్పిరిచువాలిటీని మేనేజ్‌మెంట్‌తో జతచేసి విజయాన్ని సాధించడం.

మతదృష్టి వేరు, ఆత్మావలోకనం వేరు. ఇప్పటి ఎగ్జిక్యూటివ్‌లు తమలోకి తాము చూసుకోవడమే కాదు; తమకింద పనిచేసే సిబ్బంది, తోటి భాగస్వాములు, సహచరులు, కస్టమర్ల ఆత్మల్లోకి కూడా తొంగిచూడగలగాలి. బాసులు, బిగ్‌బాసులు ఎప్పుడైతే తాము అందరికంటే అధికులమన్న అహంకారాన్నీ, అభిజాత్యాన్నీ, ఆధిపత్యధోరణినీ, చెలాయించి చేయించుకోవాలనే వైఖరినీ విడవగలుగుతారో ఆ నిముషాన అసంకల్పితంగానే సహచరుల ఆత్మలను తాకగలుగుతారు ●

# 23. బాహ్యదృష్టి - అంతర్దృష్టి

'మనిషి మనిషిగా బతకడంలోనే అందం ఉంది. ప్రతి మనిషీ అంతర్ దృష్టిని సాధించాలి. బహిర్దృష్టిని వదులుకోవాలి. గుణాత్మక విలువలకే ప్రాధాన్యం ఇవ్వాలి. భగవంతుడు మెచ్చేది దీన్నే!' అని చెప్పాడు భీష్ముడు.

ఈ మధ్యనేదో మాటల సందర్భంలో మా మనవడికేం అప్సరసలా ఉంటాడ'ంది మా అత్తగారు. అందం విషయంలో 'మా అత్తగారికి జెండర్ డిఫరెన్స్ లేదు. ఆడవాళ్లనైనా, మగవాళ్లనైనా అప్సరసలతో పోల్చేస్తూంటుంది.

అసలు అందం అంటే ఏమిటి?

మానసిక సౌందర్యం! మానసిక పరిశుద్ధత! స్వచ్ఛంగా, స్పష్టంగా, తేటగా, ఆరోగ్యంగా ఉండడం! పైపై మెరుగులు ఎన్నైనా ఎరువు తెచ్చుకోవచ్చు. కాని, అంతర్గత సౌందర్యం, అంతర్గత సంస్కారం మాటేమిటి? ఇన్నెందుకు? అష్టావక్రుడి కథొకటి చెబితే చాలు. సర్వం మీకే బోధపడుతుంది.

ఉద్దాలక మహర్షి శిష్యుడు కహోలుడు. కహోలుడి కుమారుడు అష్టావక్రుడు. కహోలుడు మంచివాడేకాని, నిలకడలేని మనిషి. అందువలన ఏ విద్యా పూర్తిగా నేర్చుకోలేకపోయాడు. అయినప్పటికీ ఉద్దాలకుడు తన కూతురు సుజాత నిచ్చి పెళ్ళిచేశాడు. తల్లి కడుపులో ఉన్నప్పుడే తాతగారు చదివే వేదాలన్నీ విని సంపూర్ణంగా నేర్చుకున్నాడు అష్టావక్రుడు. అయితే, అంత సుబుద్ధికీ, సూక్ష్మగ్రాహికీ ఆ పేరెలా వచ్చిందంటే - తండ్రి కహోలుడు అరకొరగా చదువుకున్న చదువుతో వేదాధ్యయనం చేస్తూ అనునిత్యం దొర్లించిన అపశబ్దాలు వినలేక తల్లి కడుపులో

> **పెద్దలూ, పండితులూ, విద్వాంసులూ దారిన పోతుంటే రాజైనా సరే వారిని పక్కకు తొలగిపొమ్మనకూడదు.**

ముడుచుకుపోయి ఎనిమిది వంకర్లతో పుట్టాడు గనుక అతనికి అష్టావక్రుడని పేరొచ్చింది.

‘అనాకారివి కాబట్టి నీ రూపం మాకు నవ్వు తెప్పించింది. మరి మమ్మల్ని చూసి నీకెందుకు నవ్వొచ్చింది?’

ఒకసారి జనక మహారాజు మిథిలా నగరంలో చాలా గొప్ప పండితసభను ఏర్పాటు చేశాడు. ఆ సభకు అనేకమంది పండితులొచ్చారు. వాళ్లంతా శాస్త్రాలూ, దర్శనాలూ, వేదాలూ బాగా చదువుకున్నవాళ్ళు. వాదప్రతివాదాల్లో ఆరితేరినవాళ్ళు. అటువంటి వాళ్ళతో పోటీపడేందుకు వచ్చాడు అష్టావక్రుడు.

అందం చందం లేనివాడు, అవిటివాడు, పైగా వయసులో చిన్నవాడూ కావడంచేత అష్టావక్రుణ్ణి రాజభటులు లోపలకు పోనివ్వలేదు. అయినా, అతడు నిరాశ చెందకుండా అక్కడే నిలబడ్డాడు. సభలో పాల్గొనేందుకు వచ్చిన పండితు లందరూ లోపలికి వెళ్ళాక అష్టావక్రుడు రాజభటుల దగ్గరకు వెళ్లి ‘నాయనలారా! వికలాంగులకూ, స్త్రీలకూ ఎంతటివారైనా తప్పుకుని దారి ఇవ్వాలి. పెద్దలూ, పండితులూ, విద్వాంసులూ దారిన పోతుంటే రాజైనా సరే వారిని పక్కకు తొలగిపొమ్మనకూడదు. ఇది నేను చెబుతోంది. కాదు. శాస్త్రం చెబుతోంది. నేను విద్వాంసుణ్ణని చెప్పను కానీ కొద్దో గొప్పో వేదాలు చదువుకున్నాను. శాస్త్రం తెలుసుకున్నాను. దానికితోడు అవిటివాణ్ణి, అర్భకుణ్ణి. దయవుంచి నన్ను లోపలికి పోనివ్వండి’ అని బతిమాలాడు. ఇదంతా ఒక పండితుడు విన్నాడు. విన్నదంతా మహారాజుకు విన్నవించాడు. ‘తక్షణం ఆ బాలకుడిని లోపలకు ప్రవేశపెట్టండి’ అని జనకుడు భటుల్ని ఆజ్ఞాపిస్తూనే తాను కూడా సింహాసనం దిగి వెళ్ళాడు. అప్పటికింకా ద్వారపాలకుడితో అష్టావక్రుడి వాదన సాగుతూనే ఉంది. ‘దేనికైనా గుణమే ప్రధానం కాని, కంటికి కనిపించే రూపం ముఖ్యం కాదు. ఆకారాన్నిబట్టి విలువ కట్టడం తెలివైన పనికాదు. బాహ్యరూపం భ్రమ కలిగించవచ్చు.

అంతర్‌దృష్టి ఎప్పుడూ మనిషిని మోసం చెయ్యదు’ అంటున్నాడు అష్టావక్రుడు. మహారాజు అది విని ముచ్చటపడి గిర్రున వెనక్కి తిరిగి సభలోకి వెళ్ళిపోయాడు.

ఆయన వెనకే అష్టావక్రుడూ వచ్చాడు.

అతన్ని చూసి అక్కడున్న పండితు లందరూ గొల్లున నవ్వారు. జనక మహారాజు మాత్రం చాలా గంభీరంగా, జరుగుతున్న నాటకమంతా చూస్తూ కూర్చున్నాడు. సభలో అవహేళనలూ, అపహాస్యాలూ, వెకిలినవ్వులూ తారాస్థాయిలో సాగుతున్నాయి. అష్టావక్రుడు చాలాసేపు అవన్నీ విని విని, అతను కూడా ఉన్నట్టుండి పెద్దగా నవ్వడం ప్రారంభించాడు.

పండితులందరూ విస్తుపోయి ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు. అతనెందుకు అలా పలగలబడి నవ్వుతున్నాడో వాళ్లకు అర్థం కాలేదు. ఒక మహాపండితుడు లేచి అష్టావక్రుణ్ణి ఉద్దేశించి ‘అవిటివాడివీ, అనాకారివీ కాబట్టి నీ రూపం మాకు నవ్వు తెప్పించింది. మేము నవ్వాం. కాని, నువ్వెందుకు నవ్వుతున్నావో మాకు తెలీడం లేదు. మేమందరం విద్వాంసులం.



కవిపండిత ప్రముఖులం. జ్ఞానప్రభతో వెలుగుతున్న వాళ్ళం. బ్రహ్మవర్చస్సుతో అజరామరఖ్యాతితో విలసిల్లుతున్నవాళ్ళం. మరి మమ్మల్ని చూసి నీకెందుకు నవ్వొచ్చింది?' అని అడిగాడు.

అష్టావక్రుడు ఈసారి ఇంకా పెద్దగా నవ్వాడు. 'నే నిక్కడేదో గొప్ప సభ జరుగుతోందని, ఇందులో పాల్గొనే వాళ్లందరూ మహనీయులూ, వాఙ్మయ తపస్సు చేసినవాళ్ళూ అయి ఉంటారని, అత్యున్నత శాస్త్ర చర్చలేవో చేస్తారని భ్రమపడి, అందులో నేనూ పాల్గొనాలని వచ్చాను. కాని, ఇక్కడ ఉన్నవాళ్ళందరూ చర్మకారుల్లా ఉన్నారు. అందుకని నవ్వుతున్నాను' అన్నాడు.

అది విని పండితులందరూ ఆగ్రహోదగ్రులయ్యారు. తమను చర్మకారులతో పోల్చినందుకు వాళ్లంతా నిరసన తెలిపారు.

జనకుడు తమాషా చూస్తున్నాడు.

అప్పుడు అష్టావక్రుడు వారితో, 'చర్మకారులకు మాత్రమే ఏ చర్మం మంచిదో, ఏ చర్మంతో ఏ వస్తువు తయారుచేయవచ్చో తెలుస్తుంది. మీరు నన్ను చూస్తూనే నవ్వారంటే మీకు కూడా చర్మమర్మం తెలిసి వుండాలి. మీరు మనుషుల పాండిత్యంకన్నా చర్మాల వాసన బాగా పసిగట్టగలరని తెలిసి నవ్వాను. తప్పేముంది? ఒక్కమాట గుర్తుంచుకోండి. పండితులైనవారికి అంతర్దృష్టి ఉండాలి కానీ, బాహ్యదృష్టి పనికిరాదు. సామాన్యుల్లా మీరు కూడా దేహ సౌందర్యానికీ, ఆర్భాటాలకూ ప్రాధాన్యమిస్తే అసలైన ప్రతిభకు పట్టం కట్టేదెవరు?' అని అడిగాడు.

దానితో అక్కడ ఉన్న వాళ్ళందరూ సిగ్గుపడి తలలు వాల్చేసుకున్నారు. జనకుడు అష్టావ్రకుణ్ణి అభినందించి ఘనంగా సత్కరించాడు.

అదీ కథ! ●

# 24. క్రియేటివిటీ ఉండాలి

'**దా**నం, భోగం లేకపోతే ధన మెందుకు? శత్రువుల్ని జయించకపోతే శౌర్య మెందుకు? ధర్మమార్గం అవలంబించకపోతే వివేక మెందుకు? జితేంద్రియుడు కాకపోతే ఆత్మజ్ఞానం ఎందుకు? సృజనశీలత, క్రియాశీలత లేకపోతే అసలు బతుకెందుకు? అని నిగ్గదీస్తోంది భారతం.

ముంబయిలో ఒకసారి గురుచరణ్‌దాస్ అనే మేనేజ్‌మెంట్ గురు 'క్రియేటివిటీ అండ్ ఎంట్రప్రెన్యూర్‌షిప్' అనే విషయంమీద మాట్లాడుతూ, నత్తనడక నడుస్తూన్న భారతీయ సంస్థల్లో సక్సెస్‌పుల్ ఎంట్రప్రెన్యూరల్ బేస్ ఏర్పాటు కావాలంటే సృజనశీలురు కార్యనిర్వాహకులుగా ఉండాలని ఘంటా పథంగా చెప్పారు.

మనకున్న క్రియేటివ్ ఎబిలిటీస్ అపారం. అయితే, వాటిని సమర్థంగా వినియోగించుకోడంలో మనం వెనుకబడి ఉన్నాం. ఆలోచనలను ఆచరణలోకి అనువదించేవాళ్లే తెలివైనవాళ్లు. అలా చేసేవాళ్లే కార్యశూరులు. శౌర్యంలేని రాజుకు గజ తురగ రథ పదాతిదళాలు ఉండిమాత్రం ఏం లాభం? అలాగే క్రియేటివ్ ఎబిలిటీస్ ఉన్నా, ఎగ్జిక్యూషన్ ఎబిలిటీస్ లేకపోతే ఏం ప్రయోజనం? ఇన్నాళ్లూ మనకు బుద్ధిశాలులమనీ, ఆలోచనాపరులమనీ మంచిపేరుంది. ఇప్పుడు ఆచరణ శీలురం కూడా కావాలి. నిజానికి సృజనకూ, సోమరితనానికి స్నేహం కుదరదు. సోమరికి ఏదీ లభించదు. ఒకవేళ లభించినా, దాన్ని రక్షించుకోలేడు. రక్షించుకున్నా అది వృద్ధి పొందదు. కనుక ఆచరణ శీలురం కూడా కావాలంటే

> **నిజానికి సృజనకూ, సోమరితనానికీ స్నేహం కుదరదు. సోమరికి ఏదీ లభించదు. ఒకవేళ లభించినా, వృద్ధి పొందదు.**

సోమరితనాన్ని పక్కకు పెట్టి ఉన్న తెలివితేటల్నీ, సృజనశక్తినీ వినియోగించుకుంటూ కార్యరంగంలోకి దూకాలి. అప్పుడే అనుకున్నవి అనుకున్నట్టు సాధించ గలుగుతాం. అయితే, ఒకటుంది : కార్పొరేట్ రంగంలో సృజన వెల్లివిరియాలంటే, అందుకు తగిన వాతావరణం కూడా ఉండాలి. సుశిక్షితులైన సైనికుల్లా అందరూ క్రమశిక్షణతో, అంకితభావంతో, నిజాయితీతో, ఆత్మవిశ్వాసంతో పనిచేసే చోట, ఎంచుకున్న పనిని పిచ్చిగా ప్రేమించేవాళ్ళు వున్నచోట, నిర్దేశిత లక్ష్యాలు, లక్ష్యాలలో క్లారిటీ, ఆరోగ్యకరమైన పోటీ, నిపుణతకు మన్నింపు – వీటన్నింటికీ తోడు ఆలోచనలను అద్భుతంగా కమ్యూనికేట్ చేయడం చేతనైన వాళ్ళుంటే 'సృజన' బతుకుతుంది. ఏ పనైనా ఒకింత సింప్లిసిటీ, ఒకింత హాస్య చతురతతో జరిగితే చాలు విజయం మనదే.

**హైదరాబాదు సమీపంలోని శిల్పారామాన్ని చూసారా మీరు? అచ్చమైన ఆంధ్రసంస్కృతికి అపురూప నీరాజనంలా ఉంటుంది.**

'Creativity should be tagged with simplicity and crispness in communication' అని చెప్పారు శ్రీ గురుచరణ్‌దాస్. చెప్పదలుచుకున్నది స్పష్టంగా, సూటిగా చెప్పాలి. క్రిస్పనెస్ ఇన్ కమ్యూనికేషన్‌వల్ల సౌండ్ మేనేజ్‌మెంటుకు పునాదు లేర్పడతాయి.

యాజమాన్యం ఏమనుకుంటోందీ, ఏం చెయ్యాలనుకుంటోందీ క్లుప్తంగా, సూటిగా చెప్పడంవల్ల ఊహాగానాలకు, రకరకాల వ్యాఖ్యలకు తావుండదు. మేనేజ్‌మెంటుకీ, సిబ్బందికీ మధ్య సహకారం, సఖ్యత ఏర్పడతాయి. **హైదరాబాదు సమీపంలోని శిల్పారామాన్ని చూసారా మీరు? అచ్చమైన ఆంధ్రసంస్కృతికి అపురూప నీరాజనంలా ఉంటుంది.** చెట్లతో, కొమ్మలతో, రెమ్మలతో వాటి నల్లుకున్న పచ్చటి తీగలలో పక్షుల కిలకిలారావాలతో



వచ్చీపోయే సందర్శకులకు సంగీతాన్ని పంచిపెడుతూ, మేనెల్లా పులకింత కలిగిస్తుంది. అక్కడే నేలను విప్పారిన గొడుగుల్లా ఉండే చిన్న చిన్న కుటీరాలముందు నల్లరాళ్ళ మీద నగిషీలు చెక్కుతూ ఉండే శిల్పుల ఉలుల చప్పుళ్ళు జాకీర్ హుస్సేన్ తబలా చప్పుళ్ళులా చెవులకు విందు చేస్తుంటాయి. అక్కడే జలకాలాటలు, అక్కడే మువ్వల రవళులు, అక్కడే నలభీమపాకాలు, అక్కడే రసరమ్య నాట్యాలు! ఇంత అద్భుతసృష్టి వెనుక ఉన్నది ఒకే ఒక్కరు. సృజన, సృష్టి, పర్యాటక ప్రచారదృష్టి, దార్శనికత అన్నీ ఆయనవే. ఆయన పేరు కిషన్‌రావు. మాటలు కుమ్మరించడం చేతకాదాయనకు. తను చెప్పదలుచుకున్నదాన్ని సూటిగా, చెయ్యదలుచుకున్న దాన్ని మనసుకు హత్తుకుపోయేలా, తూచిన మాటలతో చెబుతారాయన. దానితో అది ఈజీగా ఎదుటివాళ్లకు కమ్యూనికేట్ అవుతుంది. అంతేకాదు; ఆయన కింది సిబ్బంది కూడా ఆయనలాగే మితంగా మాట్లాడడానికి, చెప్పడానికి అలవాటు

పడ్డారు. సింపుల్ వర్క్ కల్చర్, ఈజిలీ కమ్యూనికబుల్ మెసేజ్‌సిస్టం అన్నవి ఒకసారి అలవడ్డాక మురిసిపోయే ఫలితాలు వస్తాయి. అందుకు శిల్పారామం చక్కటి తార్కాణం. తడిలేని పొడిగుండెల్లోనూ, మానసిక శూన్యంలోనూ, మానసిక అస్థిమితంలోనూ సృజన జనించదు. మనిషికి ఆర్ద్రత కావాలి. కార్య నిర్వహణాధికారు లందరూ సంస్థయొక్క, ప్రజల యొక్క దీర్ఘకాలిక ప్రయోజనాలను ఆశించాలి. అమెరికాలో వాణిజ్య - పారిశ్రామిక ప్రగతి పొరుగుదేశాలు ఈర్ష్యపడేంతగా జరుగుతోందంటే కారణం - US is ruled by Entrepreneurs, మనదేశం ఈసురోమంటోందంటే కారణం India is ruled by a bureaucracy' అని కన్వల్ రేఖీ అనే మరో మానేజ్‌మెంట్ నిపుణుడు చెప్పారు.

నిజమే కదా! ●

# 25. మనీ ఎర్నింగ్ ఈజ్ ఎ బిగ్ గాంబిల్

**డ**బ్బుకు లోకం దాసోహం. డబ్బుంటే అనర్హుడు మిస్టర్ వరల్డ్‌కు ఎన్నికవుతాడు. మాటలు రానివాడు మహా మహోపన్యాసకుడవుతాడు. పొట్ట పొడిచినా అక్షరమ్ముక్క లేనివాడు మహాపండితుడైపోతాడు. డబ్బుంటే కొండమీద కోతి దిగివస్తుంది. అబద్ధాలన్నీ నిజాలవుతాయి. నిజాలు నీరుగారిపోతాయి.

డబ్బుంటే అక్కర్లేదనుకున్నవాణ్ణి గద్దె దింపెయ్యవచ్చు, గాడిదను చేసెయ్యొచ్చు. కావాలనుకున్న వాణ్ణి గద్దె ఎక్కించవచ్చు, అధికారం కట్టబెట్టొచ్చు. తెలివైనవాణ్ణి వట్టివాజెమ్మను చెయ్యొచ్చు. వాజమ్మలను అందలం ఎక్కించొచ్చు.

డబ్బుతో కానిదేమిటి?

మనీ మేక్స్ మెనీ థింగ్స్!

అందుకే జనం చచ్చి చెడి డబ్బు సంపాదించడం!!

**సిగ్గెగ్గులు వదిలేసో, మానాభిమానాలు చంపుకునో ఎలాగో అలాగ డబ్బు సంపాదించావో - జనం వెర్రిగొర్రెల్లా నీవెంట పడతారు.** నువ్వు ఆడమన్నట్టల్లా ఆడతారు. నువ్వు కూర్చోమంటే కూర్చుంటారు; నుంచోమంటే నుంచుంటారు. మరి ఇదేమిటి, భీష్ముడు ఇంకోలా చెబుతున్నాడు!? 'కలిమీ లేమీ త్రాసులో పెట్టి చూస్తే లేమివైపే మొగ్గుతుంది ముల్లు. మృత్యువునోట్లో ఉన్నవాడూ, ధనవంతుడూ ఒకటే! ఏ దొంగలొస్తారో, ఎక్కడ ఎవరు అసూయతో కొంపకు నిప్పు పెడతారో, ఎవరు ఎప్పుడు ప్రాణాలు తీస్తారో అని

> **సిగ్గెగ్గులు వదిలేసో, మానాభిమానాలు చంపుకునో ఎలాగో అలాగ డబ్బు సంపాదించావో- జనం వెర్రిగొర్రెల్లా నీవెంట పడతారు.**

భయపడుతూనే ఉంటాడు. భయగ్రస్తుడికి సుఖమెక్కడ ఉంటుంది? అదీగాక లోభం, కోపం కలిసి అతని మనస్సును ఎప్పుడూ కలతపెడుతూనే ఉంటాయి. చింత ఎక్కువవుతుంది. అదేం సుఖం? ధనం, ధాన్యం, మేలిమివస్త్రాలు, బంగారు ఆభరణాలు, అధికారం, యవ్వనం, జీవితం అన్నీ కాలానికి లోబడే ఉంటాయని గ్రహించుకోవాలి. వాటిమీద మమకారం లేకుండా చేసుకోవాలి. ధనంవల్ల దుఃఖం తప్ప వచ్చేది మరేమీ లేదు. అయితే, 'పురుషార్థాలలో ధనం ఒకటి కదా; మనిషన్న ప్రతివాడూ డబ్బు సంపాదించాల్సిందేగదా' అని అనవచ్చు నువ్వు. నిజమే! సంపాదించాల్సిందే! ఉన్నది ఐశ్వర్యం కాదు; అనుభవించేది, అనుభవింప చేసేది ఐశ్వర్యం అంటోంది వేదం. కలిగి ఉండడంకంటె దానగునం కలిగి ఉండడం గొప్ప అంటున్నారు నీతికారులు. మన సంపాదన మన ఒక్కరికే కాదు; వేళకు అయిదువేళ్లూ నోట్లోకు పోని నిరుపేదలకోసం కూడా కావాలి. ఒక మాట చెప్పనా, ఎదుటివారి కష్టాలు చూసి కన్నీరు కార్చడంలో దివ్యత్వ ముంటుంది. నా సంపాదన నాతోపాటు పేదవాడి కూటికి కావాలి; గూటికి కావాలి; బట్టకు కావాలి అని అనుకోవడం దివ్యత్వం. నా చిన్ని బొజ్జకు శ్రీరామ రక్ష అనుకుని ఎంగిలిచేత్తో కాకిని కూడా కొట్టకపోవడం లోభత్వం; నీచత్వం.

> **ధర్మం వదలక సంపాదించు. సంపాదించినదాన్ని సద్వినియోగం చెయ్యి. తోడుతూంటేనే నీరూరుతుంటుంది.**

ఉన్నంతలోనే ఎంతో కొంత లేనివాడికి పెట్టి దానితో వాడు ఆనందిస్తుంటే అది చూసి మురిసిపోయే అదృష్టవంతు లెంతమంది ఉన్నారీ లోకంలో చెప్పు?

అందరికీ ధనతృష్ణ! సంపాదించాలి. ఇంక సంపాదించాలి. ఈ తపనతో కదూ మనుషులు నాశన మవుతోంది!



పూర్వం మంకి అనే బ్రాహ్మణు డుండేవాడు. ఎప్పుడూ ధనార్జనలో మునిగి తేలుతూ ఉండేవాడు. ఒకసారి రెండు పొట్టి ఎద్దుల్ని కొన్నాడు. రెండింటికీ మెడకు తాడు కట్టాడు. ఆ పొగరుబోతు ఎద్దులు ఆ తాడుతోనే పరుగెత్తాయి. వెళ్లి వెళ్లి పడుకుని ఉన్న ఒక ఒంటెమీద పడ్డాయి. అది భయపడి గభాలున లేచి పరుగెత్తడం ప్రారంభించింది. ఆ ఎద్దులు ఆ ఒంటెకు చెరోవైపుగా వేళ్లాడుతూ తాడుముడి గొంతులకు ఉరిపడి చచ్చాయి.

'అయ్యో రత్నాలవంటి ఎద్దులే! నిష్కారణంగా చచ్చాయి. పోసినడబ్బంతా వ్యర్థమైంది' అంటూ భోరున ఏడ్డాడు మంకి. 'ఏంచేస్తావ్, నీకు రుణం లేదు. ఊరుకో!' అని ఊరిజనమంతా అతన్ని సముదాయించారు.

దుఃఖంనుంచి కొంచెం తేరుకున్నాక మంకి తీవ్రంగా ఆలోచించాడు.

'దైవం దయతలిస్తే తప్ప ఏమీ ఒనగూడవు, ఏవీ నెరవేరవు, మనస్సుకు సుఖం లభించాలంటే డబ్బు సంపాదనమీద ఆశ వదిలెయ్యాలి కాని, కోరికలు అంత త్వరగా చస్తాయా? మనస్సు ఊరుకుంటుందా? సంకల్పంవల్ల కోరికలు పుడతాయి. కనుక నేను అసలు సంకల్పమే లేని మనస్సు పెంచుకుంటాను. ఈ కోరికల వెంటబడితే దుఃఖానికి అంతు ఉండదు. అంతో ఇంతో సంపాదిస్తే కావల్సినవి లభించే మాట నిజమే. కాని, డబ్బువల్ల కలిగే సుఖంకంటే, వచ్చే చింతలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఎప్పుడూ చింతతో

*మూలగడంకంటే చావడం మేలు. ఈ పాపిష్టి డబ్బు వద్దు నాకు. ఎంత సంపాదించినా తృప్తి లేదు. సుఖం లేదు. ఈ క్షణంనుంచి డబ్బుమీద, కోరికలమీద వ్యామోహం చంపేసుకుని శాంతి పొందుతాను' అనుకుని ధనతృష్ణను తెంచేసుకున్నాడు.* అందరికీ అది సాధ్యమా అంటే కాదు. కాదు కనకనే ధర్మం వదలక సంపాదించు. సంపాదించినదాన్ని సద్వినియోగం చెయ్యి. నువ్వు అనుభవించు; ఇతరులను కూడా అనుభవించనివ్వు. తోడుతూంటేనే నూతిలో నీరూరుతూ ఉంటుంది, గుర్తుంచుకో!' అని భీష్ముడు బోధించాడు.

మనీ ఎర్నింగ్ ఈజ్ ఎ బిగ్ గాంబిల్. అదొక పెద్ద వ్యసనం.

సంపాదించినకొద్దీ ఇంకా సంపాదించాలనిపిస్తుంది. తృప్తి అనేది ఉండదు. ఒకట్లను పదుల్ని చేసి, పదుల్ని వందల్ని చేసి, వందల్ని వేలూ లక్షలూ చేసి, లక్షల్ని కోట్లను చేసి, ఏమిటీ వెర్రి! సంపాదనే సర్వంగా సంపాదనే గర్వంగా బతికి మనం తీసుకువెళ్తోందేమిటి?

అజగరుడనే బ్రహ్మణుడు ప్రహ్లాదుడికి ఏం చెప్పాడో చూడండి :

'భోగభాగ్యాలన్నీ విధాత నిర్ణయించిన ప్రకారం వచ్చి చేరతాయి. అయితే, అవేవీ శాశ్వతం కావని తెలుసుకోవాలి. వాటివల్ల మనసుకు సంతోషంకాని, సంతాపంకాని కలగకూడదు. సిరిసంపదలు ఒకరికిస్తే తరిగిపోతాయి. తగ్గిపోతాయి అనుకోవడం పొరపాటు. నువ్వు తిన్నంత తిని పక్కవాడికి పట్టెడు పెట్టావో నీకు భాగ్యమే భాగ్యం. మరుజన్మలో మహారాజు వవుతావు. ప్రహ్లాదా! పంచేంద్రియాలు విషయలంపటంలో చిక్కుకోకూడదు. చిక్కుకున్నప్పటి నుంచీ బాధ – వాడికిచ్చామే, వీడికి పెట్టామే, మనకు తరిగిందే అని. పరమాన్నం, తెలగపిండీ ఒకటేలా అనిపించాలి. తృప్తి కలిగి వుండడం, సర్వజీవులనూ సమానంగా చూడడం, ఓర్పు వహించడం, దానధర్మాలు చేయడం మొదలైన వాటివల్ల పరమజ్ఞానం కలుగుతుంది. దానివల్ల అనంతమైన ఆనందం లభిస్తుంది. కోరికను, శోకాన్నీ జయించి పరమగతిపొందే మార్గం ఇది' ●

## 26. యాక్షన్ అంటే నటన కాదు!

**ధ**ర్మరాజు భీష్ముణ్ణి ఒకసారి 'తాతగారూ! మనిషి ఆయుష్కాలం నూరేళ్లంటారుకదా. చాలామంది నూరేళ్ళు నిండకుండానే చనిపోతున్నా రెందుకని?' అని అడిగాడు.

భీష్ముడు చెప్పాడు:

'ఎవరు సత్యవాదులు, సత్యప్రతిజ్ఞులో వాళ్లు నూరేళ్లూ జీవిస్తారు. **మనుష్య భాషణం కూడా ఒక యజ్ఞం లాంటిది. ఓటి మాటలూ, పొల్లు మాటలూ మాట్లాడకూడదు.** శుష్కప్రియాలూ, శుష్క వాగ్దానాలూ చెయ్యకూడదు. ఎవరికి వారు జిహ్వామీద అదుపు ఉంచుకుని మాట్లాడాలి.

'చెప్పే మాటలకూ, చేసే పనులకూ పొంతన ఉండాలి. ఏమి చెయ్యగలుగుతామో అదే చెప్పాలి. చెప్పినదేదో చేసి చూపించాలి. మితంగా మాట్లాడాలి. మాట్లాడే ఆ నాలుగు మాటలూ కూడా చలువ పందిరి వేసినట్లుండాలి. వెన్నెల పరిచినట్లుండాలి. చల్లని నీరు చిలకరించినట్లుండాలి. అన్నింటికన్నా ప్రధానమైన దేమిటో చెప్పనా? **నోటి మాటకంటే మనస్సంకల్పం గొప్పది. మనస్సంకల్పం కంటే ఆచరించి చూపడం మరీ గొప్పది.** అందుకే మాట్లాడే ప్రతిమాటా ఎదుటి మనిషియొక్క ఇహపరాలకు కర్మణా మనసా వాచా ఉపకరించేదై ఉండాలి.

**మనుష్య భాషణం కూడా ఒక యజ్ఞం లాంటిది. ఓటి మాటలూ, పొల్లు మాటలూ మాట్లాడకూడదు.**

'అబద్ధాలు చెప్పడం, అప్రియంగా మాట్లాడడం, చాడీలు చెప్పడం, వక్రంగా మాట్లాడడం, నిందించడం, ఈటెల్లాంటి మాటలతో ఎదుటివారిని మానసికంగా హింసించడం మొదలైనవన్నీ నోటితో చేసే తప్పులు.

ఈ తప్పులేవీ చెయ్యనివాళ్లు వందేళ్లూ బతుకుతారు. సందేహం లేదు'.

విష్ణుపురాణం కూడా ఇదే చెబుతోంది– 'ప్రాణులకు ఇహంలోనూ, పరంలోనూ ఏది ఉపకార మవుతుందో, ఏది మేలు కలిగిస్తుందో అది మాత్రమే కర్మణా మనసా వాచా ఆచరించాలి'

**నోటి మాటకంటే మనస్సంకల్పం గొప్పది. మనస్సంకల్పం కంటే ఆచరించి చూపడం మరీ గొప్పది.**

నిజమేకాని, ఇప్పుడివన్నీ లక్ష్య పెట్టేదెవరు?

ఆయుష్షు పెరిగితేనేం, తరిగితేనేం? బ్యాంక్ బాలెన్సు పెరగాలిగాని. అందుకోసం ఏమైనా చేస్తాం. ఏదైనా చేస్తాం. పూజ్యుల్ని అవమానిస్తాం. వేదనింద చేస్తాం. దైవనింద చేస్తాం. పరనింద చేస్తాం. కొండేలు చెబుతాం. చాడీలు చెబుతాం. అకారణ వైరాలు సృష్టిస్తాం. బట్టతలకీ, మోకాలికీ ముడిపెడతాం, మారా ముళ్ళు వేస్తాం, తిడతాం, కొడతాం, చంపుతాం.

అంతేకానీ మనిషన్నవాడికి సదాచారం కావాలనుకోం.

దేవతల్ని పూజించడం, పెద్దల్ని గౌరవించడం, అతిథుల్ని ఆదరించడం, తల్లిదండ్రుల్ని సేవించడం వంటివి శారీరిక ఆచారమైతే, హితవుగా ఇంపుగా మాట్లాడడం, చల్లగా మాట్లాడడం, మితంగా మాట్లాడడం వంటివి వాచకాచారం కిందకు వస్తాయి.

మియర్ వర్డ్స్ – వట్టి మాటలవల్ల విలువలు పడిపోతాయి. మనుషులు పలుచన అవుతారు. చాలా సంస్థలు చాలా ఆర్భాటంగా అలవిమాలిన ప్రకటనలు చేస్తుంటాయి. రకరకాల సందేశాలను, విలువలనూ విజిటర్స్ లాంజ్‌ల్లో బోర్డ్స్ కట్టి వేలాడదీస్తుంటాయి.

"We have our eyes on your earnings. Save something for tomorrow invest in..." అని ఇచ్చకాలమారి మాటలు చెప్పి డబ్బంతా పోగేసుకుని ఉడాయించే సంస్థలూ;

*'అసలు దేవుడనేవాడు ఉన్నాడా?*
*ఉంటే మీరు చూశారా?*
*మేము చూశాం. రండి చూపిస్తాం.*
*మా షాపుకు విచ్చేసే*
*లక్షలాదిమంది ఖాతాదారులే మా దేవుళ్లు'*

అని క్యాప్షన్లను డిస్ప్లే చేసి, అదే దేవుళ్లు తాము కొన్న వస్తువులు సరిగా లేవనో, సక్రమంగా పనిచేయడం లేదనో రిటర్న్ చెయ్యబోతే ముష్టివాళ్లను చూసినట్టు చూసి ఈసడించుకునే దుకాణదారులూ, ఉత్తర కుమారులూ భీష్ముడి దగ్గరనుంచి తెలుసుకోవలసింది ఎంతో ఉంది.

తాము బోధించే విలువలూ, ప్రచారం చేసే విలువలూ, జారీచేసే ప్రకటనలపట్ల సంస్థల యాజమాన్యాలకు చిత్తశుద్ధి ఉండాలి. ఆ విలువల అమలుకోసం రాజునుంచి బంటువరకూ అందరూ ఒకేరీతిగా శ్రమించాలి. ఆ విలువల్నీ, విశ్వాసాల్నీ ఏ ప్రాతిపదికమీద రూపొందించారో, వాటి అంతరార్థమేమిటో, వాటిని ఆచరించడంవల్ల ఒనగూడే ప్రయోజనా లేమిటో సంస్థలోని ఉద్యోగులందరికీ ఎరుక పరచాలి. మొదట యజమానులు ఆచరించి ఆ తరువాత తమ సిబ్బంది కూడా వాటిని ఆచరించేలా చూడాలి.

**ఎంత వ్యాపారసంస్థ అయినా ఆర్జనకు ధర్మబద్ధత, వినియోగానికి బహుముఖీనత ఉండాలన్నది అసలు రహస్యం.**

మౌలిక విలువల రూపకల్పనలో కిందిస్థాయి ఉద్యోగులనుంచీ భాగస్వామ్యం ఏర్పరచాలి. ఒకసారి విలువల రూపకల్పనంటూ జరిగాక వాటి ఆచరణకు స్పష్టమైన మార్గదర్శక సూత్రాలను రూపొందించాలి. గైడ్లైన్స్ లేకపోతే ఆచరణలో లొసుగులు ఏర్పడతాయి. అంతేకాకుండా, అది

యాజమాన్యపు పట్టీపట్టని ధోరణిని ప్రతిఫలిస్తుంది. దానితో ఉద్యోగులలో నిబద్ధత కొరవడుతుంది. ప్రతి సంస్థకూ డబ్బు సంపాదనతోపాటు కొన్ని ఉత్తమ లక్ష్యాలూ, ఉన్నత విలువలూ, సమాజహితంకోసం చేయాల్సిన కొన్ని మంచిపనులూ ఉండాలి. లోకజ్ఞులైన వారి అనుభవాలనూ, ఉపదేశాలనూ ప్రజలందరూ ఉపయోగించు కోవాలంటే పెద్ద పెద్ద సంస్థలు తమ లాభాల్లో కొంత కవి పండితులకు, కళాకారులకు, క్రీడాకారులకు, శాస్త్రవేత్తలకు, సంగీతజ్ఞులకు ఇంకా అనేక రంగాలలో ఖ్యాతిగాంచిన ప్రతిభామూర్తులకు కేటాయించాలి. వారి మేధ, అనుభవం, వైదుష్యం, సమయజ్ఞత అందరూ తెలుసుకుని సమాజం బాగుపడేలా చూడాలి. ఎంత వ్యాపారసంస్థ అయినా, ఆర్జనకు ధర్మబద్ధత, వినియోగానికి బహుముఖీనత ఉండాలన్నది అసలు రహస్యం.

సత్కార్యాలకు సద్ద్రవ్యమే కావాలి.



సక్రమ మార్గాన సంపాదించిన డబ్బే అయివుండాలి.

దాన్ని మంచి పనులకే ఖర్చు చేయాలి.

అవునూ, 'వట్టి మాటలు కట్టి పెట్టి గట్టి మేల్ తలపెట్టవోయ్' అనలేదూ గురజాడ అప్పారావుగారు.

ఎవరు చెప్పినా అదే!

యాక్షన్ ప్రధానం.

యాక్షన్ అంటే కల్లబొల్లి మాటలూ, ఉత్తుత్తి నటనా కాదు.

యాక్షన్ అంటే ఆచరణ – కార్యాచరణ. అలాగే విలువలంటే – కేవలం మాటల కూర్పుకాదు. ఆచరణలోకి, అనుభవంలోకి రావల్సిన నిర్దిష్ట ప్రమాణాలు ●

# 27. పబ్లిక్ సర్వీస్ క్యాంపెయిన్

**మా** చిన్నప్పుడు మా ఊరి శివాలయమే మాకు పెద్ద సెంటరాఫ్ ఎట్రాక్షన్. శివాలయం ప్రహరీగోడకు తెల్లటి తెర ఒకటి కట్టి సినిమాలు వేసేవారు. సినిమాలంటే ఏమిటో అనుకునేరు. సన్‌లైట్ సబ్బుల కంపెనీల, వాళ్లు పబ్లిసిటీకోసం తీసిన యాడ్ ఫిల్ములను ఊరూరా ప్రదర్శించేవాళ్లు– అవన్నమాట! మా ఊళ్లోకి సన్‌లైట్ వాళ్ల వ్యాన్ వస్తే బట్టలేమోగాని, పిల్లల మొహాలు మాత్రం తళతళలాడేవి. పొలోమని అందరం శివాలయందగ్గర చేరేవాళ్లం.

అంతేనా!

అంతేనా అంటే ఇంకా చాలా ఉంది.

అక్కడే దోసకాయల బళ్లూ, చిలగడదుంపల్ల బళ్లూ ఆగేవి. అక్కడే కరణంగారి జమాబందీ జరుగుతుండేది. అక్కడే హరికథలూ, పురాణ కాలక్షేపాలూ జరిగేవి. ఇరవై రోజులు, నెల్లాళ్లు, మండలం రోజులూ సాగేవవి. మా నాయనమ్మతోపాటు నేనూ వెళ్లేవాణ్ణి. కేశవులని హనుమంతుడిలాంటి నమ్మినబంటు ఒక డుండేవాడు మాకు. తను లాంతరు పట్టుకుని ముందు నడిస్తే, ఆ దీపం వెలుగులో నేనూ, మా నాయనమ్మా రాజువెడలె రవితేజములలరగ అన్నట్టు వెనక నడిచి వెళ్లేవాళ్లం.

కథ అయ్యాక హరిదాసు చెప్పిన భారతమంతా మా నాయనమ్మ నాకూ, కేశవులికీ త్రోవపొడుగునా మళ్ళీ మళ్ళీ చెబుతూ, పాండవులకు కలిగిన కష్టాలకు కన్నీళ్లొత్తుకుంటూ దుర్యోధనుడికి శాపనార్థాలు పెట్టేది.

ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే, గ్రామాల్లో ఒకప్పుడు ఈ హరికథలూ, పురాణ ప్రవచనాలూ గొప్ప మోరల్ ఎడ్యుకేషన్‌గా పనిచేస్తూ వచ్చాయి. అందుకే అప్పటివారంతా రామాయణ, భారత, భాగవత ఇతిహాసాల్లోని నీతినీ, విలువలనూ, నిత్యసత్యాలనూ వంట పట్టించుకుని

మర్యాదగా బతికారు. సాంప్రదాయకమైన జీవితంనుంచి ఎలీనేట్ కాకుండా బతికారు. భూమికి భారం కాకుండా బతికారు.

భీష్ముడు చెప్పాడు, నీతిమార్గం తప్పకుండా బతకడం ఉత్తమమట; బాహుబలంతో సంపాదించి బతకడం మధ్యమమైతే నీతి తప్పి బతికే బతుకు నీచమట. అదేం చిత్రమో! ఇప్పుడసలు మనకు నీతి మార్గమంటేనే గిట్టటం లేదు. జన్మమెత్తుతూనే తెచ్చుకునే దుర్గుణాలు మనిషికి రెండున్నాయని త్రిదండి శ్రీమన్నారాయణ చిన్నజీయర్ స్వామివారు చెప్పారు. ఒకటి స్వార్థం, రెండు ఆధిపత్యం. ప్రతిదీ తానే, అన్నీ తనకే అని భావిస్తాడుట మనిషి. దాని కెవరైనా అవరోధ మనిపిస్తే, వారిని అణచివేసి తన ఆధిపత్యాన్ని ఆవిష్కరించుకోవాలని అర్రులు చాస్తాడట. 'ఈ పోరాటం ఆదినుంచీ ఉన్నదే. అయితే, ఇప్పుడు మరి వెర్రితలలు వేస్తోంది. అందుకే ఇప్పటి వ్యవస్థలో ఎన్నో అవ్యవస్థలు ఏర్పాడ్డాయి. ఇప్పటి మనుషుల్లో ఎన్నో వక్రాలు ఏర్పడ్డాయి' అన్నారు స్వామి.

ఒక్కసారిగా ఎవరూ అందుకోలేని ఎత్తులకు ఎదగాలన్న తపన, మార్గమేదైనా సరే అన్నిటా ముందుండాలన్న మూర్ఖత మనిషిని వేధిస్తున్నాయి. భీష్ముడు చెప్పాడు – మనిషికి మూర్ఖతకు మించిన శత్రువు మరొకటి లేదుట. అదే అన్ని రకాల పాడుపనులూ చేయిస్తుందిట. అలాగే లోభం కూడా! 'కామం, క్రోధం, మోహం, మత్సరం, పరధన, దారావాంఛలు, దైన్యం, సిగ్గు, అబద్ధం మొదలైన దుర్గుణాలన్నీ లోభంవల్లే వస్తాయి.

**ఒక్కసారిగా ఎవరూ అందుకోలేని ఎత్తులకు ఎదగాలన్న తపన, మార్గమేదైనా సరే అన్నిటా ముందుండాలన్న మూర్ఖత మనిషిని వేధిస్తున్నాయి.**

ధర్మమార్గాన్నుండి తప్పించి, మనుషుల చేత ఎంత నీచకార్యమైనా చేయిస్తుంది లోభం. లోభం నుంచే అజ్ఞానం పుడుతుంది. రోషం, శోకం, రాగం, ద్వేషం, అభిమానం, గర్వం, సోమరితనం కలిసి వివేకాన్ని

ప్రకాశించనియ్యవు. అదే అజ్ఞానమంటే! అన్నిటికంటే ఉత్తమధర్మం ఇంద్రియ నిగ్రహం. దీన్నే 'దమము' అంటారు. ఆ ఒక్క గుణం అలవడిననాడు మనిషి కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యాలను గెలుస్తాడు. శీలం, మైత్రి, కరుణ, క్షమ మొదలైన సద్గుణాలన్నీ వాడికి కలుగుతాయి. అలాంటివాళ్లకు మహనీయ బ్రహ్మపథం లభిస్తుంది' అన్నాడు గాంగేయుడు. ఇంకోచోట ఆర్యుల గురించి, ఆచరవంతుల గురించి చెబుతూ, 'ఆచారం అంటే ఆచరణం. మంచిపనులు చేయడాన్ని సదాచారం అంటారు, చెడుపనులు చేయడాన్ని దురాచారం అంటారు. సదాచారం వల్ల సద్గతి కలుగుతుంది. దురాచారం వల్ల దుర్గతి కలుగుతుంది' అని చెప్పాడు.

'ఎవరికీ కీడు తలపెట్టకూడదు. ఎవరి కీడూ కళ్లతో చూడకూడదు (అంటే సాధ్యమైనంతవరకు కంటి ఎదుట జరుగుతున్న కీడును, చెడును నివారించాలి అని!) నోటితో కీడు పలకకూడదు. మనసుల్లో తలచకూడదు. ఆవులూ, వృద్ధులూ, బరువు ఎత్తుకున్నవాళ్లూ, గర్భిణులూ, అవిటివాళ్లూ వస్తుంటే దారి ఇవ్వాలి. సజ్జనులతో స్నేహం చెయ్యాలి. సర్వభూతాలయందూ దయ కలిగి ఉండాలి. సత్యాన్నే పలకాలి. మహనీయులను గౌరవించాలి.



పండితులను సేవించాలి. తల్లీతండ్రీ గురువూ దైవసమానులు. వాళ్లను గౌరవిస్తూ, వాళ్లేది చెబితే అది చెయ్యడం కంటే ధర్మం మరొకటి లేదు. మూడులోకాలూ, ముగ్గురు మూర్తులూ, మూడు అగ్నులూ – వీళ్లందరికంటే ఎక్కువ తల్లి. మాతృ పితృ గురు భక్తుడు ఇహపరలోక సుఖాలు రెండూ పొందుతాడు' అని చెబుతూ, 'సూర్యకాంతి ప్రసరిస్తే రాతిలో కూడా కాంతి కనిపిస్తుంది. అలాగే ఎప్పుడూ మంచిని భావిస్తుంటే మనసు కూడా మంచి స్థితిని పొందుతుంది. పరమపదానికి అదే మార్గం. గుడ్డివాళ్లు అలవాటుకొద్దీ తమ ఇంట్లో తిరుగుతారు. వాళ్ళ ఇల్లు తప్ప వాళ్ళకేమీ తెలీదు. అలాగే మాయాసంసారంలో పడి కొట్టుకునే వాళ్ళకు పెళ్లాం పిల్లలూ డబ్బూ తప్ప మోక్షమార్గం తెలీదు. వాళ్ళతో మునిగితేలుతూ ఉండగానే పిల్లి ఎలుకను పట్టుకున్నట్టు వార్ధక్యం మనల్ని పట్టేస్తుంది. ఆ వెంటనే మృత్యువు మింగేస్తుంది. బరువు పెద్దదైతే ఓడ సముద్రతీరం చేరుకోలేదు. అలాగే సంసార వ్యామోహం పెంచుకుంటూ పోతే జీవుడు దరి చేరలేడు' అని హెచ్చరిక చేశాడు. ఇవన్నీ పాండవులకైతే భీష్ముడు చెప్పాడు. మరి మన కెవరు చెబుతారు?

సమాజహితం కోరి ప్రజలకు హితువు చెప్పేవాళ్లే లేరా? మనం జనం మధ్యలో ఉన్నాం. మనచుట్టూ జనం ఉన్నారు. కాని కార్యదీక్ష, పట్టుదల, నిజాయితీ, బుద్ధికుశలత ఉన్న కార్యసాధకులు లేరు. విలువలకు పట్టం కట్టేవాళ్లు లేరు. సమాజంలో ఏ మచి సాధించాలన్నా ఇప్పుడు మంచి మనుషుల కొరత విపరీతంగా ఉంది. నా కొకటి అనిపిస్తోంది, సమాజహితాన్నీ, విస్తృత ప్రయోజనాలనూ కాంక్షించి వ్యాపార వాణిజ్య సంస్థలు పబ్లిక్ సర్వీస్ క్యాంపెయిన్లు నిర్వహించాలి. అది తమ వంతు బాధ్యతగా అవి భావించాలి. ఎయిడ్స్‌వంటి ప్రాణాంతక వ్యాధుల్లో పూర్తిగా కూరుకుపోయినప్పుడో, మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టాల్సిన శాఖ ఏడాది కోసారి గణాంక వివరాలను ప్రజలను తెలియచేయాల్సి వచ్చినప్పుడో 'బివేర్ ఆఫ్ ఎయిడ్స్... యూజ్ కండోమ్స్', 'డోన్ట్ టేక్ డ్రగ్స్', 'డోన్ట్ డ్రింక్'

వంటి ప్రకటలను జారీచేస్తారు. ఎయిడ్స్ నిరోధానికి కండోమ్స్ వాడమని చెబుతున్నాంగాని, అసలు పరకాంతలవైపు కన్నెత్తి చూడడం పాపమనీ, 'కన్నుదోయిని అన్యకాంత లడ్డంబైన మాతృభావన చేసి' మరలిపోవాలనీ మనం ఎందుకు చెప్పడంలేదు? పిల్లల్లోనూ, పెద్దల్లోనూ విలువల్ని ప్రోది చెయ్యకుండా తప్పులు చేసేందుకు చిట్కాలూ, సురక్షిత మార్గాలూ సూచించడమేమిటి?

**వ్యాపార వాణిజ్యసంస్థలు సమాజహితాన్నీ, విస్తృత ప్రయోజనాలనూ కాంక్షించి పబ్లిక్ సర్వీస్ క్యాంపెయిన్లు నిర్వహించాలి.**

ఏ ఇంట్లోనూ లలిత మర్యాదలు లేకుండా పోయారేమిటి? బహుళజాతి సంస్థలూ, జాతీయ సంస్థలూ, జాతీయ బ్యాంకులూ వంటివి క్రీడాకారుల్ని దత్తత చేసుకుని వాళ్ళకు కావల్సిన సదుపాయాలు కల్పిస్తూ వాళ్ళని ప్రోత్సహిస్తూ కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నాయి. అలాగే, మనిషిని పశుత్వం నుండి మానవత్వానికి, మానవత్వం నుండి దైవత్వానికీ నడిపించాలని ఆసేతుహిమాచలం కాలినడకన కదిలివెళ్ళిన కాలడి శంకరుడిలాంటి వాళ్ళనూ, భారతీయ సనాతన ధర్మాన్ని విశ్వమంతా చాటిచెప్పిన వివేకానందుడిలాంటి వాళ్ళనూ, ప్రజల ఇచ్ఛాశక్తిని ఏకీకృతం చేసి, వాళ్ళందరినీ ఏకమనస్కుల్ని చేసి, ఒకే ఒక శక్తికేంద్రంగా మలచి సత్యాహింసలే సాధనంగా స్వాతంత్ర్యం సంపాదించి పెట్టిన గాంధీతాతలనూ నేటి తరానికి పరిచయం చెయ్యండి. సహృదయులు, అత్యుత్తమ సంస్కారులైన వక్తల చేత ప్రజలకు మంచి మాటలు చెప్పించండి. ధర్మాచరణే జీవితధ్యేయం కావాలని ప్రచారం చేయించండి. ప్రజలందరూ పాశవిక ప్రవృత్తిని దాటి పరమోత్కృష్టస్థితికి చేరుకునేవరకూ ఈ సోషల్ సర్వీస్ క్యాంపెయిన్‌నీ, పబ్లిక్ సర్వీస్ క్యాంపెయిన్‌నీ, ఎథికల్ క్యాంపెయిన్‌నీ కొనసాగించండి.

సచ్ఛీలవంతుల్ని తయారుచేసుకునేందుకు ఇంతకంటే మార్గం లేదు ●

# 28. నెత్తిమీద పిచికలు

'**మ**నం ఏ పని చేసినా మనోవాక్కాయ కర్మలతో చేయాలి. వాటిలో ఏది లోపించినా అది సత్కర్మ కాదు. అహంకారంతో, దుర్బుద్ధితో చేసే పనిని భగవంతుడు మెచ్చడు. చెప్పేదొకటీ, చేసేదొకటీ అయితే శాశ్వతంగా నష్టపోయేది మనమే!' అని చెప్పాడు భీష్ముడు. అందుకు ఉదాహరణంగా ఒక కథ చెప్పాడు. *పూర్వం జాజలి అనే ఒక ముని ఉండేవాడు. అతను ఘోరమైన తపస్సుచేశాడు. అప్పుడు ఆయన నెత్తిమీద పిచికలు గూడుకట్టుకుని గుడ్లు పెట్టుకుని పిల్లల్ని కని హాయిగా కాపురం ఉన్నాయి. వాటిని ఒకసారెప్పుడో తనను తానే మెచ్చుకుంటూ 'నాకున్న ధర్మనిష్ఠ ఇంకెవరికైనా ఉందా?' అనుకున్నాడు మనస్సులో. అలా అనుకోవడంలో అతిశయం, అహంకారం ధ్వనించాయి.*



> **మన కర్తవ్యాలను మనం గుర్తించడం, మన ధర్మాలను మనం పాటించడమే జ్ఞానం.**

'నీకంటే ఎక్కువ ధర్మపరుడు తులాధారుడనే వాడున్నాడు. కానీ నీలా అతనెప్పుడూ గర్వపడలేదు. ఏం చేసినా త్రికరణ శుద్ధితో చేస్తాడు' అంది అశరీరవాణి వెంటనే. జాజలి అసూయతో రగిలిపోయాడు. తులాధారుణ్ణి చూడాలని బయలుదేరాడు. వెళ్ళి వర్తకం చేసుకుంటున్న అతన్ని చూశాడు.

'అయ్యా! వచ్చావా! రా! పిచికలు నెత్తిమీద గూళ్లు కట్టి పిల్లలతో తిరుగుతున్నా చిత్తవికారం లేకుండా తపస్సు చేశావు. ఎంత గొప్పవాడివి నువ్వు!' అని తులాధారుడు జాజలిని గౌరవించి ఆదరించాడు. 'నా సంగతి నీ కెలా తెలుసు?' అని అడిగాడు జాజలి. 'ఎలా తెలుస్తాయో తెలీదు కానీ నాకన్నీ తెలుస్తాయి. నీబోటి మహానుభావుల్ని చాలామందిని అడిగాను. వాళ్ళంతా చెప్పిందేమిటంటే, నేను ధర్మమార్గంలో నడుస్తానట; నా మనస్సు ఏ ఆకర్షణకూ, ఏ లాలసకూ లోనుకాదట. అది ఎప్పుడూ స్వచ్ఛంగా, అభ్రకపు రేకులా ఉంటుందిట. ఏమో, నా మటుకు నాకు అవన్నీ అతిశయోక్తుల్లా అనిపించాయి!' అన్నాడు.

'మనసు తేటగా ఉన్నవాళ్ళే ఇంత గొప్పవాళ్లయితే, యజ్ఞాలూ తపస్సూ చేసేవాళ్ళు ఇంకెంత గొప్పవాళ్ళు కావాలి?' ఉక్రోషంతో అన్నాడు జాజలి.

'అహంకారంతో చేసేది ఏదైనా దేవతలు మెచ్చరు. నేను, నాది అన్న సంగం లేకుండా కర్మాచరణ జరగాలి. అసంగ కర్మాచరణే ముఖ్యం!' అని సమాధానమిచ్చాడు తులాధారుడు.

'ఇన్ని తెలిసినవాడివి నువ్వీ వర్తకం ఎందుకు విడిచిపెట్టవు? ఇంకా వర్తకం చేస్తూనే ఉన్నావంటే నీకింకా ధనాపేక్ష తగ్గలేదన్న మాట!' జాజలి కోపంతో దెప్పిపొడిచాడు.

'అయ్యా! ఇందుకు సమాధానం నీకూ తెలుసు. ఎవరికైనా కర్తవ్యాలు విడిచిపెట్టడం మంచిది కాదు. దేనిమీదా మమకారం లేకుండా, ఏ ప్రలోభాలకూ గురికాకుండా కర్మలూ, కర్తవ్యాలూ నిర్వహించాలి. మన ధర్మాన్ని మనం శ్రద్ధగా ఆచరించాలి. ఎవరి విధుల్ని వారు పాటిస్తూ, ఎవరి కర్తవ్యాలను వారు నెరవేరుస్తూ వేదోక్తాలైన కర్మల్ని అనుష్ఠించడంకన్నా కావాల్సిందేముంది? మన కర్తవ్యాలను మనం గుర్తించడం, మన ధర్మాలను మనం పాటించడమే జ్ఞానం. నేను చెప్పినవన్నీ నిజాలో, కాదో అడుగుదాం. నువ్వు నెత్తిన పెట్టుకుని పెంచుతున్న పిచికల్ని పిలు!' అన్నాడు తులాధారుడు.

జాజలి పిచికల్ని పిలిచాడు. అవి ఒక్క వుదుటున ఆకాశంలోకి ఎగిరి, 'మేము ధర్మదేవత భటులం. ఆయన ఆజ్ఞతోనే నిన్ను పరీక్షించడానికి వచ్చాం. అసూయాద్వేషాలు మంచివి కావు. మత్సరం ఒక్కటి చాలు, సర్వధర్మాలనూ నాశనం చెయ్యడానికి. అందుచేత స్పర్థ మాని, శ్రద్ధ అవలంబించు. శ్రద్ధ లేని తపస్సూ యజ్ఞాలూ వ్యర్థం. దయలో, దానంలో, ధర్మంలో ఉదాత్తత ఉండాలి. వీళ్లకు సేవచేసి నా జన్మ ధన్యం చేసుకుంటాననుకునే అణకువ ఉండాలి. అంతేగానీ అహంభావం కూడదు!' అన్నాయి.

జాజలి తన తప్పు తెలుసుకుని తులాధారుడి కాళ్ళమీద పడ్డాడు.

తులాధారుడు జాజలిని దగ్గరకు తీసుకుని 'దోషాలందరిలోనూ ఉంటాయి. అంతమాత్రానికే నువ్వు చింతించాల్సిన పని లేదు. యోగులూ, బుద్ధిమంతులూ, శ్రేష్ఠులూ ఏ పని ఎలా చేస్తే అది లోకానికి ఉపకారమవుతుందో గమనిస్తూ ఇకమీదట నువ్వూ అలాగే చేయ్!' అని హితవు చెప్పాడు.

జాజలి కృతజ్ఞతగా చేతులు జోడించాడు ●

# 29. నమ్మతగని వాళ్లను నమ్మనే కూడదు!

'**ఉ**న్నట్టుండి వైరిపక్షాలన్నీ వచ్చి చుట్టుముడితే ఎలా తప్పించుకోవాలి?' దీనికి భీష్ముడిచ్చిన సమాధానం చూడండి : వీడు మిత్రుడని, వాడు శత్రువని నియమం లేదు. మిత్రుడు అమిత్రుడూ కావచ్చు. అమిత్రుడు మిత్రుడూ కావచ్చు. సమయాసమయాలు గమనించి, పాత్రల స్వభావాలను కనిపెట్టి, ఎవరితో రాజీపడాలో వాళ్ళతో పడి, ఆ బలంతో మిగతా వారి బాధ తప్పించుకోటం చాలా తెలివైన పని'.

ఈ కథ చదవండి.

*ఒక మహారణ్యంలో మర్రిచెట్టుకింద ఉన్న కలుగులో పలితుడనే మూషికరాజు ఉంటుండేవాడు. అదే చెట్టుమీద రోమశుడనే పిల్లి కూడా ఉండేది. ఎలుక బయటకు వచ్చేటప్పుడు జాగ్రత్తగా పిల్లి లేని సమయం చూసుకుని మరీ వచ్చేది.*

*ఓ రోజు పిల్లి వేటగాడు ఒడ్డిన వలలో చిక్కింది. అది చూసిన ఎలుకరాజు ఇంక ఫరవాలేదనుకుని నిర్భయంగా బయటకు వచ్చి ఆహారం తినవచ్చులే అనుకున్నాడు. తీరా పలితుడు బయటకు వచ్చే సమయానికి గుడ్లగూబ, ముంగిస ఎదురయ్యాయి. గూబ పేరు చంద్రకుడు. ముంగిస పేరు హాలికుడు. ఇద్దరూ దుర్మార్గులే!*

*'భగవంతుడా! ఇప్పుడేం చెయ్యను? ఎటు కదిలినా ప్రాణం పోతుందే. చుట్టూ శత్రువులే. ఇప్పుడేమిటి కర్తవ్యం?' అని మూషికరాజు డీలాపడ్డాడు. చివరికి ఓ ఆలోచన తట్టింది. మెల్లిగా పిల్లి దగ్గరకు వెళ్ళి 'మార్జాలమా! ఎన్నడూ*

**సమయాసమయాలు గమనించి, ఎవరితో రాజీపడాలో వాళ్ళతో పడి, ఆ బలంతో మిగతా వారి బాధ తప్పించుకోటం తెలివైన పని.**

లేనిది ఏమిటిలా వలలో చిక్కుకున్నావు? ఇద్దరం ఒకే చెట్టును ఆశ్రయించి బతుకుతున్నాం. నేను వల కొరికి నిన్ను విడిపిస్తాలే. నాతో స్నేహంగా ఉండు. అది చాలు' అన్నాడు. 'ముందు గుడ్లగూబనూ, ముంగిసనూ తప్పించుకుంటే ఆ తర్వాత పిల్లిని ఎలాగైనా మాయబుచ్చవచ్చు. పిల్లిని చూస్తే గూబకూ, ముంగిసకూ కూడా భయమేగా?!' అని మనసులో అనుకుని పలితుడు పిల్లి దగ్గరకు వెళ్ళి నిలబడ్డాడు. 'మిత్రమా! తప్పకుండా నువ్వు నా స్నేహితుడవే. ముందే ఈ వలదారాలు కొరికి నన్నీ చెరనుంచి రక్షించు' అని పిల్లి ఆత్రంగా అడిగింది.

'అయ్యా! ఆ ముంగిసనీ, గూబనూ చూస్తుంటే నా శరీరం వణుకుతోంది. ముందు నన్ను కాసేపు నీ ఒళ్ళో కూర్చోబెట్టుకున్నావంటే నాకు భయం తగ్గుతుంది. తరువాత వల నుంచి నిన్ను బయటకు తప్పిస్తాను' అన్నాడు ఎలుకరాజు.

'అయ్యో అంతకంటేనా? భయం విడిచి నా దగ్గరకు రా! నేనంటే గూబా, ముంగిసా భయపడతాయి. నువ్వు నా దగ్గరుంటే అవి నిన్నేం చెయ్యలేవు. రా, నేస్తం, రా' అంది పిల్లి.


'ఆ సంగతి తెలిసే నీతో సంధి చేసుకుంటున్నాను. అందువల్ల నాకు ప్రాణం, నీకుయీ వలనుంచి విడుదల దక్కుతాయి' అంటూ పలితుడు వెళ్లి ధైర్యంగా మార్జాలం ఒళ్లో కూర్చున్నాడు.

**'మార్జాలమా! నేను వల కొరికి నిన్ను విడిపిస్తాలే. నాతో స్నేహంగా ఉండు. అది చాలు' అన్నది ఎలుక.**

అది చూసి ఇంక లాభం లేదనుకుని ముంగీ, గూబా నోళ్లు నొక్కుకుని వెళ్లిపోయాయి. ఎలుక సంతోషించి పిల్లి ఒడిలోంచి బయటకు వచ్చి మెలమెల్లగా వల తాళ్లు కొరుకుతున్నట్టు నటించింది. అది చూసి, 'మిత్రమా! ఏమిటి ఆలస్యం

*చేస్తున్నావు? తాళ్లు తొందరగా కొరికి నన్ను విడిపించు' అని అర్థించింది పిల్లి.*

*'పిచ్చివాడా! ఆశ్రయించిన నన్ను రక్షించావు నువ్వు. అలాంటి నీకు నేను ద్రోహం చేస్తానా? అలా చెయ్యడంకంటే పాపం ఇంకేమైనా ఉందా? నీకు భయపడి నిన్ను నమ్మలేక వెంటనే వల కొరకడం లేదు. కానీ అనవసరంగా నన్ను అనుమానించకు. వేటగాడు కంటబడగానే వల దారాలు కొరికి నిన్ను రక్షిస్తాను. ఈలోగా నిన్ను తప్పిస్తే నాకేం చేటు తలపెడతావో?! శత్రువుతో అవసరంకొద్దీ సంధి చేసుకున్నా అతన్ని నమ్మకూడదనీ, జాగ్రత్తగా*



*ఉండాలనీ పెద్దలు చెబుతారు. వేటగాడు వచ్చేవేళకు వల కొరికితే నువ్వు గబగబా చెట్టు ఎక్కుతావు. నేను కన్నంలోకి పోతాను. నన్ను పట్టే అవకాశం ఉండదు నీకు. అందుచేత వేటగాడి రాక చూస్తూనే నిన్ను బంధవిముక్తుణ్ణి చేస్తాను. సందేహించకు' అన్నాడు ఎలుకరాజు.*

*'నా గురించి నువ్వు అలా అనుకోవడం ఏమీ బాగాలేదు. నీ ప్రాణం నేను రక్షించాను. అలాగే సాధ్యమైనంత త్వరగా నా ప్రాణం కూడా రక్షించడం నీ ధర్మం' అంది పిల్లి.*

'తొందరపడకు. తెల్లవారుతోంది. అల్లంత దూరాన వేటగాణ్ణి చూస్తూనే నీ కీ చెర తప్పిస్తాను' అన్నాడు పలితుడు.

'అయ్యయ్యో! అడుగో వేటగాడు! కుక్కల్ని వెంటబెట్టుకుని వస్తున్నాడు. చేతిలో కత్తి కూడా ఉంది! త్వరగా నన్ను కాపాడు' అంది బిడాలం గజగజా వణుకుతూ. 'భయపడకు భయపడకు' అంటూ ఎలుక గబగబా ఆ వల తెగ కొరికింది. పిల్లి ప్రాణభయంతో చరచరా చెట్టెక్కింది. ఎలుక వెంటనే కన్నంలోకి దూరింది. వేటగాడు వల పాడైనందుకు విచారిస్తూ అక్కడి నుంచి వెళ్లిపోయాడు.

తరువాత పిల్లి మెల్లిగా కన్నం దగ్గరకు వచ్చి, 'మిత్రమా! నువ్వూ, నేనూ ఒకరికొకరం ఉపకారం చేసుకుని మంచి స్నేహితుల మయ్యాం. ఇప్పుడు నీ కింత అపనమ్మకం ఎందుకు? రా మనిద్దరం హాయిగా కలిసి జీవిద్దాం. నీకు అండగా ఉంటాను నేను' అంది.

'పిల్లిరాజా! నీ మాటలు బాగానే ఉన్నాయి. కాని శత్రువుల్నీ, మిత్రుల్నీ తెలుసుకోవాలంటే చాలా సూక్ష్మదృష్టి ఉండాలి. ఒక్కొక్కప్పుడు శత్రువులే మిత్రులవుతారు. మిత్రులే శత్రువు లవుతారు. కనుక నీ దగ్గరకు రావడం మంచిది కాదు. నువ్వు నాయందు అభిమానం చూపించినా, నేను ఏమరడం మంచిది కాదు. ఇలాగే నీ పొరుగున ఉండి అవసరమైనప్పుడు నీకు మేలు చేస్తుంటాను. అంతేగాని, నీ దగ్గరకు రాను. అదీగాక నేను నీకు ఆహారాన్ని.

**ఇతరులు తనను నమ్మేటట్టు ప్రవర్తిస్తూ, తాను మాత్రం ఎవరినీ నమ్మకుండా ఉండడమే నీతి. అదే బతుకుతెరువు.**

నన్ను చూడగానే నీకు మనస్సులో నన్ను తినాలనే కోరిక పుడుతుంది. రాత్రంతా వలలో చిక్కి ఆకలితో ఉన్నావు. నీకు ఉపాహారం కావల్సివచ్చి నన్ను పిలుస్తున్నావు' అన్నాడు ఎలుకరాజు.


'అయ్యయ్యో... నా ప్రాణరక్షకుడికి అపకారం చేస్తానా?' అంది పిల్లి.

'అదంతా ఎందుకు? నా వల్ల నీవూ, నీవల్ల నేనూ బతికాం. ఆ స్నేహం చాలు మనకు. అంతకుమించి చెలిమి మంచిది కాదు. ప్రయోజనం ఉన్నప్పుడు బలవంతుడైన శత్రువుతో కలిసి ఉండి, ఆ ప్రయోజనం తీరగానే విడిపోవాలి. నమ్మి అక్కడే ఉంటే కీడు తప్పదు. నమ్మతగనివాళ్లను నమ్మనేకూడదు. ఇతరులు తనను నమ్మేటట్టు ప్రవర్తిస్తూ, తాను మాత్రం ఎవరినీ నమ్మకుండా ఉండడమే నీతి. అదే బతుకుతెరువు. నీలాంటివాళ్లను నమ్మకుండా నేనూ, శూద్రుడులాంటి వాళ్లను నమ్మకుండా నువ్వూ బతికిపోదాం. ఇంకేం మాట్లాడకు వెళ్ళు' అన్నాడు పలితుడు.

పిల్లి సిగ్గుపడి వెళ్ళిపోయింది. ఆ తరువాత ఆ ఎలుక అక్కడ చెట్టుకింద కన్నంలో ఉండడం క్షేమం కాదని మరోచోటికి తరలివెళ్ళింది ●

# 30. మైండ్ కంట్రోల్

'**బు**ద్ధిని అదుపుచేయడం ఒక అద్భుతమైన క్రీడ. ఎవరికి వారు నేర్చుకోవలసిన, ఆడుకోవలసిన ఆట అది. ఓ పక్క ఓడిపోతున్నా ఆటను కొనసాగిస్తూ ఆనందించడమన్నది నిజమైన క్రీడాకారులే చెయ్యగలరు. అలాంటి లక్షణం ఉంటేగాని బుద్ధిని అదుపుచేసే ఆట ఆడలేం. ప్రతిభ, ఏకాగ్రత, చతురత, హాస్యప్రియత్వం, వ్యూహరచనలో నేర్పు, సహనం, ధీరోదాత్తత వంటి గుణాలు ఉంటేనే ఎవరైనా ఈ ఆటలో విజయం సాధిస్తారు. అభ్యాస వైరాగ్యాలతో బుద్ధిని అదుపుచేయడం కష్టంకాదని శ్రీకృష్ణదేవుడు చెబుతున్నాడు. యోగులకు భూతరహితం, సద్వ్రతాచరణం,



శౌచం అవసరం. రాగ మోహ క్రోధ మమకారాలు అసలు పనికిరావు. నియమంగా ఉంటే తప్ప ఇలాంటి యోగబలం కలగదు. ప్రవాహవేగం బలహీనుణ్ణి ఈడ్చుకు పోయినట్టు యోగబలం లేనివాణ్ణి ఇంద్రియసుఖాలు తమలోకి ఈడ్చేసుకుంటాయి. బలంగల మహాయోగిని యముడూ, మృత్యువూ కూడా ఏమీ చెయ్యలేరు. నిజానికి యోగులూ భోగాలు అనుభవిస్తారు. కాని, విషయసుఖాలు వారిని అంటవు. అదీ చిత్రం' అని భీష్ముడు పాండవులకు చెప్పాడు.

**బుద్ధినీ, మనస్సునూ చెప్పుచేతుల్లో పెట్టుకోలేని వాళ్లు వ్యక్తిత్వాన్ని వికసింపచేసుకోలేరు.**

Who conquers the world? He alone who conquers his mind.

ఎవరు బుద్ధిని అదుపులో ఉంచుకోగలుగుతారో, వాళ్లు ఈ లోకాన్ని జయిస్తారు. లోకాన్ని జయించాలంటే ముందు మనల్ని మనం జయించాలి. అంటే కోరికల్ని జయించాలి. మనుషులు కోరికల్ని విడిచిపెడితే మేఘాలు దాటిన పూర్ణచంద్రుడిలా ప్రకాశిస్తారు. ఏ ధనం తనది అనుకోకపోయినా సంతోషమిస్తుందో, ఏ వస్తువు అనుభవించకపోయినా బలిమి నిస్తుందో, ఏ పదార్థం తినకపోయినా తృప్తి నిస్తుందో అటువంటిదాన్ని పొందాలని వేదాలు చెబుతున్నాయి. అది లభిస్తే కర్మలూ, గుణాలూ, కోరికలూ, అన్నీ అణిగి పోతాయి.

'Our will to control the mind can never be strong until and unless we have deliberately and irrevocably renounced pleasure as one of the main pursuits of our life' అని కలకత్తాలోని అద్వైత ఆశ్రమానికి చెందిన స్వామి బుధానంద చెప్పారు. 'ది మైండ్ అండ్ ఇట్స్ కంట్రోల్' అన్న పుస్తకంలో స్వామి 'కోరికల్ని విడిచి పెట్టేశాం అనుకుంటే సరిపోదు. ద్వంద్వాల వైపు, బంధాలవైపు, సుఖాలవైపు మనస్సు ఎప్పుడూ

లాగుతూనే ఉంటుంది. గత అనుభవాల్ని గుర్తుచేసి వేధిస్తూనే ఉంటుంది. నిశ్చలమైన బుద్ధి ఉంటేగాని ప్లెజర్ మోటివ్ నుంచి తప్పించుకోలేం. బుద్ధినీ, మనస్సునూ చెప్పుచేతుల్లో పెట్టుకోలేని వాళ్లు వ్యక్తిత్వాన్ని వికసింపచేసుకోలేరు. A person of uncontrolled mind will always have a tendency to abnormal developments. మనస్సు నెప్పుడూ కడిగిన ముత్యంలా ఉంచుకోవాలి. సత్వ, రజో, తమో గుణాలనేవి మూడూ ఇంప్యూరిటీస్‌కి మూలం. మెల్లమెల్లగా వాటిని వదిలిపెట్టాలి. ఇంకోటేమిటంటే, పరిశుభ్రమైన ఆహారం, న్యాయార్జిత విత్తంతో సమకూర్చుకున్న ఆహారం తినడం మూలంగా సద్బుద్ధులు కలుగుతాయని ఉపనిషత్తులు చెబుతున్నాయి. మనం తీసుకునే ఆహారం మూడురకాలుగా మార్పు చెందుతోంది. శక్తిమంతమైనదంతా బుద్ధిని చేరుతోంది. అట్టడుగుదంతా వ్యర్థపదార్థంగా బయటకు వచ్చేస్తోంది. మధ్యనున్నది రక్తమాంసాలను కలిగిస్తోంది. పెరుగును చిలుకుతుంటే అందులోని శక్తి అంతా పైకి వెన్నలా తేలుతున్నట్టే మనం ఆహారం తీసుకుంటున్నప్పుడు విలువైన పదార్థమంతా బుద్ధిగా మారుతోంది. కనుక మనం తీసుకునే ఆహారం శుభ్రమైనదైతే బుద్ధి కూడా అభ్రకపు రేకులా స్వచ్ఛంగా, తేటగా ఉంటుంది. బుద్ధి ఎప్పుడైతే తేటగా ఉంటుందో అప్పుడు ఏకాగ్రత కలుగుతుంది. దానివల్ల మనస్సు ఒక లక్ష్యాన్ని చేరుతుంది. ఆ తరువాత ఆ లక్ష్యంపట్ల స్థిరంగా ఉంటుంది. ఇంత కథ ఉంది మైండ్ కంట్రోల్ వెనుక' అని చెప్పారు.

**మనం తీసుకునే ఆహారం శుభ్రమైనదైతే బుద్ధి కూడా అభ్రకపు రేకులా స్వచ్ఛంగా, తేటగా ఉంటుంది.**

శరీరం పట్టణం. దానికి బుద్ధి రాణి. సర్వవిషయాలూ చర్చించే మనస్సు మంత్రి.

విషయాలు అయిదూ పురోహితులు. చెవి, ముక్కు మొదలైన ఇంద్రియాలు పౌరులు.

ఈ శరీర సామ్రాజ్యంలో సత్వ, తమో, రజో గుణాలనే మోసగాళ్లున్నారు. బుద్ధిని వక్రమార్గంలోకి మళ్లించేందుకు వాళ్లెప్పుడూ ప్రయత్నిస్తుంటారు. కనుక బుద్ధి వాళ్ల బారినపడి చెడిపోకూడదు. మనస్సూ, బుద్ధీ కలిసి ఏకముఖంగా కార్యవిచారం చేసుకుంటే రాజ్యం చక్కగా సాగుతుందని భారతంలో వేదవ్యాసుడు చెప్పాడు ●

# 31. భూతదయ


**ఈ** సృష్టి అంతా మనకోసమే అనీ, బతకాలనే కోరిక మనకు మినహా మరే ప్రాణికీ ఉండదనీ, అనుభవాలూ, అనుభూతులూ అన్నీ మనకే సొంతమనీ అనుకుంటాం కాని, సర్వప్రాణులకూ తమవైన సుఖదుఃఖాలు ఉంటాయని భీష్ముడు ధర్మరాజుకు చెప్పాడు.

*ఒకసారి బళ్లు పోయే మార్గంలో గబగబ పరుగెడుతూన్న ఒక కీటకం వ్యాసులవారికి కనిపించింది. 'ఎందుకలా భయపడి పారిపోతున్నావ్?' అని ఆ పురుగును అడిగాడాయన.*

*'మహాత్మా! కుప్పలుతెప్పలుగా బళ్ళు వస్తున్నాయ్. చక్రాలధ్వనీ, ఎడ్లను తోలుతూవస్తున్న మనుషుల రొదా వినిపిస్తున్నాయ్. అది వింటేనే నా ప్రాణాలు పైకెగిరిపోతున్నాయి. బండి చక్రాల కింద పడి ఎక్కడ చచ్చిపోతానో అని భయంతో పారిపోతున్నాను. నన్నాపకండి. అదిగో, ఆ బళ్ళు తోలేవాళ్ళను చూడండి, కర్రలతో ఎడ్లను కొడుతూ పెద్దగా ఎలా అరుస్తున్నారో! పాపం ఆ ఎడ్లు రొప్పుకుంటూ పిక్కబలం అంతా కూడదీసుకుని పరుగెడుతున్నాయి. అమ్మనాయనో! అవి మనవేపే వచ్చేలా ఉన్నాయ్. ఇప్పుడేం గతిరా దేవుడా! సుఖానున్న ప్రాణికి దుఃఖం తెచ్చి పెట్టావు' అని బావురుమని ఏడ్చింది పురుగు.*

*దాని ఏడుపు చూసి వ్యాస మహర్షి 'నీ జన్మ ఏం గొప్పది? నువ్వో పురుగువి. నీకేం ఇంద్రియ సుఖానుభవం ఉంది? నువ్వు చస్తేనేం, బతికితేనేం?! నేనైతే నీకు చావే మేలనుకుంటున్నాను' అన్నాడు.*

*'సర్వత్ర నిరతో జీవ ఇతశ్చాపి సుఖం మమ ।*
*చింతయామి మహాప్రాజ్ఞ*
*తస్మాదిచ్ఛామి జీవితుమ్!!*



‘అయ్యా! మహా ప్రాజ్ఞుడవు నువ్వు. నేనేం చెబుతానోనని అలా అన్నావుగానీ, నీకు తెలియని విషయముందా? అయినా అడిగావు కాబట్టి చెబుతాను. కీటకాలకు ఇంద్రియసుఖాలు లేవని ఎవరన్నారు? వాటివాటికి తగినట్టు సకల ప్రాణులూ భోగాలను అనుభవిస్తాయి. జీవునికి అన్నిరకాల శరీరాల్లోనూ సుఖం ఉంటుంది. అందువల్లనే నేను బతికి ఉండాలను కుంటున్నాను. నేను పూర్వజన్మలో చాలా ధనువంతుణ్ణి. నాకు అనేక దుర్గుణాలు ఉండేవి. అయితే, అతిథులకూ, గురుజనులకూ, స్నేహితులకూ, బంధువులకూ తృప్తిగా భోజనం పెట్టకుండా ఏ పూటా నేను తినేవాణ్ణి కాదు. మా అమ్మ అంటే నాకు చాలా ఇష్టం. ఆమెను ఎప్పుడూ భక్తితో పూజించేవాణ్ణి. ఆ రెండు పుణ్యకర్మల వల్లా పూర్వజన్మస్మృతి కలిగింది నాకు’ అంది పురుగు.

‘గతంలో నీకున్న దుర్గుణాలవల్లే ఇప్పుడు నీకీ జన్మ వచ్చిందని నాకు తెలుసు. అయితే నువ్వు చేసిన సత్కర్మలకు సంతోషించే నేను నీతో మాట్లాడుతున్నాను. తల్లిని మించిన దైవం లేదు. నవమాసాలూ మోసి కనే తల్లి కంటే ఎక్కువేదీ లేదు. తల్లిని భక్తితో సేవించినవాడవు కనుకనే పూర్వజన్మస్మృతీ, నా దర్శనమూ కలిగాయి నీకు. ఉన్నతపద మిస్తాను. విచారించకు’ అని అనుగ్రహించాడు వ్యాసుడు.

*ఆయన భూతదయను సమస్తభూతాలూ కీర్తించాయి. ఆ పురుగు ఆయన పాదాలమీద తల మోపి నమస్కరించి, ఆ తరువాత చనిపోయింది. మరుసటి జన్మలో రాజై పుట్టి రాజ్యం ఏలింది. ఒకనాడు ఆ రాజు ఏనుగెక్కి దేవ వైభవంతో వ్యాసభగవానుడి ఆశ్రమానికి వెళ్లి ఆయనకు నమస్కరించాడు. వ్యాసుడు సంతోషించి, 'నాయనా! నువ్వు పరిశుద్ధమైన మనస్సుతో చేస్తున్న పుణ్య కర్మలన్నీ నాకు తెలుస్తున్నాయి. రాజువైనా అహంకారం లేకుండా సర్వజీవుల పట్లా దయ కలిగి ఉన్నావు. ఋజువర్తన కలిగి ఉన్నావు. నీలో అలసత్వం, గర్వం, క్రోధం, మాత్సర్యం మచ్చుకైనా లేవు. ఒకరిని నిందించకుండా, నిన్ను నీవు పొగుడుకోకుండా మనోమాలిన్యాలన్నీ తొలగించుకున్నావు. ఉత్తములపట్ల గౌరవం చూపిస్తున్నావు. శక్తి ననుసరించి అతిథి సేవ చేస్తున్నావు. సర్వశాస్త్రాలూ చెప్పే నీతిని పాటిస్తున్నావు. నాకు సంతోషంగా ఉంది. వచ్చే జన్మలో ముక్తి పొందుతావులే' అన్నాడు.*

*ఆ రాజు అలాగే జీవన్ముక్తుడయ్యాడు.*

'ఉమామహేశ్వరం సంవాదం' అనే ఇతిహాసంలో పరమేశ్వరుడు పార్వతికో రహస్యం చెబుతాడు.

అదేమిటంటే – పూర్వం మనుష్యులందరికీ పూర్వజన్మ జ్ఞానం ఉండేదిట. అందుచేత పాపాలు చెయ్యడం మానేసి అందరూ స్వర్గానికి వెళ్తుండేవారు. దానితో దేవలోకంలో సందడి ఎక్కువైంది. జనంతో కిక్కిరిసిపోయింది. దీన్నెలా పరిష్కరించడమా అని బ్రహ్మదేవుడు ఆలోచించాడు.

**కీటకాలకు ఇంద్రియసుఖాలు లేవని ఎవరన్నారు? వాటివాటికి తగినట్టు సకల ప్రాణులూ భోగాలను అనుభవిస్తాయి.**

మానవులకు పూర్వజన్మస్మృతి లేకుండా చేసి కామక్రోధాలు కలిగిస్తే అందరూ పాపాలు చేసి నరకానికి పోతారనుకున్నాడు. కానీ అదీ సమస్యేగా! కొన్నాళ్లకి నరకలోకం పట్టదు. పైగా అది న్యాయం కూడా

కాదనిపించింది విరించికి. స్వర్గనరకాలకు నరులను సమానంగా పంపాలని నిర్ణయం చేసుకున్నాడు. కనుక మనుషులకు పూర్వజన్మస్మృతి లేకుండాచేసి, ఇహపరసాధనను వాళ్లు శాస్త్రాల వల్ల తెలుసుకునేటట్టు చేశాడు బ్రహ్మ. శాస్త్రాలు చదవడంవల్ల చెయ్యదగిన పనులూ, చెయ్యకూడని పనులూ తెలుస్తాయి. బుద్ధి కలతపడదు. అందుకే ప్రతి మనిషీ చదువుకోవాలని చెప్పడం. అదీ సంగతి! ●

# 32. సమాచార హక్కు

**ఆ** మధ్య ఢిల్లీలో రక్షణ ఒప్పందాలకు సంబంధించిన అవినీతి భాగవతాన్ని బయటపెట్టిన న్యూస్ పోర్టల్ తెహల్కా డాట్ కామ్ విలేఖర్లను కొందరు ఫోన్లలో 'చంపేస్తాం' అని బెదిరించారు. ఒకసారెప్పుడో చెన్నయ్‌లో అర్ధరాత్రి అరెస్టులు జరిగినప్పుడు, అరెస్టులకు సంబంధించి వాస్తవాలను ప్రజలకు సరిగా వివరించలేదని అక్కడి అధికారగణం మీడియాపై విరుచుకుపడింది. అదిచాలక ఒక ప్రైవేటు టెలివిజన్ చానెల్ విలేకరిపై అక్రమంగా కేసులు నమోదు చేసి అతనిచేత జైలు ఊచలు లెక్కపెట్టించారు. వార్తాసేకరణకు వెళ్లిన విలేకరిపై దాడిచేసి హత్యాయత్నం కేసు పెట్టడం దారుణమని పలు జర్నలిస్టుల సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. నిరసన తెలిపాయి, నినాదాలు చేశాయి. ఏమి చేసినా, అవన్నీ అరణ్యరోదనే అయ్యాయి. అధికారులకు నైతికత అవసరం. ఎవరు అధికారంలో ఉంటే వారికి 'జై' అనడం మంచిపద్ధతి కాదు. తాము ఎప్పుడూ రాజ్యాంగానికి విధేయులై ఉండాలేతప్ప రాజకీయనాయకులకు కాదని అధికారులు తెలుసుకోవాలి.

> **తాము ఎప్పుడూ రాజ్యాంగానికి విధేయులై ఉండాలేతప్ప రాజకీయనాయకులకు కాదని అధికారులు తెలుసుకోవాలి.**

ఇదంతా ఎందుకు చెప్పవలసి వచ్చిందంటే; భారతంలో ఒకచోట నారదుడు ధర్మరాజుతో అంటాడు.

*వార్తయందు జగము వర్తిల్లు చున్నది. యదియు లేనినాఁడ యఖిల జనులు*

*నంధకారమగ్ను లగుదురు గావున వార్త నిర్వహింపవలయుఁ బతికి*

వార్తలలోనే అఖిల ప్రపంచం నిలిచి

ఉంటుంది. వార్త లేకపోతే ప్రజలంతా అంధకారంలో చిక్కుకుంటారు. గుడ్డివాళ్లతో సమానులవుతారు. ప్రజలకు రైట్ టు ఇన్‌ఫర్మేషన్ ఉండాలని గగ్గోలు పెట్టేది అందుకే.

ప్రజలకు జీవించే హక్కు ఎలా ఉందో, కనీస అవసరాలైన కూడు, గూడు, గుడ్డ కావాలని అడిగే హక్కు ఎలా ఉందో, అలాగే ప్రపంచంలో ఏ మూల ఏది జరిగినా అది తమకు తెలియాలనీ, తెలియచెప్పాలనీ అడిగే హక్కు కూడా ఉంది. కాబట్టి పాలకులు వార్తానిర్వహణను సజావుగా, సక్రమంగా రాజకీయాలకు అతీతంగా, నిష్పక్షపాతంగా జరగనివ్వాలి.

**రాజనీతికి సంబంధించిన విద్యలు నాలుగు, అన్వీక్షకి, త్రయి, వార్త, దండనీతి అని పిలుస్తారు వాటిని.**

రాజనీతికి సంబంధించిన విద్యలు నాలుగు. అన్వీక్షకి, త్రయి, వార్త, దండనీతి అని పిలుస్తారు వాటిని.

సమస్తవిజ్ఞానాన్నీ తెలియచేసేది అన్వీక్షకి. ధర్మాధర్మవివేకాన్ని కలిగించేది త్రయి. అర్థానర్థాలనూ మంచిచెడులనూ తెలిపేది వార్త. నయాన భయాన చెప్పేది దండనీతి. ఈ నాలుగు రకాల విద్యలలో వార్త ప్రధానమైనది కనుక దాన్ని పాలకులు సరిగా నిర్వహించుకోవాలని నారదుడు చెప్పాడు. మానవవిజయాలన్నీ మంచిచెడుల విచారణ, అర్థానర్థాల విశ్లేషణ పైనే ఆధారపడి ఉంటాయి. అందుకని వార్తానిర్వహణకు అవరోధాలు లేకుండా జాగ్రత్తపడాలి. పత్రికలపైనా, ప్రచార–ప్రసార సాధనాలపైనా పాలకులు కత్తి కట్టడం, దమనకాండ సాగించడంవల్ల ప్రజాస్వామ్యం నవ్వులపాలు అవుతుంది. మనకు ఎన్ని కష్టాలు వచ్చినా, మనం సగర్వంగా చెప్పుకుంటోంది గడచిన ఆరు దశాబ్దాలుగా మనం కాపాడుకుంటూ వస్తున్న మన ప్రజాస్వామ్యం గురించే! అది కూడా పోతే చీకటి మిగులుతుంది.

చీకటిరాజ్యం, చీకటి మనుషులూ లేకుండా ఉండాలంటే వార్త విశ్వవ్యాపితం కావాలి.



మహాభారతంలో వ్యాసుడు 'సాధుభిః జనైః–' సజ్జనులతో కూడి వార్తను అనుష్ఠించాలనీ, ప్రజల అభిప్రాయప్రకటనా స్వేచ్ఛను గౌరవించాలనీ చెప్పాడు. రాజ్యనిర్వహణలో గ్రామస్థాయిలో పౌర–జానపదులు ఏర్పాటు చేసుకునే సమితులకూ, రాజే స్వయంగా ఏర్పాటు చేసుకునే రాజసభలకూ, రాజుకు సలహా లిచ్చే సంప్రదింపుల సంఘాలకూ ప్రాధాన్యం ఉండాలని చెప్పాడు.

అంటే భారతకాలంలో రాజ్యం నలుమూలల నుంచీ సామాన్యప్రజలు వచ్చి ప్రభువుకు తమ కష్ట సుఖాలు చెప్పుకునే వారన్నమాట. వాళ్లద్వారా తన పరిపాలనను గురించిన మంచిచెడ్డలన్నీ రాజు తెలుసుకునేవాడు. ఎక్కడెక్కడి సమాచారమూ ఆయనకు అలా అందేది. ఇదిగాక, ఉత్తములైన మంత్రులు, ఆంతరంగికులు, పురోహితులు, విజ్ఞులు, సాధుజనులతో

ప్రత్యేకంగా రాజసభను ఏర్పాటు చేసుకుని తాను తలపెట్టిన కార్యాలన్నింటినీ ప్రజల సమక్షంలో రాజు చర్చించేవాడు. ఆ తరువాత తన పరిపాలన ఏ విధంగా సాగుతోందీ ప్రజలను అడిగి తెలుసుకునేవాడు. పొరపాట్లు ఉంటే సరిదిద్దుకునేవాడు.

**సమాచారమంతా ఎప్పటికప్పుడు తెలుసు కుంటూ, కార్యాకార్యాలు గమనించుకుంటూ నడుచుకోవడం పాలకులకు అవసరం.**

రాజుకు సలహాలిచ్చే సంఘాలు మరికొన్ని విడిగా ఉండేవి. మనం ఇప్పుడు వాటిని పార్లమెంటరీ కన్సల్టేటివ్ కమిటీలని పిలుస్తున్నాం. ప్రభుత్వ విధానాలను అమలుపరిచే సమయంలో ఈ సలహా సంఘాలు సూచనలిచ్చేవి. 'అర్థానర్థనిర్ణయంలో రాజు తగిన వారితో కలిసి చర్చించాలేగాని, తన ఆలోచనే తిరుగులేనిదన్న అహంభావంతో వ్యవహరించ కూడదు. ఆ విధమైన ప్రవృత్తివల్ల అనర్థాలు ఎక్కువగా జరుగుతాయి. కాబట్టి ఏదో ఒకవిధంగా తన పరిపాలనా వ్యవహారాలకు సంబంధించిన సమాచారమంతా ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, కార్యాకార్యాలు గమనించుకుంటూ నడుచుకోవడం పాలకులకు అవసరం' అని భీష్ముడు ధర్మరాజుతో చెప్పాడు.

ఆ మధ్య ఒకసారి చండీఘడ్‌లో భారత చట్టసభల స్పీకర్లు, ప్రిసైడింగ్ ఆఫీసర్ల సమావేశం జరిగింది. ప్రజాస్వామ్య వ్యవస్థను పటిష్ఠపరచ డానికి 'మీడియా' తనవంతు సహకారం అందించాలని ఆ సదస్సు పిలుపు నిచ్చింది.

ప్రజాస్వామ్యవ్యవస్థకు మాయనిమచ్చగా మిగులుతున్న ప్రజాప్రతినిధుల అనుచితప్రవర్తనను పత్రికలు నిర్ద్వంద్వంగా ఖండించాలనీ, వారి నీతిబాహ్యమైన ప్రవర్తనను ఎండగట్టాలనీ స్పీకర్ల సదస్సు కోరింది. ఫోర్త్ ఎస్టేట్ అయిన మీడియా సమాజానికి ధర్మకర్తృత్వం వహించాలని కూడా విజ్ఞప్తి చేసింది. చట్టసభల్లోనూ దేశవ్యాప్తంగా ఇతరత్రా కొన్ని ప్రాంతాల్లోనూ

పెరుగుతున్న రాజకీయరుగ్మతలకు మీడియాయే చికిత్స చేయాలన్న అభిప్రాయాన్ని ఆ సదస్సు గట్టిగా వ్యక్తం చేసింది. కాని, విచిత్రంగా, ఆ సదస్సు జరిగిన వారం రోజులకే చెన్నయ్ మహానగరంలో విపరీత రాజకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. వాటికి సంబంధించిన క్లిప్పింగులు చూపితే ఊరుకునేది లేదని ఒక టీవీ చానెల్‌ను పోలీసు అధికారులు హెచ్చరించారు. వాటి ప్రసారాన్ని మానుకోనట్లయితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అయితే, భావవ్యక్తీకరణకు వీలుకల్పిస్తున్న రాజ్యాంగంలోని 19వ అధికరణానికి లోబడే ఈ ప్రసారాలు చేస్తున్నట్టు ఆ టీవీ చానెల్ స్పష్టం చేసింది.

సమాజప్రగతికి పత్రికలే పట్టుగొమ్మలు. ఏ ఒక్క ఉద్యమానికో, పోరాటానికో పరిమితంకాని, ఏ రాజకీయపార్టీకీ దాసోహం అనని, ఏ ప్రలోభాలకూ లొంగని పత్రికలు రావాలి. ప్రజల ఆశలకూ, ఆశయాలకూ, ఆకాంక్షలకూ అవి నిలువుటద్దాలు కావాలి. సమాజహితాన్నీ, భవితవ్యాన్నీ త్రికరణశుద్ధిగా కాంక్షించాలి.

సర్వేజనాస్సుఖినో భవన్తు! ●

# 33. పార్టిసిపేట్ ఇన్ సమ్‌వన్స్ గ్లోరీ

'మీరు చేసిన రాజసూయ యాగానికి దుర్యోధనుడు వచ్చాడు. అక్కడ, ఇంద్రవైభవ ప్రతాపాలను మించి ఉన్న మీ భోగభాగ్యాలనూ, పరాక్రమాన్నీ చూసి అతను కుళ్ళుకున్నాడు. రాజసూయ యాగ మప్పుడు మీ కోసం రాజులందరూ తెచ్చిన కానుకలు చూసి అతని కళ్ళు తిరిగిపోయాయిట. అతనే చెప్పాడు.

'అది ఉంది, ఇది లేదు అని అనకుండా ప్రశస్తమైన రత్నాలన్నీ ధర్మరాజు గృహంలో కుప్పతెప్పలుగా ఉన్నాయి. శంఖాలూ, ముత్యాలూ, పగడాలూ, చందనాది సుగంధ ద్రవ్యాలూ, సూర్యకాంతిని కూడా చిన్నబుచ్చే మణిహారాలూ, హంసతూలికాతల్పాలూ, దంతపు సింహాసనాలూ, పల్లకీలూ...ఒకటేమిటి - పాండవ ఐశ్వర్యాన్ని పోలినంత ఐశ్వర్యం ఇది వరకు ఎవరికీ లేదు, ఇప్పుడు నాకూ లేదు, ఇకముందెవరికీ ఉండబోదు కూడా! పాండవులంతగా వృద్ధి చెందుతుంటే నేను చూడలేకపోతున్నాను. ఈర్ష్యాగ్నితో నా శరీరమంతా దహించుకుపోతోంది. ఎలాగైనా పాండవ రాజ్యలక్ష్మిని అపహరించాలి. అప్పటివరకు నాకు శాంతి లేదు' అని శకుని చేతులు పట్టుకుని పెద్దగా ఏడ్చాడు.

సుయోధనుడిది చాలా చిన్న ప్రపంచం. అతనూ, అతని మూర్ఖసోదరులూ, గుడ్డి తండ్రి, మందవంటి అనుయాయులూ, అనుచరులూ తప్ప అతనికి వేరే ప్రపంచ మేముంది? ఉందని అతను అనుకోనూలేదు, ఉండాలని కోరుకోనూలేదు. అన్నీ తనే అనుకున్నాడు. అన్నీ తనకే

> 'పాండు లంతగా వృద్ధి చెందుతూంటే నా శరీరమంతా దహించుకుపోతోంది' అని ఏడ్చాడు రారాజు.

> **ఎవరైనా ఏమైనా ఎచీవ్ చేస్తే అది వాళ్ళ సొంత ప్రయోజకత్వం కాదని మరొకరెలా తీర్మానం చేస్తారు?**

చెందాలనుకున్నాడు. అందమైనవీ, అనుభవింప దగినవీ ప్రపంచంలో ఏవి ఉన్నా అవి మొదట తనకే సొంతం కావాలనుకున్నాడు. మితిమీరిన అహంభావం, హద్దులు మీరిన స్వార్థం కదూ అది! అందుకే అసూయతో రగిలిపోయి మీతో యుద్ధం కొనితెచ్చుకున్నాడు. వంచన, జూదాలతో మిమ్మల్ని నాశనం చెయ్యబోయి తనే నాశనమయ్యాడు. కనుక ఎటువంటి పరిస్థితిలోనూ అసూయను దరిచేరనివ్వకండి. తరువాత చింతించాల్సి వస్తుంది' అని వాళ్ల అన్నదమ్ముల కథనే పాండవులకు ఉదాహరణగా చెప్పాడు భీష్ముడు.

చరిత్రంతా ఇంతే! అసూయామాత్సర్యాలే చరిత్రను మలినపరచాయి. ఎందరో రాజులూ, రాణులూ, చక్రవర్తులూ పగ, అసూయలతో రగిలిపోయి ఇరుగు పొరుగులతో శత్రుత్వాన్ని పెంచుకుని, వాళ్లను హతమార్చి చివరకు అందరూ హతులయ్యారు.

జెలసీ అన్నది మానవ బలహీనత. హ్యూమన్ వీక్‌నెస్. చదువుకున్నవాళ్లు, చదువుకోని వాళ్లు అన్న తేడా లేకుండా అందర్నీ వేధిస్తుంధీ వ్యాధి. ఆ మధ్య మా ఇంటి కో మిత్రురా లొచ్చింది. మంచి కవయిత్రి. చాలా బాగా రాస్తుంది. మాటల మధ్యలో చెప్పింది, ఈ మధ్యేవరో తనను అడిగారట, 'మీకు చాలా అవార్డులు వచ్చాయి కదా. ఎవరిని పట్టుకుంటే అవార్డులొస్తాయి' అని. మా ఫ్రెండ్ బాగా అప్‌సెట్ అయింది. 'How on earth one could talk like this? ఎవరన్నా ఏమైనా ఎచీవ్ చేస్తే అది వాళ్ల సొంత ప్రయోజకత్వం కాదని వీళ్లెలా తీర్మానం చేస్తారు? అందరూ అవార్డులను కొనుక్కుంటారని వీళ్లెందుకు నీచంగా అనుకుంటారు?' అని బాధపడింది.

బాధపడేం లాభం? మనుషులే అంత! మన స్వభావాలే అంత! మనకు అలాంటి ఆలోచనలే వస్తాయి. వీ ఆర్ ఆల్వేస్ ఎన్వియస్ ఎబౌట్ సమ్‌బడీస్ ఎచీవ్‌మెంట్స్. మనకు ఎవరి విజయాలూ రుచించవు. ప్రతిదానికీ నెగెటివ్‌గా మట్లాడతాం.

జీవితంలో ఎన్నో సాధించాలనుకుంటాం. కానీ, సాధించలేకపోవచ్చు. సక్సెస్ ఆర్ అచీవ్‌మెంట్ డిపెండ్స్ అపాన్ సో మెనీ ఫాక్టర్స్. కష్టే ఫలి అంటారు కాని, శ్రమ ఒక్కటే సరిపోదు. కాలం కలసిరావాలి. అవకాశం అంది రావాలి. మన కృషిని ప్రోత్సహించే సన్మిత్రులుండాలి. మనకు బాసటగా నిలబడే ఆత్మీయు లుండాలి. వీటన్నిటినీ కలిపే అదృష్టమని పిలుస్తారేమో నాకు తెలీదు. అలాంటి 'లక్' కూడా ఉండాలి.



కానీ పనిచేసేవాడికి చేసుకుపోవడ మొక్కటే తెలియాలి. చేస్తున్న పనిపట్ల నమ్మకం, విశ్వాసం ఉండాలి. నిరంతర ప్రయత్నం ఉండాలి. దీక్ష ఉండాలి. ఇంతచేసినా ఒక్కోసారి ఫలితం ఉండకపోవచ్చు. యు మే నాట్ ఎచీవ్. దట్ డజ్ నాట్ మీన్ యూ ఆర్ ఇన్ఫీరియర్ ఆర్ లెస్. మనం సాధించలేకపోయింది ఇతరులు సాధిస్తే మనం వాళ్లను మనఃపూర్వకంగా అభినందించాలి. వాళ్ల సంతోషంలో పాలు పంచుకోవాలి. అదీ సంస్కారం ●

# 34. బూరుగ గర్వభంగం

**బ**లవంతులతో దుర్బలు లెప్పుడూ పోటీ పడకూడదని భీష్ముడు చెప్పాడు. రాజనీతికి సంబంధించిన అనేక విషయాలను పాండుకుమారులకు చెబుతూ ఆసక్తికరమైన కథ ఒకటి చెప్పా డాయన.

అదేమిటంటే...

*'బూరుగా! ఈ హిమపత్పర్వతంమీద ఎన్నో ఏళ్ల నుంచి ఉన్నావు. ముదురుకొమ్మలతో, మూలబలంతో చక్కగా నిలబడ్డావు. నీ అంత పొడుగు, వైశాల్యం ఉన్న చెట్టు మరొకటి లేదిక్కడ. గాలికి అన్ని చెట్లూ కూలిపోతాయి గాని, నువ్వు మాత్రం స్థిరంగా ఉంటావు. ఏమిటి కిటుకు? నీకూ, వాయు దేవుడికీ ఏదైనా చుట్టరికం ఉందా? లేకపోతే అతను దయతలచి రక్షిస్తూంటే వినయంగా బతుకుతున్నావా?' అని అడిగాడు నారదుడు, ఒకసారి హిమాలయపర్వతశ్రేణులగుండా వెళుతూ.*

*'మునీంద్రా! తెలియక మాట్లాడినట్టున్నావు. వాయుదేవుడు నన్ను రక్షించడమేమిటి?' అంది గర్వంగా బూరుగ.*

*'అమ్మమ్మ... అలా అనకు. వాయుదేవుడు తలుచుకున్నాడంటే కొండలే కూలిపోతాయి. సర్వభూతాల చేష్టలూ వాయువశమై ఉంటాయి' అన్నాడు నారదుడు.*

*'నా మొదలూ, కొమ్మలూ చూశావా ఎంత బలంగా ఉన్నాయో? నన్ను తాకితే అతనికున్న ప్రభంజనుడనే బిరుదుపోతుంది' అంది బూరుగ నవ్వుతూ.*

*'ప్రభంజనుడంటే సర్వాన్నీ చక్కగా విరిచేవాడని అర్థం. ఏమోలే, ఎందుకైనా మంచిది... నీ కొమ్మలూ, రెమ్మలూ జాగ్రత్త.*

**గాలికి అన్ని చెట్లూ కూలిపోతాయి గాని, నువ్వు మాత్రం స్థిరంగా ఉంటావు. ఏమిటి కిటుకు?**

వస్తా’ అంటూ వెళ్లిపోయాడు నారదుడు. సంగతంతా చిటికెలో అందించేశాడు వాయు దేవుడికి. ఆయన ఉగ్రంగా రానే వచ్చాడు.

‘ఏమే బూరుగా! ఏం వాగావు? నిన్ను తాకితే నాకున్న ప్రభంజనుడనే పేరు పోతుందా? నీకు చేటుకాలం వచ్చింది. అందుకే అలా మాట్లాడావు’ అన్నాడు కోపంగా.

‘నువ్వు నన్ను తక్కువగా అంచనా వేస్తున్నావు. లోకంలో ఉన్న అన్ని వృక్షాలతోపాటే నన్నూ చూస్తున్నావు. నా గొప్పతనం నీకు తెలిసినట్టు లేదు’ అంది బూరుగ.

పకపక నవ్వాడు వాయుదేవుడు. ‘ఓహో...ఏం గర్వం?! అన్ని వృక్షాలలాంటి దానవు కాక నీకేం కొమ్మలు మొలిచాయా? ఒకనాడు బ్రహ్మదేవుడు నీ నీడలో నిలబడ్డాడు. ఆ గౌరవంకొద్దీ నిన్ను ఏం చెయ్యకుండా మన్నించాను. అందుకు ఇప్పుడిలా పొగరెక్కి మాట్లాడుతున్నావు. ఇప్పుడు



అత్యవసరమైన పనిలో ఉన్నాను. తీరికగా రేపొస్తాను. బలాబలాలు అప్పుడు చూసుకుందాం' అని వెళ్లిపోయాడు.

'అయ్యో మహాబలుడైన వాయుదేవుడితో వైరం పెట్టుకున్నానే! నే నెంత, నా బలమెంత? నారదుడి మాటలు విన్నాను కాను. భగవంతుడా! ఇప్పు డేం చెయ్యను?' అని ఆలోచించింది బూరుగ.

'రేపు నిజంగానే వాయుదేవు డొస్తే ఏం చేస్తాడు? కొమ్మలూ, రెమ్మలూ విరిచేస్తాడు. ఆకులు రాల్చేస్తాడు. అంతేగా?! ఆ పని నేనే చేసుకుంటే ఇక అతనేం చెయ్యలేడు. అప్పుడు అతను ఓడిపోయినట్టేగా!' అనుకుని ఆ రాత్రి తనకు తనే ఆకులూ, కొమ్మలూ, రెమ్మలూ విరిచేసుకుని మోడై నిలబడింది.

తెల్లవారింది.

భయంకరంగా ధ్వనిచేస్తూ ప్రతిజ్ఞ తీర్చుకోడానికి వచ్చాడు వాయుదేవుడు. వస్తూనే మొండిగా నిలబడిన చెట్టును చూసి పకాలున నవ్వాడు. 'ఇదేమిటి, బూరుగా! నా పని నువ్వే చేశావు. మంచిది; బుద్ధి తెచ్చుకున్నావు. బతికినన్నాళ్ళూ ఇలాగే ఉండు' అని హేళన చేసి వెళ్ళిపోయాడు.

బూరుగ సిగ్గుపడి తల వంచుకుంది ●

# 35. స్ట్రెస్ మేనేజ్‌మెంట్

స్ట్రెస్ అంటే ఒత్తిడి. మనలో అలజడిని, అశాంతిని, కోపాన్ని, నిరాశను, నిస్పృహను కలిగించేది ఏదైనా అది స్ట్రెస్సే.

Dr. Hans Seyle, the noted expert on Stress says, "Stress...like relativity, is a scientific concept which has suffered from the mixed blessing of being too well known and too little understood"

నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించే క్రమంలో ఎదురవుతున్న విఘాతాలను అధిగమించాలంటే ఒక్కోసారి మనకు కొంత 'స్టిమ్యులేషన్' కావాలి. స్టిమ్యులేషన్ కావాలంటే దానికి సరిపడినంత స్ట్రెస్ మనమీద ఉండాలి. సో, సమ్‌టైమ్స్ వీ ఇన్వైట్ మైల్డ్ స్ట్రెస్ టు అవాయిడ్ బోర్‌డమ్ అండ్ టు హావ్ సమ్ మోటివేషన్ ఫర్ ఎ గివెన్ యాక్టివిటీ. ఇలా మన సంతోషంకోసం మనం కోరి తెచ్చుకునే స్ట్రెస్సుని ఈస్ట్రెస్ (EUSTRESS) అంటారు. బాధని, భయాల్ని కలిగించే స్ట్రెస్సును డిస్ట్రెస్ (DISTRESS) అంటారు. ఇంతింతై వటుడింతై అన్నట్లు ఈ డిస్ట్రెస్ దాని పరిధులు, పరిమితులూ అతిక్రమించి ఆక్టోపస్‌లా ఈరోజు మనల్ని పూర్తిగా లోబరుచుకుంటోంది. అదీ విచారం! అంతంలేని కోరికలు, లెక్కకు మించిన అవసరాలు, నేల విడిచి చేసే సాముగారిడీలు, తీరని కోర్కెలు, సాధించలేకపోతున్న లక్ష్యాలు, ఇంకా చాలాచాలా ఉన్నాయి. అవన్నీ మనల్ని బాధలకు, టెన్షన్లకు గురిచేస్తున్నాయి. కొన్ని వేల సంవత్సరాలక్రితవే కపిలుడు తన సాంఖ్యయోగంలో

> **సంతోషంకోసం మనం కోరి తెచ్చుకునే స్ట్రెస్సుని ఈస్ట్రెస్ అంటారు. బాధలు, భయాలు కలిగించే స్ట్రెస్సును డిస్ట్రెస్ అంటారు.**

మానసిక సమస్యలకు కారణాలను మూడింటికింద వర్గీకరించాడు. మొదటిది ఆత్మిక్ ఇండివిద్యువల్, రెండవది భావిక్–సొసైటల్, మూడవది దావిక్ అంటే ఎన్విరాన్‌మెంటల్.

Richard Lazarus, an authority on Psychological Stress says that stress can simply be defined as a special kind of transaction between a person and his environment. Much depends upon the coping skills of an individual.

ఫిజికల్ ఫాక్టర్స్ అంటే నిర్ణీత గడువులోగా ఒక పనిని పూర్తిచేయాలన్న తలంపుతో శక్తికి మించి శ్రమించడం; ఫిజియోలాజికల్ ఫాక్టర్స్ అంటే సరైన ఆహారంగాని, సరిపడినంత నిద్రగాని లేదా విశ్రాంతిగాని లేకపోవడం, మానసికోల్లాసం కొరవడడం; సైకలాజికల్ ఫాక్టర్ అంటే కుటుంబంతో మంచి సంబంధాలు లేకపోవడం, పనిచేసే చోట అధికారులతోనూ, సిబ్బందితోనూ సఖ్యం లేకపోవడం, చీటికీ మాటికీ పై అధికారులు విరుచుకుపడుతూ ఉండడం, వ్యాపారంలో ఒడిదుడుకులు రావడంవంటి వాటివల్ల మనపై స్ట్రెస్ పెరుగుతుంది. ఒక సందర్భంలో ముంబయిలో బాంబే



సబర్బన్ ఎలక్ట్రికల్ సర్వీసెస్ లిమిటెడ్‌కు చెందిన మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ విభాగం చీఫ్ డాక్టర్ సతీష్ పాయ్‌ను కలిశాను. ఆయన గత పదేళ్లుగా కార్పొరేట్ మేనేజర్లకు ధ్యాన, యోగ, శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నారు. స్ట్రెస్ మేనేజ్‌మెంట్‌లో 'యోగ' ఈజ్ ది బెస్ట్ వే అని ఆయన చెప్పారు. 'Yoga is not an external therapy but a culture which has in-built system of preventing disharmony, stress and disease. Yoga develops immunity to several disorders and ensures coordination of mind and body by giving a unique rhythm to the system' అని చెప్పారు సతీష్ పాయ్. పతంజలి మహర్షి తన యోగ సూత్రాల్లో మనం అనుకుంటున్న ఈ స్ట్రెస్‌నే 'క్లేశము' అని పేర్కొన్నాడు. ఉపనిషత్తుల్లో కూడా ఈ స్ట్రెస్సును గురించిన ప్రస్తావన ఉంది. అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ అన్న పేర్లతో మనలో అయిదు కోశాలున్నాయి. మనోమయ, ప్రాణమయ కోశాలలో ఏమాత్రం 'ఇమ్‌బాలెన్స్' – అంటే హెచ్చుతగ్గులు ఏర్పడ్డా ఆ ప్రభావం అన్నమయ కోశంపై ఉంటుంది. దీన్నే వైద్యులు మన మనసుకు సంబంధించిన చికాకులు, ఒడిదుడుకులు మన జీర్ణక్రియని దెబ్బతీస్తాయని చెబుతున్నారు. దీన్ని 'ఒత్తిడి' అని తెలుగులో అంటే స్ట్రెస్ అని ఇంగ్లీషులో పిలుస్తారు. మోడరన్ సైన్స్ అయితే ముద్దుగా Psychosomatic అని పిలుస్తోంది.

**ఇమ్‌బాలెన్స్ ఎందుకు ఏర్పడుతుంది? ఈగో ప్రాబ్లెమ్స్‌వల్ల ఫ్రస్ట్రేషన్స్ వల్ల, కాన్‌ఫ్లిక్ట్స్ వల్ల!**

అసలీ ఇమ్‌బాలెన్స్ ఎందుకు ఏర్పడుతుంది? ఈగో ప్రాబ్లెమ్స్‌వల్ల, ఫ్రస్ట్రేషన్స్‌వల్ల, కాన్‌ఫ్లిక్ట్స్‌వల్ల, ఊహలకు – వాస్తవాలకు మధ్య పొంతన లేకపోవడంవల్ల, ఫాల్స్ నోషన్స్‌వల్ల! 'యోగ' ద్వారా క్రమక్రమంగా దీన్ని తగ్గించుకోవచ్చని ముంబయిలో సతీష్

పాయ్‌తోపాటు పరిచయమైన మేనేజ్‌మెంట్ నిపుణులు ప్రొఫెసర్ బాలకృష్ణ, ప్రొఫెసర్ సేతు, ప్రొఫెసర్ సురేష్ పండిట్ చెప్పారు.

> **ఆత్మకు క్షేత్రజ్ఞుడు భూతాత్మకుడు, పురుషుడు పరమేశ్వరుడు, బుద్ధిసాక్షి, జనన రహితుడు అనే పేర్లు ఉన్నాయి.**

ఈ విషయంలో భీష్ముడు ఏం చెప్పాడో కూడా చూడండి. దీన్ని ఆయన ఆధ్యాత్మ విద్య అని పిలిచాడు.

'ఇంద్రియాలను ఇంద్రియార్థాల నుండి మరలించి, మనస్సుతో కూర్చి బుద్ధితో అణచగలిగిన పురుషుడికి ఏ కోర్కెలూ ఉండవు. అందువల్ల అతని కింక మళ్లీ జన్మ కూడా ఉండదు. ఆత్మకు క్షేత్రజ్ఞుడు, భూతాత్ముడు, పురుషుడు, పరమేశ్వరుడు, బుద్ధిసాక్షి, జనన రహితుడు అనే పేర్లు ఉన్నాయి. విషయ సుఖాలనే మాయాస్వప్నంలోపడి ఆత్ముడు తనను తాను తెలుసుకోలేకపోతున్నాడు. అందుచేత భ్రమలో కూరుకుపోయి సుఖం, దుఃఖం అనుకుంటున్నాడు. సత్వగుణం, రజోగుణం, తమోగుణం అనే ఈ మూడూ మాయకు మూలం. తలివైనవాడు ఈ సంగతి తెలుసుకుని వీటిని వదిలి పెట్టాలి. ముందు తమోగుణం, రజోగుణం వదిలేసి సత్వగుణాన్ని అవలంబించాలి. క్రమక్రమంగా దాన్ని కూడా వదిలిపెట్టాలి. తమోగుణంవల్ల కేవలం అజ్ఞానం కలుగుతుంది. రజోగుణం దుఃఖాన్ని కలిగిస్తుంది. సత్వగుణం సుఖాన్ని కలిగిస్తుంది. కష్టం, సుఖం సమానంగా భావించే మనస్సు ఎప్పుడు వస్తుందో అప్పుడీ గుణాలు, వాటివల్ల పుట్టిన మాయ నశించిపోతాయి.

మనస్సు నిశ్చలమై ఏకాగ్రంగా నిలవాలంటే నిష్ఠ అవలంబించాలి. ఆ నిష్ఠవల్ల మనస్సు ఒక లక్ష్యాన్ని చేరుతుంది. కాని, మేఘంలో మెరుపులా తామరాకుమీది నీటిబిందువులా చంచలంగా ఉంటుంది. లక్ష్యంపట్ల స్థిరంగా ఉండదు మనస్సు. స్థిరంగా ఉండాలంటే ప్రాణాయామం చెయ్యాలి.

క్రమక్రమంగా తప్ప అది సాధ్యం కాదు. పూర్తిగా దాన్ని సాధించేవరకూ అలసటా విసుగూ రాకూడదు. అందుకుగాను యమం, నియమం, ఆసనం, ప్రాణాయామం, ప్రత్యాహారం, ధారణ, ధ్యానం, సమాధి అనే ఎనిమిది రకాల నిష్ఠలు అవలంబించాలి. అప్పుడు తననుగురించి తాను తెలుసుకునే విచారం, వితర్కం కలుగుతాయి. వివేకం మేల్కొంటుంది. వాయువు అంతర్నాడిద్వారా ప్రవహించి చివరకు బ్రహ్మపదం చేరుకుంటుంది. చిత్తశాంతి, ఆనందం కలుగుతాయి. అప్పుడు ఆ మనిషి ఆ ఆనందంలోనే కలిసిపోతాడు.

యమ – Rules related to Social behaviour; నియమ – Rules related to individual behaviour; ఆసన – Postures; ప్రాణాయామం – breathing techniques. ఈ నాలుగూ శరీరానికి సంబంధించినవి. ప్రత్యాహారం – Non - attachment, ధారణ – Concentration, ధ్యానం – Meditation, సమాధి – Ultimate goal. చివరి ఈ నాలుగూ మనస్సుకు సంబంధించినవి. ఓ పక్క ప్రాణాయామం, ధ్యానం చేస్తూ మరోపక్క సుఖాసనం, పద్మాసనం, వజ్రాసనం, సిద్ధాసనం, యోగముద్ర, సర్వాంగాసనం, శవాసనం వంటి ఆసనాలు వేస్తే 'స్ట్రెస్' ను నివారించవచ్చని భీష్ముడు ఏనాడో చెప్పాడు. సంతోషంగా ఉండడంవల్ల, సంతృప్తిగా ఉండడంవల్ల 'స్ట్రెస్' మన దరిదాపులకురాదని, అందుకు ధ్యాన యోగాలే సరైన మార్గమని విజ్ఞులందరూ చెబుతున్నారు ●

# 36. నాయకులు విలువల్ని పోగుచెయ్యాలి!

‘**దా**యాదుల్ని చంపుకున్నానని ఎందు కేడుస్తావు? వాళ్లెంత దుర్మార్గులో నీకు తెలీదా? అయినా ఎవరు పుడితే వంశం ఉన్నతి పొందుతుందో వారి పుట్టుకే పుట్టుకగాని, మిగిలినవాళ్లు పుడితేనేం, చస్తేనేం? ‘మీరే ప్రభువులు, మీరే సార్వభౌములు, మీరే రాజాధిరాజులు, మేమంతా మీ దాసానుదాసులం. మీరు చెప్పినట్టే చేసి, ఆడమన్నట్టే ఆడి మీ కనుసన్నల్లో బతుకుతాం’ అన్నవాళ్లనీ, ధర్మాధర్మాలతో పనిలేకుండా ఆయన ఆజ్ఞానుసారం మెలిగిన వాళ్లనీ దుర్యోధనుడు చేరదీశాడు. అతని పరివారమూ అంతే! అంతా తెలిసీ తెలియనివాళ్లు, తెలివిమీరిన వాళ్లు. నాయకులెప్పుడూ మరికొందరు నాయకుల్ని తయారుచెయ్యాలి కాని, వందిమాగధుల్నీ, స్తోత్రపాఠాలు వల్లించేవారినీ, గొర్రెల్లాంటి అనుచరుల్నీ కాదు పెంచాల్సింది’ అన్నాడు భీష్ముడు ధర్మరాజుతో.

ముమ్మాటికీ నిజ మది!

లక్నోలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌కు చెందిన ప్రొఫెసర్ దెబసీష్ చటర్జీ ఒక పత్రిక కిచ్చిన ఇంటర్వ్యూలో 'Leaders lead leaders - not followers. Leaders are those who transform information into insight' అని చెబుతూ, లీడర్‌షిప్‌ను గాంధీ ఎలా భావించారో కూడా చెప్పారు : 'The best way to find yourself is to lose yourself in the service of others'.

**నాయకులెప్పుడూ మరికొందరు నాయకుల్ని తయారుచెయ్యాలి కాని, వందిమాగధుల్ని కాదు.**

ఎంత ఉదాత్తమైన భావన! మానవ సేవలోనూ, పరోపకారంలోనూ నిన్ను నువ్వు పూర్తిగా కోల్పోవాలి. నిన్ను నువ్వు

**వాల్యూ బేస్డ్ లీడర్‌షిప్‌ను పెంపొందించడం నేటి అవసరం. ఇందుకు మానవ వనరుల అభివృద్ధి, శిక్షణా సంస్థలు ముందుకు రావాలి.**

త్యజించుకోవాలి. నీ మీద ఉన్న మమకారాన్ని నువ్వు చంపుకోవాలి. నిన్ను నువ్వు మరిచిపోయి నిస్వార్థంగా పొరుగువారికి సాయపడాలి. ఆ లక్షణం నాయకు లందరికీ ఉండాలిట.

అంపశయ్యమీద కదలలేక ఉన్న భీష్ముడు పదప్రసూనాలతో కృష్ణుణ్ణి అర్చిస్తూ 'ప్రభూ! నేనేమి జ్ఞానినని పాండుపుత్రులకు ధర్మరహస్యాలు ఉపదేశిస్తాను?! అయినా, నీ స్నేహంకోసం నా జ్ఞానాన్ని ఎప్పుడో పరిత్యజించాను. ఎవరైనా నీకు భక్తులు కావాలంటే నిస్సంకోచంగా వాళ్లను వాళ్లు కోల్పోవాల్సిందే. సర్వం విష్ణుమయం అనే బుద్ధి కలగవలసిందే. అప్పుడే వాళ్లకు పరమపదం లభించేది' అని నమస్కరించాడు. అవునుమరి, మానవులందరూ మాధవుడి రూపాలని అనుకునేకదా చేసిన ప్రతి పనీ భగవదారాధనలాగ, భక్తిపూర్వకమైన ఆత్మార్పణలా చేశాడు గాంధీ కూడా!

నాయకు లన్నవారు డబ్బు ఒక్కటే కాదు పోగు చేయాల్సింది; విలువల్ని కూడా పోగు చేయాలి. అదేం మాయో తెలీదు, సక్రమమో, అక్రమమో ఏదో ఒక మార్గాన సోషల్ లాడర్ మీద ఎగబాకే వాళ్లనూ, ఎలాగో అలా కోట్లు గడించే వాళ్లనూ నాయకులకింద లెక్కేస్తున్నాం. వాళ్ల డబ్బుకీ, డాబుకీ భయపడి మనమే వాళ్ళను ముందుకు నడిపి, వాళ్ల వెనుక మనం నడుస్తున్నాం. దానితో వాళ్లు నాయకులైపోతున్నారు.

మన సిరిసంపదలకు మనం ధర్మకర్తలమేకాని, యజమానులం కాదనుకోవాలి ఎవరైనా. ముఖ్యంగా వ్యాపారరంగంలో లీడర్లన్నవాళ్లు తాము క్రమక్రమాభివృద్ధి చెందుతూ విలువల్ని కూడా పెంపుచెయ్యాలి. తమ అభివృద్ధి తమకు ఎంత ముఖ్యమో సమాజాభ్యున్నతి కూడా అంతే ముఖ్యం

అనుకోవాలి. ఇందుకు వాళ్లు వాళ్ళ మనస్సుల్ని విశాలం చేసుకోవాలి. బుద్ధిని విశాలం చేసుకోవాలి. ఈ రకమైన వాల్యూ బేస్డ్ లీడర్‌షిప్‌ను పెంపొందించాల్సిన అవసరం ఇప్పుడు ఎంతైనా ఉంది. ఇందుకోసం మానవ వనరుల అభివృద్ధి, శిక్షణా సంస్థలు ముందుకు రావాలి. అఖండ భారత ఔన్నత్యాన్నీ, మనం మరిచిపోయిన విలువల్నీ, పరోపకారమే పరమధర్మంగా బతికిన మనుషుల్నీ, సత్యవాదుల్నీ, దానవీరుల్నీ, పరాక్రమశాలుర్నీ, దయావంతుల్నీ అందరినీ గుర్తు చెయ్యాలి. వాళ్లందరి గురించీ పదే పదే చెప్పాలి. వాళ్ల సుగుణాలను ఈ తరం హృదయాలలో పదిల పరుచుకుని తదనుగుణంగా నడుచుకునేలా శిక్షణ ఇవ్వాలి.

ఇఫ్ యు డోంట్ హావ్ లీడర్స్ – యు క్రియేట్ దెమ్. మనం ఎవరినైతే ఆదర్శప్రాయంగా, రోల్ మోడల్‌గా చూపుతున్నామో వాళ్ళ వేషభాషల్నీ, మానరిజమ్స్‌నీ అనుకరించడం దగ్గరే ఎవరూ ఆగిపోకూడదు. అనుకరణ అభివృద్ధీ కాదు, నాగరికతా కాదు. రాజుగారి వేషం వేసుకున్నంత మాత్రాన



రాజుల మవుతామా? సింహం తోలు కప్పుకున్నంత మాత్రాన సింహాలమవుతామా? అనుకరణకు, నేర్చుకోవడానికి తేడా ఉంది. ఆదర్శమూర్తులు గౌరవించిన విలువల్నీ, అనుసరించిన సిద్ధాంతాల్నీ, వ్యక్తం చేసిన అభిప్రాయాలనూ మనం వెతికి పట్టుకోవాలి. వాటిని అర్థం చేసుకుంటూ స్వీయకృషితో మనల్ని మనం ఆవిష్కరించుకోవాలి. అదీ వ్యక్తిత్వ మంటే. విత్తనాన్ని భూమిలో పెట్టి గాలి సమృద్ధిగా లభించేందుకు నేలను గుల్లచేస్తాం. నీళ్లు పోస్తాం. ఆ విత్తు మొలకెత్తి గాలి, నీరు, వెలుతురు అన్నీ ఉపయోగించుకుని చెట్టు అయి, ఆ తరువాత మహావృక్ష మవుతుంది. వాటన్నిటి ఆసరా తీసుకున్నాం కదా అని విత్తు మట్టి కాలేదు, నీరు కాలేదు, వెలుతురు కాలేదు. చెట్టే అయింది. వృక్షమే అయింది.

మనమూ అంతే! అన్నీ తెలుసుకోవాలి. అన్నీ నేర్చుకోవాలి. కానీ, ఎవరిగానూ మారిపోకూడదు.

టు బి ట్రూలీ గ్రేట్ – యు హావ్ టు బి ట్రూలీ యువర్‌సెల్ఫ్! ●

* * *

## BHEESHMA @ MANAGEMENT & GOVERNANCE

PRAYAAGA RAMAKRISHNA

Claims about India being the crucible of the most ancient civilisation, being the originator of mathematics, rockets and missiles and a lot else are passe. To the long list of ideas and inventions claims to have originated here, the latest is the concept of literature-based management education.

❋

ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, అహమదాబాద్‌లో ఒకప్పుడు పాశ్చాత్య సాహిత్యం ఆధారంగా సాగిన బోధన ఇప్పుడు భారతీయ ఇతిహాససంపద ప్రాతిపదికగా జరుగుతోంది.

❋

అంతర్జాతీయ సంక్షోభ పరిష్కర్తగా పేరుపొందిన సందీప్ వాస్లేకర్: సంక్షోభాల నివారణకు కావల్సిన చిట్కాలనన్నిటినీ నేను మహాభారతంలాంటి కావ్యాలనుంచి తీసుకుంటాను.

❋

ఆధునిక మానవుడి ఆలోచనా విధానం, జీవన విధానాల మెరుగుదలకు, వ్యక్తుల సామూహిక ప్రగతికి, సంస్థల అభివృద్ధికి అమృతోపమానంగా ఉపకరించే భావధార ఈ 'భీష్మ @ మేనేజ్‌మెంట్ & గవర్నెన్స్'

❋

ప్రయాగ భారతతంత్రాలను, సమాచారాన్ని బదిలీ చేసే నైపుణ్యాన్ని సాధించిన శిక్షణావేత్తగా ఇందులోని విశేషాలను కూర్చారు. అందువల్ల శిక్షణా సంస్థలకు ఇది పరిశీలక గ్రంథం అవుతోంది.

- పి.వి.ఆర్.కె. ప్రసాద్
ఐ.ఎ.ఎస్.